సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి జూన్ సోమవారం 27 - ఆదివారం 3 జూలై, 2016 సంపుటి : 1 సంచిక 40 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## అన్నవరం దేవస్థానం వ్యవస్థాపక దర్మకర్తగా రోహిత్ ప్రమాణస్వీకారం



**రాజధాని ప్రతినిధి - అన్నవరం :** తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం వ్యవస్థాపక దర్మకర్తగా ఇనుగంటి వెంకట రోహిత్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత దేవస్థానం ఈఓ నాగేశ్వరరావు ప్రమాణం చేయించారు. వ్యవస్థాపక దర్మకర్తగా ఉన్న రామ్‌కుమార్ మృతి చెందడంతో ఆయన కుమారుడు రోహిత్ ఆ స్థానంలో ప్రభుత్వం నియమించింది.

### మాసాట్ ట్యాంక్ నుంచి కృష్ణా తీరానికి...

## సొంతగూటిని వదులుకొని వచ్చిన సమాచార శాఖ

**విజయవాడ :** హైదరాబాద్ నగర నడిబొడ్డు లక్డీకపూల్ నుంచి మాసాబ్ ట్యాంక్ వైపు ప్రయాణం. కుడివైపు -పి.టీ.ఐ,యు.ఎన్.ఐ, ఆఫీసులు దాటగానే మహావీర్ హాస్పిటల్ బీ దానికి ఎదురుగా 'సమాచార భవన్'.దాని లోపల ఏడాది పొడవునా ఏదో ఒక సందడే సందడి ! కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం - ముఖ్యమంత్రి-మంత్రిమండలి ప్రమాణస్వీకారం-సందడి. అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ పర్యటన -సందడి. భారత రాష్ట్రపతి పక్షం రోజులు దక్షిణాది శీతాకాల విడిదికి హైదరాబాద్ రాక-సందడి. రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమాలు-సందడి.ఇలా ఒకదానికొకటి పొంతన లేని సందర్భాలకు ఇక్కడ సందడి ఏమిటి ? ఎందుకు?ఆ సందేహానికి సమాధానం అది-సమాచార, పౌర సంబంధాలు శాఖ కమిషనర్ కార్యాలయం. ఈ కార్యాలయం- ఇక్కడి అధికారులు, సిబ్బంది పనిచేయకపోయినా,పైన చెప్పిన కార్యక్రమాలన్ని జరుగుతాయి. కానీ, అవి జరిగినట్టు బయటకు తెలియదు. ఈ శాఖ పనిచేస్తున్నది కనుక ప్రభుత్వ సమాచారం సకాలంలో పత్రికా కార్యాలయాలకు,టీవీ ఛానళ్ల స్టూడియోలకు చేరుతుంది. వాటి ద్వారా ప్రజలకు వార్తలుగా అవి చేరతాయి. అయితే అటువంటి కీలక పాత్రను పోషించే సమాచార శాఖ రాష్ట్ర విభజన అనంతరం శాఖాధిపతుల కార్యాలయాల తరలింపులో భాగంగా హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ కేంద్ర కార్యాలయ ప్రాంగణం నుంచి బయలుదేరి, శుక్రవారం ఉదయం విజయవాడ స్వరాజ్ మైదానం సమీపంలోని స్టేట్ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కార్యాలయంలోకి అడుగుపెట్టింది.కాలానుగుణంగా రూపాంతరం చెందుతూ వచ్చిన సమాచార, పౌర సంబంధాల శాఖ... 1950ల ఆరంభంలోనే పంచవర్ష ప్రణాళికలతో పాటుగా ప్రభుత్వంలో ఉనికిలోకి వచ్చింది. సుదీర్ఘకాలం పాటు ఇది నాంపల్లిలో 'గృహకల్ప' భవనంలో ఉండేది. ఆ తర్వాత అక్కడే ఉన్న 'గగన విహార్' కాంప్లెక్స్‌లోకి మారింది. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ శాఖ కార్యకలాపాల్లో వేగం పెరిగింది. అందులో భాగంగా ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ వద్ద 1989 మార్చి 4న 'సమాచార భవన్' కు శంఖుస్థాపన జరిగింది. నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 1991లో సమాచార శాఖ, దానితో అనుబంధంగా పనిచేసే రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అద్దె భవనాల నుంచి సొంత భవనాల్లోకి మారింది. దాంతో - సమావేశ మందిరాలు, ఫోటో స్టూడియోలు, డార్క్ రూమ్, వీడియో రికార్డింగ్ ల్యాబ్, ఉత్తమ చిత్రాల ఎంపిక కోసం చిత్ర ప్రదర్శనకు మిని థియేటర్, పాత్రికేయుల సౌలభ్యం కోసం ప్రెస్ లాంజ్ వంటివి ఏర్పాటు చేయడం జరిగింది.అయితే ఆంధ్రప్రదేశ్ భాగంగా శాఖాధికారుల కార్యాలయాలు అమరావతికి తరలింపులో భాగంగా సమాచార, పౌరసంబంధాల శాఖ, ఏపీ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సొంత భవనాలు వదిలిపెట్టి కేవలం ఫైళ్లు, కంప్యూటర్లు, పాత టేబుళ్లు, కుర్చీలతో విజయవాడకు చేరుకుంది. మిగతా శాఖల మాదిరిగా ఈ శాఖకు రాష్ట్రంలో ఎక్కడా సొంత స్థలాలు లేకపోవడంతో మొదటి నుంచి విజయవాడ వంటి పత్రికా కార్యాలయాలు కేంద్రంలో కూడా ఈ కార్యాలయాలు ఇన్నాళ్లు అద్దె భవనాల్లోనే పనిచేశాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర కార్యాలయమే ఇక్కడకు రావాల్సి వచ్చేసరికి ఈ శాఖకు ఒక సొంత గూడంటూ లేకుండా పోయింది. కమిషనర్ కార్యాలయం స్టేట్ గెస్ట్ హౌస్‌లో తాత్కాలికంగా పని ప్రారంభిస్తే, ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ భవనంలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకుంది.అయితే స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అద్దెకు 15 వేల చదరపు అడుగుల స్థలం కేటాయించవలసిందిగా ఇప్పటికే కమిషనర్ కోరారు. అది సిద్ధం కావడానికి 3 నెలల వ్యవధి అవసరం అవుతుంది. ఆ తర్వాత ఈ కార్యాలయాలు అక్కడకు మారతాయి. అయితే విభజనకు ముందు సొంత భవనాల్లో ఉండి పనిచేసిన ఈ శాఖ కమిషనర్ కార్యాలయానికి, ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌కు నూతన రాజధానిలో ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఎటువంటి ప్రాధాన్యత ఇస్తుందోనని అధికారులు, సిబ్బంది నిరీక్షణతో ఉన్నారు. ఏది ఏమైనా ఇప్పుడు తాత్కాలిక వసతి అయినా వీలైనంత సత్వరమే విజయవాడ నుంచి విధులు నిర్వహించడానికి అధికారులు, సిబ్బంది క్రమంగా మానసికంగా సిద్ధపడుతున్నారు.

# చారిత్రాత్మక ఘట్టం

- సీడ్ క్యాపిటల్ రహదారికి సీఎం శంకుస్థాపన
- 3చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభం, రైతులకు ప్లాట్లు పంపిణీ
- బుధవారం నుంచి నవ్యాంధ్ర పాలన
- జూలై చివరినాటికి తరలింపు పూర్తి






సీడ్ క్యాపిటల్ రహదారికి శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

**రాజధాని ప్రతినిధి, వెలగపూడి, తుళ్ళూరు :** సీడ్ క్యాపిటల్ రహదారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద రూ.215 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.సీడ్ క్యాపిటల్‌కు అనుసంధానంగా విజయవాడ వారధి నుంచి బోరుపాలెం వరకు సీడ్ యాక్సిస్ రోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు.అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే రహదారి నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.రాజధాని రహదారుల అభివృద్దితో పాటు ఈ ప్రాంత ప్రజానీకం అన్ని రంగాల్లో ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.రహదారి నిర్మాణం 9 నెలలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**రైతులకు ప్లాట్లు పంపిణీ**

రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్లాట్లు పంపిణీ చేశారు. తుళ్లూరు మండలం నేలపాడు గ్రామ రైతులకు స్థానిక సీఆర్‌డీఏ కార్యాలయంలో ప్లాట్లు పంపిణీ చేశారు. ఈ నెల 20 వ తేదిన ప్లాట్లు పంపిణీ చేసేందుకు ప్రయత్నించగా వర్షాలు కురవడంతో వాయిదా పడింది.దీంతో ముఖ్యమంత్రి శనివారము రైతులకు లాటరీ విధానంలో ప్లాట్లు పంపిణీ చేశారు. రాజధాని నిర్మాణానికి మొట్టమొదటిగా భూములు ఇచ్చిన నేలపాడుకు చెందిన కొమ్మినేని ఆదిలక్ష్మితో పాటు మరికొందరి రైతులకు ముఖ్యమంత్రి ప్లాట్లు పంపిణీ చేశారు.ప్లాట్లు పంపిణీకి వినూత్న తరహాలో సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను అధికారులు రూపొందిచినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. నేలపాడు రైతులు రాజధాని నిర్మాణానికి 1410 ఎకరాలు ఇచ్చారని చెబుతూ వారందరికి ప్లాట్లు పంపిణీ చేస్తామన్నారు.నేలపాడు రైతులు రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. రాజధానిలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన రహదారులు నిర్మిస్తామన్నారు.ప్రపంచంలో 10 ముఖ్యమైన నగరాలలో అమరావతిని ఒక నగరంగా తీర్చిదిద్దాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు.కేంద్ర సహకారం,నిధుల లేమి ఉన్నప్పటికి అంకురీతదీక్షతో రాజధాని నిర్మాణం చేపట్టినట్లు ముఖ్యమంత్రి చెప్పారు.స్విస్ ఛాలెంజ్ విధానంకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.వైయస్‌ఆర్ సీపి, కాంగ్రెస్ నాయకులు రాజధాని నిర్మాణంలో లక్ష కోట్లు అవినీతి జరిగిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, రావెల కిషోర్‌బాబు, నిమ్మకాయల చినరాజప్ప, సీఆర్‌డీఏ కమీషనర్

➤ మిగతా 2లో..



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

## అన్న క్యాంటీన్ ప్రారంభం

వెంకటపాలెంలో సీడ్ క్యాపిటల్ రహదారి శంకుస్థాపన అనంతరం వెలగపూడిలో అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు ప్రారంభించారు.300 చదరపు అడుగు విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన భోజనశాలలో రోజుకు 300 నుంచి 400 మంది ఈ క్యాంటీన్‌కు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతకుముందు తాత్కాలిక సచివాలయం సమీపంలోని మల్కాపురంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి పరిటాల సునీత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ... పేదవారి ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రాయలసీమలోని అన్న క్యాంటీన్లలో రాగి సంకటి అందజేయనున్నట్లు సునీత చెప్పారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో మరో రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు పరిటాల సునీత చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సునీత అన్నారు. ఏపీ మంత్రులు చినరాజప్ప, నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీత, రావెల కిశోర్‌బాబు తదితరులు క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు, రాత్రి 7 నుంచి 9గంటల వరకు భోజనం అందుబాటులో ఉంటుంది. క్యాంటీన్‌లో ధరలు 2 ఇడ్లీ రూ.3లు, పొంగల్ రూ.5లు, ఉప్మా రూ.5లు, పులిహోర రూ.5లు, సాంబారు అన్నం రూ.7లు, పెరుగన్నం రూ.5లు, చపాతీ రూ.4లుగా ధర నిర్ణయించారు.

## బుధవారం నుంచి నవ్యాంధ్ర పాలన

హైదరాబాద్ నుంచి వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులతో కళకళలాడుతోంది. శుక్రవారం ఉదయం సహకార, వాణిజ్య, సమాచారశాఖకు చెందిన ఉద్యోగులు ప్రత్యేక బస్సులో ఇక్కడికి చేరుకున్నారు. వారికి ఇక్కడి నేతలు పుష్పగుచ్ఛాలతో సాదర ఆహ్వానం పలికారు. రాజధాని అవసరాల మేరకు పనిచేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాముల మవుతామని ఉద్యోగులు వెల్లడించారు. అతి తక్కువ సమయంలోనే గుంటూరుకు తరలి వచ్చిన సహకారశాఖ శ్యామలానగర్‌లోని నూతనంగా నిర్మితమైన భవంతిలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు గుంటూరులో 10 శాఖలు ప్రారంభించారు. కాగా డిపార్ట్‌మెంట్ ఎంప్లాయ్‌మెంట్, ఐటీఐ శాఖలు శనివారం విజయవాడకు చేరుకున్నాయి... మరో 14 శాఖలు ఇప్పటికే విజయవాడకు చేరుకున్నాయి. హైదరాబాద్ నుంచి ఇక్కడకు హెచ్‌డీఓ శాఖలు 58 రావాల్సి ఉండగా, సగం ఇప్పటికే నవ్యాంధ్ర రాజధాని చేరుకున్నాయి. జంటనగరాలైన గుంటూరు-విజయవాడలకు సచివాలయ సిబ్బంది 3 వేల మంది తరలి రానున్నారు. వీరు కాకుండా శాఖాధిపతుల కార్యాలయాల ఉద్యోగులు 9 వేల మంది మరికొంతమంది రానున్నారు. ఉద్యోగులు మిశ్రమ అనుభూతులకు లోనవుతున్నారు. హైదరాబాద్‌లో అలవాటైనా ఎప్పటికైనా ఇక్కడికి రావాలని తెలుసు...అందుకే అలవాటైనా ప్రదేశాన్ని వీడి అరకొర సౌకర్యాలతో కార్యాలయాల్లో పనిచేసేందుకు మానసికంగా సంసిద్ధ మవుతున్నారు. అయితే ఇంతవరకు తాత్కాలిక రాజధాని ప్రారంభం కాకపోవడంతో అద్దె భవనాల్లోనే కార్యాలయాలు ప్రారంభించారు. పౌరసరఫరాల శాఖ గుంటూరులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోగా, సాంఘిక సంక్షేమశాఖను కూడా రావెల కిషోర్‌బాబు అక్కడే ప్రారంభించారు. ఆర్థిక శాఖ, యువజనసర్వీసులు, రెవెన్యూ శాఖ రామవరప్పాడు, ప్రసాదంపాడు, గొల్లపూడి, గన్నవరం ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని కార్యాలయాలకు అద్దెల విషయంలో తర్జన భర్జనలు జరుగుతున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖతో పాటు మరికొన్ని కార్యాలయాలు అందుకు ఉదాహరణగా నిలుస్తాయి.



సచివాలయ ఉద్యోగులకు పుష్పగుచ్చాలను ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

### ఈవారం రాజధాని

- అన్న క్యాంటీన్లను రాష్ట్ర మంతా ఏర్పాటు చేస్తాం.. సీఎం చంద్రబాబు
- రాజధాని రైతులకు ప్లాట్ల పంపిణీకి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- పట్టాలెక్కిన రాజధాని : సీఎం
- కృష్ణానది ఏపీకి వరం: సీఎం
- కొండవీటి వాగు మురుగు నీటి తరలింపుకు పనులు

## రంజాన్ వేళలు — ఆఖరీ 10 రోజ్

ఇస్ దుఆ కో కస్‌రత్ సే పఢే.

అల్లాహుమ్మ ఖినా అజాబన్నారి వ ఆద్‌ఖిల్‌నల్ జన్నత మఅల్ అబ్‌రారి యా అజీజు యా గఫ్ఫారు

| తారీఖ్ | రోజే | రోజే ఆఖ్‌రీ వఖ్త్ | సహరీకా | ఇఫ్తార్ కా వఖ్త్ |
|---|---|---|---|---|
| 27-6-16 | పీర్ | 21 | 4-13 | 6-48 |
| 28-6-16 | మంగల్ | 22 | 4-13 | 6-48 |
| 29-6-16 | చహర్‌షంబ | 23 | 4-13 | 6-48 |
| 30-6-16 | జుమేరాత్ | 24 | 4-14 | 6-48 |
| 01-7-16 | జుముఅ | 25 | 4-14 | 6-49 |
| 02-7-16 | షబ్ ఎ ఖద్ర్ | 26 | 4-14 | 6-49 |
| 03-7-16 | ఇత్‌వార్ | 27 | 4-15 | 6-49 |

సహరీకే ఆఖరీ వఖ్త్ కే 5 మినిట్ బాద్ ఫజర్‌కీ ఆజాన్ దీజాయే




రాజధాని వార్తలు
కలం

# మొక్కలు నాటండి...

మనిషి మేథస్సు పెరిగి, హృదయ వైశాల్యం తరిగిపోతుంది... కరెన్సీపట్ల వ్యామోహం పెరిగి వర్తమానం అంధకారం చేసుకుంటున్నాడు. తాత్కాలిక ప్రయోజనాల కోసం శాశ్వత ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు. దానికి తాజా ఉదాహరణే వృక్ష్యాలు నరికి మొక్కలు నాటే కార్యక్రమం.. నిజానికియాభైఅరవై ఏళ్లనాటి మ్రానులు ఎంతటి ఉపయోగంగా ఉంటాయి. ఎంతచల్లదనాన్నిఇస్తాయి? ఎంతమంది ఆ చెట్ల నీడ కింద సేద తీరే వారు ..పశు పక్ష్యాదులు వాటిపై సేదతీరేవి... సకల ప్రాణికోటికి ప్రాణవాయువు ప్రసాదించే చెట్లను నరికి మొక్కలు నాటడం ఎంత తెలివితక్కువ పని.. బాటసారులు సేదతీరడానికి అశోకుడు చెట్లు నాటించెను... అని చరిత్రలో చదువుకున్నాం... అవి సామాన్యశాస్త్రం అభివృద్ధి చెందిన రోజులు ..ఇవి విజ్ఞానం పెరిగి జ్ఞానం తరిగిపోతున్నరోజులు... పచ్చదనం అంటే ప్రజానేతలకు, బడావ్యాపార వేత్తలకు కంటగింపుగా మారుతున్నాయి. కొండలు,గుట్టలు గ్రానైట్ పేరుతో పేల్చివేసి గిరిపుత్రులకు నిలువ నీడలేకుండా చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతున్న వీటి గురించి తప్పకుండా ఆలోచించాలి... హుదుద్ తుఫాను లాంటి ఉపద్రవాల్లో చెట్లను కోల్పోవడం వేరు... విజ్ఞత కోల్పోయి చెట్లను నరుక్కుంటూ పోవడం వేరు... ఈ పరిస్థితిని అడ్డుకుంటానికి ప్రజలంతా సమైఖ్యంగా తమ గళాలను వినిపించాలి. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలుగా వెలుగొందుతున్నవన్నీ ఇవే పర్యావరణ ద్రోహానికి పాల్పడి, కాలుష్యం, ఆమ్లవర్షాలతో సకల ప్రాణకోటికి ఉపద్రవాన్ని తెచ్చారు. దాంతో తెలివి తెచ్చుకున్న వారు పర్యావరణపరిరక్షణకు పెద్ద పీట వేశారు. రోడ్లు భవనాలు, పార్కులు, ఉద్యావనాలు, అడవులు అన్నీ సమపాళ్లలో ఉండేట్లు చూసుకున్నారు. అదే మన దేశానికి వచ్చేటప్పటికి కొంచెంకూడా దూరాలోచన లేకుండా వికృతంగా ప్రవర్తిస్తున్నారు. వందల ఏళ్లనాటి చెట్లు నరకాలంటే అటవీ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వాలే ఆపనికి పూనుకోవడంతో అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నిజానికి దీనికోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉన్నప్పటికీ దానిపై పనిభారం పెరిగి చురుగ్గా నిర్ణయాలు తీసుకొనే పరిస్థితి లేదు.

నిజానికి విదేశాల్లో ఏళ్లనాటి చెట్లను యంత్రాల ద్వారా వేరే ప్రాంతంలో నాటుతారు. అంతే కాని మన దేశంలో లాగా మ్రానులు తీసి రెండాకుల మొక్కలను నాటరు. రోడ్లవిస్తరణ, రైల్వేజోన్లు, విమానాశ్రయాలు, రాజధాని భవనాలు, మెట్రోరైళ్లు పేరుతో చెట్లన్నీ తొలగించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎండాకాలం అత్యధిక ఉష్ణోగ్రతలను ప్రజలకు రుచి చూపించారు. మెట్రోట్రైనులకు ముందు ఆ తార్వాత నగరాల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. 35 డిగ్రీలు దాటని నగరాలు అత్యధిక ఉష్ణోగ్రతలు భరించాల్సి వస్తోంది. అయితే తెలంగాణ రాష్ట్రంలో రాందేవ్ అనే వ్యాపారవేత్త హాబీగా అనేక చెట్లను సేకరించారు. దానిలో ప్రపంచవ్యాప్తంగా అరుదైన చెట్లు, రంగురంగుల పూలు, పళ్లు, విభిన్న ఆకృతుల్లో పెంచినవి చాలా ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆయన సేవలను వాడుకుంటే బావుంటుంది. చెట్ల విలువ తెలియక పోవడమే ఈ ప్రకృతి వినాహనానికి ప్రథమ కారణం... చెట్లపై పెరుగుతున్న ఈ దురాగతాలలతో పల్లెలు, పట్నాలు, నగరాలు తమ 'పచ్చధనం'న్ని కోల్పోయి రాజస్థాన్ ఎడారిగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2.26 లక్షల మొక్కలు నాటడానిక లక్ష్యంగా పెట్టుకోవడం ముదావహం..కేవలం రాజధాని ప్రాంతంలోనే 1.82 లక్షల మొక్కలను అటవీశాఖ ప్రారంభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. తిండి, బట్ట , గూడుకే ప్రజలు ఎంతో వెచ్చిస్తున్న ఈరోజుల్లో కనీసం వాతావరణ కాలుష్యం నుంచైన వారిని తప్పిలంచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఉపాధి హామీ పథకంలో ఈ మొక్కల పెంపకం జరిగితేనే ప్రయోజనం చేకూరుతుంది. లేకుండే కాగితాలకే ఈ ప్రణాళిక పరిమితమవుతుంది. ఒకప్పుడు మనం అనుభవించిన పచ్చదనాన్ని భావితరాలకు అందించాలి. ఖచ్చితమైన కార్యాచరణ ప్రారంభించి ప్రతి చెట్లునూ పరిరక్షించాలి. ప్రభుత్వం చిత్తశుద్ధితో మొక్కల పెంపకం జరిపితేనే కాంక్రీట్ జంగిల్ నుంచి ప్రజలకు రక్షణ కలుగుతుందని పర్యావరణవేత్తలు కోరుకుంటున్నారు.

# పట్టువదలని విక్రమార్కుడు

కృషి పట్టుదల మనిషి అభివృద్ధికి సోపానాలంటారు. గన్నవరం శాసనసభ్యులు డా॥ వల్లభనేని వంశీమోహన్ అందుకు తార్కాణంగా నిలుస్తారు. చిన్నతనంలోనే రాజకీయాల్లో అడుగుపెట్టి, పెద్దలు ఇచ్చిన అవకాశం అందిపుచ్చుకోవాలని ప్రయత్నించి, కాలం కలసిరాక ఓటర్ల మనస్తత్వం అర్థం చేసుకోలేక, తొలిదశలో ఓటమి చవిచూశారు. డా॥ వంశీ. అయినా నిరాశచెందలేదు. పట్టువదలని విక్రమార్కుడిలా శ్రమించారు. ప్రజలకు చేరువయ్యారు.గన్నవరంలో విజయ దుందుభి మ్రోగించారు. శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2009లో ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి పొలైన ఓట్లలో 47.02% ఓట్లు రాగా, డా॥ వంశీకి 2014 లో 49.5 శాతం ఓట్లు లభించాయి. గన్నవరం ఓటర్లు విలక్షణ మనస్తత్వం కలిగినవారు. పైగా కమ్యూనిస్టులకు అది కంచుకోట. వామ పక్షాలతో తెలుగుదేశం పొత్తులేని దశలో గన్నవరం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా డా॥ వంశీ పోటీకి దిగటం కత్తిమీద సాములాంటిదే. అయినా ఆయన్నే విజయలక్ష్మీ వరించింది. చిన్నవయస్సులో పెద్ద మనసుతో ఆలోచించి, ప్రజలకు మేలుచేయ తలంచటం, తపించటంతో గ్రామ గ్రామాన ప్రజల అభిమానం చూరగొన్నారు. అబాలగోపాలం ఆదరించారు. విజయం అందించారు. 1970 లో డా॥ వంశీమోహన్ కృష్ణాజిల్లా ఉంగుటూరులో జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులు. ఊహ తెలిసినప్పటి నుంచి సభ్యతగా, సంస్కారవంతంగా పెరగటం అలవాటు చేసుకొన్నారు. చదువులలో ముందుండేవారు. ఆటపాటల్లోనూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలచేవారు. తిరుపతిలోని పశువైద్య కళాశాల

| డా॥ వల్లభనేని వంశీమోహన్<br>గన్నవరం శాసనసభ్యులు | |
|---|---|
| పుట్టిన తేది | :1970 నవంబర్ 21 |
| జన్మస్థలం | : ఉంగుటూరు |
| విద్యార్హత | : ఎమ్.వి.ఎస్.సి. |
| తల్లిదండ్రులు | : అరుణ, రమేష్‌చంద్ |
| భార్య | : పంకజశ్రీ |
| సంతానం | : వెంకటరవీంద్ర, లక్ష్మీ వసుంధర. |

నుంచి బి.వి.యస్.సి. డిగ్రీ అందుకొన్నారు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన స్థిరాస్తిఉంది. ఉద్యోగం చేయటం కన్నా, సమాజ సేవ చేయటం అవసరమని తలంచారు. వ్యాపారం ప్రారంభించారు...

మాతృమూర్తి అరుణ మరణంతో మనస్తాపం చెందారు. ఆమె జ్ఞాపక చిహ్నంగా ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలకు సేవలందిస్తున్నారు. వర్షాకాలంలో కూడా ఈ నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు మంచినీటి కొరత అనివార్యంగా ఉంటుంది. ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు మంచినీటి పంపి, ప్రజల దాహార్తిని తీర్చటంలో డా॥ వంశీ ముందున్నారు. రోగులకు వైద్య సౌకర్యాలు అందిచటంలోను, పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోటానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేయటానికి ఆర్థిక సహాయం అందిస్తూ, బడుగు బలహీనవర్గాల ఆదరణ చూరగొన్నారు. పేద విద్యార్థులకు వేతనాల కూడా చెల్లించి చదివిస్తున్నారు. ఈ విజయానికి ట్రస్టు ద్వారా ఆయన అందించిన సేవలే ముఖ్య కారణం అనవచ్చు.



2006 ఏప్రిల్ 14న ఉంగుటూరులో అంబేద్కర్ విగ్రహాన్ని సొంత ఖర్చులతో నిర్మించారు. ఆ రోజు అంబేద్కర్ జయంతి కావటం విశేషం. ప్రజా గాయకుడు గద్దర్‌ని ఉంగుటూరు రప్పించి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరింపజేయటంలో ప్రజల్లో గుర్తింపు పొందారు డా॥ వంశీ. ఆ వేదిక పై నుంచే, తల్లి అరుణ పేరిట ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. 2006 మే నెలలో గన్నవరం శ్రీ నగర్ కాలనీలో ట్రస్టు కార్యాలయం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ ఆశయాలు ప్రజలకు మేలు చేసే విధంగా ఉంచటంతో ఆకర్షితుడై సాధారణ కార్యకర్తగా ఆ పార్టీలో చేరారు. సేవాదృక్పదం అపారంగా ఉన్న డా॥ వంశీ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. నారా చంద్రబాబు నాయుణ్ణి గన్నవరం రప్పించి మంచినీటిని ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ అధినేత అభిమానం చూరగొన్నారు. గన్నవరం నియోజకవర్గం ఓటర్ల ప్రోత్సాహంతో 2009 లో గన్నవరం నుంచి శాసనసభకు పోటీ చేయాలని డా॥ వంశీ తలపోశారు. చంద్రబాబునాయుడు దృష్టిలో పడి, మంచి మార్కులు సంపాదించుకున్న డా॥ వంశీకి మరో ఉన్నత అవకాశం వచ్చింది. విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేయమని చంద్రబాబునాయుడు ఆదేశించటంతో శిరసావహించి పోటీల్లో నిలిచారు. అనుభవరాహిత్యంతో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లును సమీకరించలేకపోయారు. సుమారు 12 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినా చింతించలేదు. వెనుడుగు వేయలేదు. ఆ ఓటమి విజయానికి తొలిమెట్టుగా భావించి పార్టీ, సేవాకార్యక్రమాలు కొనసాగించారు. 2014లో తను ఆశించిన గన్నవరం నుంచి తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా పోటీచేయటానికి అవకాశంచిక్కింది. విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, మండల గ్రామాలు, ఉయ్యూరు, విజయవాడ రూరల్ మండలాల కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి వై.కా.పా., కాంగ్రెస్, సి.పి.ఐ.,జైసమైక్యాంధ్ర, బి.యస్.పి., పిరమిడ్ పార్టీల అభ్యర్థులతో పాటు, మరో ఏడుగురు స్వతంత్రులు కూడా పోటీ చేశారు.

– దాసరి ఆళ్వారస్వామి(కృష్ణా జిల్లా శాసనసభ్యులు పుస్తకం నుంచి)

చైతన్యవంతులైన ఓటర్లు కలిగివుంది గన్నవరం. ఒకసారి గెలిపించిన వారిని, రెండవసారి ఓడించటంలో ఇక్కడి ఓటర్లు ప్రసిద్ధులుగా కనిపిస్తారు. కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటలా కీర్తింపబడిన ఈ నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన పుచ్చలపల్లి సుందరయ్య మాత్రమే వరుస విజయాలు సాధించారు. ఆయన మూడుసార్లు విజయం సాధించినా, హ్యాట్రిక్ మిస్ అయ్యారు. 1955,1962 ఎన్నికల్లో ఆయన వరస విజయాలు సాధించినా 1967లో సుందరయ్య పోటీ చేయలేదు. అలానే 1968 ఉపఎన్నికల్లో, 1972లో కూడా ఆయన పోటీ చేయకుండా సి.పి.యం అభ్యర్థులుగా బరిలోకి దిగిన వారు ఓటమి చవిచూశారు. 1978లో పోటీచేసిన సందరయ్య విజయం సాధించి తన పట్టు నిరూపించుకొన్నారు. గన్నవరం నియోజకవర్గం ఓటర్లు సుందరయ్య అభిమానులు అన్న విషయం నిరూపించారు.

## ఉద్దండులను సైతం ఓడించే "గన్నవరం" ఓటరు

1955 కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి, ఓటమి పాలైన వెలివెల సీతారామయ్య, 1967లో మళ్లీ అదే పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.పదవీకాలం పూర్తి కాకుండానే అకాల మరణం చెందారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో గన్నవరం నుంచి కాకాని వెంకటరత్నం పోటీచేసి విజయం సాధించారు. ఈయన బ్రహ్మానందరెడ్డి, పి.వి. నరసింహారావుల మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేశారు. అభ్యర్థులు మారినా 1967,1968,1972 వరుస విజయాలను కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకొంది.

అసమ్మతి వాదులక్కూడా ఈ నియోజకవర్గం అచ్చివచ్చింది. 1994లో టి.డి.పి. టికెట్ లభించక,స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన గద్దే రామ్మోహన్ విజయం సాధించారు. ఆ తర్వాత టి.డి.పి.లో చేరి విజయవాడ పార్లమెంటు సభ్యునిగా కూడా విజయం సాధించారు. 2004 కాంగ్రెస్ టికెట్ లభించని ముద్రబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి అంతకు ముందు శాసనసభ్యునిగా కొనసాగిన దాసరి వెంకట బాలవర్ధనరావు పై గెలుపొందారు. 2009 నాటికి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వెంకటేశ్వరరావు ఓటమి పాలయ్యారు.

ఈ నియోజకవర్గం నుంచి సుందరయ్య మూడు సార్లు విజయం సాధిస్తే, ముసునూరు రత్నబోస్ రెండుసార్లు (ఒకసారి టి.డి.పి, రెండోసారి కాంగ్రెస్) విజయం సాధించారు. వీరి ఖాతాలో ఓటమి లేదు. టి.డి.పి. తరపున రెండుసార్లు విజయం సాధించిన బాలవర్ధనరావు రెండుసార్లు ఓటమి పాలయ్యారు.

# దుర్గగుడిలో భారీగా బదిలీలు

## ఏళ్ల తరబడి పాతుకు పోయిన వారకి స్థానచలనం

**రాజధాని ప్రతినిధి – విజయవాడ :** విజయవాడ దుర్గగుడిలో భారీస్థాయిలో బదిలీలు జరిగాయి. ఏళ్ల తరబడి సీట్లలో పాతుకుపోయిన వారికి స్థానచలనం కలిగింది. అవినీతి ఆరోపణలు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన 30 మందిపై బదిలీ వేటు పడింది. దేవాదాయశాఖలో ప్రభుత్వం భారీగా బదిలీలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు మొదలు అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ (ఎఇఓ) వరకు అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ వైవి అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా పుష్కరాల పేరుతో చివరి నిమిషం వరకు బదిలీల ప్రక్రియను నిలుపుదల చేసేందుకు పలువురు అధికారులు విశ్వ ప్రయత్నాలు చేసినా ఫలితం లభించలేదు. సీఎం ఆదేశాలతో బదిలీలు యథాతథంగా జరగ్గా, అర్థరాత్రి దాటాక ఉత్తర్వులు వెలువడ్డాయి. అటు దేవాదాయశాఖ ఇంజనీరింగ్ విభాగంలోనూ పెనుమార్పులు చేపట్టారు. ఎక్కడికక్కడే సిబ్బందిని బదిలీ చేశారు. దుర్గగుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ) కెవిఎస్ఆర్ కోటేశ్వరరావును సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానానికి, అక్కడున్న డి.శ్రీనివాసరాజుకు అన్నవరం దేవస్థానానికి, అక్కడున్న వి. నూకరత్నం విజయవాడ దుర్గ గుడికి బదిలీ అయ్యారు. సింహాచలం ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఇఇ) బి. మల్లేశ్వరరావును దుర్గగుడికి, అక్కడున్న ఎల్.రమను పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి బదిలీ చేశారు. అర్చకులూ, ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేసే సిబ్బందిపైనా బదిలీవేటు పడింది. దుర్గగుడిలోని ఐదుగురు అర్చకులను దత్తత దేవాలయాలకు బదిలీ చేశారు. దశాబ్దన్నరగా దుర్గగుడిలోనే ఉంటున్న వీరిని బదిలీ చేయడం విజయవాడలో సంచలనం కలిగించింది. దుర్గగుడి ముఖ్య అర్చకులు కోట రవి కుమార్‌ను కృష్ణాజిల్లా హంసలదీవిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్‌ను గూడవల్లోలోని శ్రీ కోదండ రామాలయానికి, అర్చకులు ఆర్, శ్రీనివాస్‌ను నిమ్మకూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి, యువిఎస్ మురళీధర్‌ను గూడవల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి, పివి రఘునాథ శర్మను సీతారామపురంలోని విజయగణపతి ఆలయానికి బదిలీ చేశారు. వీరితో పాటు ముగ్గురు రికార్డు అసిస్టెంట్‌లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. ఊహించని రీతిలో జరిగిన బదిలీలతో దుర్గగుడి అధికారులు, సిబ్బంది కలవరం చెందారు. రాజకీయ లాబీయింగ్ ఫలించకపోవడంతో, బదిలీలైన వారంతా విధుల్లోకి చేరేందుకు సిద్ధమయ్యారు.

## కొన్ని జీవిత సత్యాలు



సిగరెట్ లేకున్నా మనం బ్రతకగలం
ఆయిన సిగరెట్ కంపెని వాడు కోటీశ్వరుడు,
మద్యం లేకపోయిన మనం బ్రతకగలం,
ఆయిన మద్యం కంపెని వాడు కోటీశ్వరుడు,
మొబైల్ లేకున్నా మనం బ్రతకగలం
ఆయిన మొబైల్ కంపెని వాడు కోటీశ్వరుడు,
అన్నం లేకుండా మనం బ్రతకలేం
కాని అన్నం పండించేవాడు (రైతు) పేదవాడు

# గ్రామ కంఠాల సమస్యకు తెర దించేనా...?

**బాబూరావు, రాజధాని ప్రతినిధి –తుళ్లూరు :** "ఇదిగో చేస్తున్నాం.. అదిగో చేస్తున్నాం అంటూ గ్రామ కంఠాల నిర్ధారణపై రైతులను జోగొడుతూ వస్తున్న ప్రభుత్వం భూములు సమీకరించి ఏడాది దాటినా స్పష్టతను ఇవ్వకపోవడం విమర్శలకు గురౌతోంది. ఈ వ్యవహారంపై రకరకాలుగా ప్రకటనలు వచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ ఏమి తేల్చకుండా రైతులను అయోమయానికి గురి చేస్తోంది. నామ మాత్రంగా నిర్ధారించిన గ్రామ కంఠాల జాబితాలను బహిర్గతం చేయడంతో రైతులు అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. గ్రామ కంఠాల జాబితాలు ఇష్టారాజ్యంగా రూపొందించారంటూ రైతులు రాజకీయాలకు అతీతంగా ఆందోళనకు దిగారు. రేకుల షెడ్డులు,గొడ్ల చావిళ్లు కూడా వదలరా.. అంటూ సీఆర్‌డిఏకి చెందిన కాంపిటెంట్ ఆథారిటీ కార్యాలయాలకు తాళాలు వేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీంతో ఖంగు తిన్న ప్రభుత్వం రైతులను చల్లబరిచే ప్రయత్నాలకు దిగింది. ఇందులో భాగంగా గత ఏడాది ఆగష్టు 24 వతేదిన తుళ్ళూరు సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే గ్రామ కంఠాల నిర్ధారణకు కొత్త



లింగాయపాలెంలో గ్రామ కంఠాలను పరిశీలిస్తున్న జేసీ చెరుకూరి శ్రీధర్ (ఫైల్)

మార్గదర్శకాలను రూపిందించినట్లు ప్రకటించారు. కలెక్టర్ ప్రకటన అనంతరం సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును సైతం రైతులు వదల్లేదు. భూములు ఇచ్చి పిచ్చివాళ్లలా కనపడుతున్నామా అంటూ నిలదీయడంతో మంత్రి కొందరు సీఆర్‌డీఏ అధికారుల తప్పిదం వల్ల గ్రామ కంఠాల జాబితాలలో పొరపాట్లు దొర్లాయన్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గ్రామ కంఠాల నిర్ధారణకు శ్రీకారం చుట్టారు.లింగాయపాలెం, తుళ్లూరు, నేలపాడుతో పాటు పలురాజధాని ప్రాంత గ్రామాల్లో పర్యటించారు.ఈ ప్రక్రియలోనే రైతుల ప్రమేయం లేదన్న ఆరోపణలు వచ్చాయి.అయినప్పటికి ఏ మాత్రం చలించని అధికారులు గ్రామ కంఠాల సమస్య కొలిక్కి వస్తోందంటూ ప్రకటనలు చేస్తూ వచ్చారు.కానీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. రాజధాని ముసాయిదా ప్రణాళిక వచ్చేసింది.. ప్లాట్ల పంపిణీ, రోడ్ల విస్తరణ లాంటి కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. రెండు మూడు రోజులుగా తుళ్ళూరు సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద అధికారులు గ్రామ కంఠాలపై 9.2 ఫారాల ద్వారా రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో ఈ మారైనా గ్రామ కంఠాల సమస్యకు ప్రభుత్వం తెర దించేనా... అని రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఎస్.వి.రంగారావు జయంతి

సుప్రసిద్ధ తెలుగు సినిమా నటుడు ఎస్వీ రంగారావు పూర్తి పేరు సామర్ల వెంకట రంగారావు (జులై 3, 1918 ). ఈయనకు యశస్విగా పేరు పొందిన ఈ నటుడు మూడు దశాబ్దాలపాటు మూడొందల చిత్రాలకు పైగా అద్భుతంగా నటించి ఘటోత్కచుడిగా, కీచకుడిగా, రావణాసురుడిగా ˇతనకు తానే సాటిగా ఖ్యాతి గడించాడు. ఆయా పాత్రలలో ఆయన ఎంత మమేకమై పొయ్యరంటే,వేరెవరు కూడా ఆ పాత్రలలో ఇప్పటివరకు ఇమడలేకపొయ్యారు. ఈయన తొలిజీవితము కృష్ణాజిల్లాలోని నూజివీడులో 1918 జులై3 వతేదిన లక్ష్మీ నరసాయమ్మ, కోటీశ్వరనాయుడులకు ఎస్వీ రంగారావు జన్మించాడు.తండ్రి ఎక్సైజు శాఖలో పనిచేసేవాడు.యస్వి. రంగారావు హిందూ కాలేజిలో చదివాడు. డిగ్రీ వరకు చదివి,అగ్ని మాపక దళంలో ఉన్నత ఉద్యోగిగా పనిచేస్తూ, షేక్స్ పియర్ ఆంగ్ల నాటకాలలో ఒథెల్లో, షైలాక్ తదితర పాత్రలు పోషించి ప్రముఖ రంగస్థల కళాకారుడిగా విశేష ఖ్యాతి గడించాడు. ఆ తర్వాత బి.వి. రామానందం దర్శకత్వంలో నిర్మించిన వరూధిని చిత్రంలో ప్రవరాఖ్యుడిగా తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయమయ్యాడు. ఆ తర్వాత మనదేశం, పల్లెటూరి పిల్ల, షావుకారు, పాతాళభైరవి, పెళ్లి చేసి చూడు, బంగారుపాప, బాలనాగమ్మ, గృహలక్ష్మీ, బాల భారతం, తాతా మనవడు ఇలా అనే చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించి తన అద్భుత నటనాచాతుర్యంతో సినీ ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు. నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు.ఎస్వీయార్ నటించిన నర్తనశాల, ఇండోనేషియాలోని జకార్తాలో అఫ్రో–ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవములో ప్రదర్శించబడడమే కాకుండా కీచక పాత్రకుగాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథానాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు.ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వ బహుమతి, నగదు పారితోషికం లభించాయి. అద్భుత నటనకు ప్రతీకగా నిల్చిన ఎస్వీ రంగారావు 1974 జులై 18 వ తేదిన మద్రాసులో శాశ్వతంగా కన్ను మూశాడు. యస్.వి. రంగారావు వ్యక్తిగతంగా సహృదయుడు,చమత్కారి. ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజు శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు పేర్లు విజయ, ప్రమీల. కొడుకు పేరు కోటేశ్వరరావు. యస్వీఆర్ ఒక రకమయిన వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. ఆన గొప్ప దాత. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చాడు.చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చాడు. తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ విధికి ఇచ్చాడు. ఆయనకు వచ్చిన అవార్డులు నర్తనశాలలో కీచకుని పాత్రకు ఆఫ్రో – ఆసియా చిత్రోత్సవములో ఉత్తమ నటుని బహుమతి అందుకొన్న ఎస్వీ రంగారావు. ఎస్వీ రంగారావుపై 2013లో విడుదలయిన తపాలాబిళ్ళ. ఆయనకు ఆయనకు ఉన్న బిరుదులు విశ్వనట చక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ. బహుమతులు రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం ' చదరంగం' ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం ' బాంధవ్యాలు ' తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి.



ఎస్.వి.రంగారావు

నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు.ఎస్.వి.రంగారావు ప్రతిభను గురించి, వైవిద్యమైన పాత్రల పోషించగల నైపుణ్యం గురించి ప్రసిద్ధ దర్శకుడు చిత్రకారుడు, బాపువేసిన చిత్రానికి ముళ్ళపూడి వాఖ్యానం ఇలా చమత్కారంగా వ్రాశారు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాళాబిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది. రంగారావు బహుముఖ ప్రజ్ఞాశాలి. పాత్ర ఏదయినా, ఆయన కనిపించేవాడు కాదు, పాత్రే కనిపించేది. ఆయన తన సుదీర్ఘ నట జీవితంలో, అనేకానేక పాత్రలలో జీవించాడు.విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని యస్వీఆర్ విగ్రహం పెట్టారు.

# చారిత్రాత్మక ఘట్టం

➢ మొదటి పేజీ తరువాయి

యన్. శ్రీకాంత్, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా పరిషత్ చైర్మన్ జానీమూన్, గుంటూరు యం.పి. గల్లా జయదేవ్ ,ఎం.ఎల్.ఏ తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండె పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**జూలై చివరినాటికి తరలింపు పూర్తి**

**అమరావతి:** తాతాల్కిక సచివాలయానికి ఉద్యోగులు తరలింపు తేది మళ్లీ వాయిదా పడింది.జూన్ 27 వ తేది నుంచి 29 వతేదికి మారింది.అయితే ఈ నెల 29 వ తేదిన ఐదో బ్లాక్‌లోని ఒక్కఫ్లోర్ మాత్రమే ప్రారంభమవుతుందని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు వెల్లడించారు. వచ్చే నెల 6న 6వ బ్లాక్‌లో ఫస్ట్‌ఫ్లోర్,5వ ఫ్లోర్ మొదటి అంతస్తు ప్రారంభమవుతాయని తెలిపారు. జులై 15 వ తేదిన కొన్ని బ్లాకులు, 21 వతేదిన మరికొన్ని బ్లాక్‌లు ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జులై మాసం చివరి నాటికి మొత్తం తరలింపు పూర్తి చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఫైళ్లన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో ఉంచుతామని చంద్రబాబు చెప్పారు.



సీఎం చంద్రబాబు సందర్భంగా మందడం వద్ద నిలిచిన వాహనాలు

# జీవితం విలువైంది..

**జీవితం విలువ ఎవరికి తెలుస్తుంది ..? చావుకు అతి దగ్గరగా వెళ్లిన వారికి, మృత్యువుతో పోరాడి బయటకు వచ్చినవారికే తెలుస్తుంది. మనం బ్రతుకుతున్న ప్రతిక్షణం అపూర్వమని జీవితమంటే పదిమందికి ఉపయోగించాలని కూడా అనిపిస్తుంది. కుంగుబాటు పరిస్థితిని అధిగమించి తనలాంటి వారికి స్ఫూర్తి నింపి, ఆత్మహత్యల నుంచి తప్పించాలని పరితపిస్తున్నారు సనా ఇక్బాల్...**

ఆమె




ఆమె దేశంలోని 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు, 100 నగరాలు, 40 వేల కిలోమీటర్లు తన బుల్లెట్ బండితో ఒంటరిగా వెళ్లారు. మొదట్లో తాను కూడా కుంగుబాటుకు గురయ్యానని, ఆత్మహత్య చేసుకోవాలన్న బలమైన కోరికకు లోనైనా ఎలాగోలా నిగ్రహించుకొని మానసిక శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేశానన్నారు. జీవితంలో ఏదో సమయంలో ప్రతి ఒక్కరికీ ఇలాంటి పరిస్థితి వస్తుందని, దాన్ని అధిగమించేందుకు తన తోడ్పాటు నందించాలని అప్పుడే నిర్ణయించుకున్నానన్నారు. అదే సమయంలో 170 దేశాల్లో జరిపిన ఆత్మహత్యలపై పరిశోధనా నివేదికల్లో కుంగుబాటులో మనదేశం మొదటి స్థానంలో, ఆత్మహత్యల్లో 11 స్థానంలో ఉండటం కలవరపెట్టిందన్నారు. తన భావలకు తగినట్టుగా ఉండే వాండరర్స్ క్లబ్‌లో చేరానన్నారు. ఒక జత బూట్లు,తక్కువ బరువు ఉండే బట్టలు, వాహనం విడిభాగాలు, ఓ కత్తి బ్యాగులో వేసుకున్నానన్నారు. గత ఏడాది గోవాలో జరిగిన ర్యాలీలో ఆత్మహత్యలపై కౌన్సిలింగ్ ఇచ్చి అక్కడి నుంచి యాత్రను ప్రారంభించానన్నారు.మార్గమధ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మరికొందరికి వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ఆత్మహత్యల ఆలోచనల నుంచి బయటపడే సూచనలు చేశానన్నారు. ప్రస్తుతం ఫేస్‌బుక్‌లో 'ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని' ( సూసైడ్ ఈజ్ నాట్‌ఏ సొల్యూషన్) పేరుతో మంచి మంచి కొటేషన్స్‌తో నింపుతున్నానని, అలాగే తన ప్రయాణ వివరాలు కూడా ఇచ్చానని దానికి మంచి స్పందన

### కుంగుబాటును దరిచేరనీయకండి...

వచ్చిందన్నారు. మొదట ఆడపిల్లవి దేశయాత్రలేమిటని అడ్డు చెప్పిన అమ్మ ప్రజల ఆదరణ చూసిన తార్వాత చాలా సంతోషపడ్డారని సనా తెలిపారు.

ఒంటరిగా వెళ్లినా ఎక్కడా ఇబ్బందిపడలేదని, సాధ్యమైనంతవరకు జనసంచారంలోనే బైక్ సరిచేసుకునేదాన్ని, చీకటిపడ్డ తర్వాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నా గురించి వివరాలు తెలిపి ఆశ్రయం పొందానన్నారు. మరికొన్నిచోట్ల వాండరర్స్ క్లబ్ సభ్యులే వసతి ఏర్పాటు చేశారని, నాగపూర్ నుంచి ఆగ్రాకు ఒక్కరోజులోనే వెళ్లానన్నారు. కేరళలో రోడ్డు చిన్నగా ఉన్నా ప్రకృతి రమణీయత మనస్సును కట్టిపడేస్తాయన్నారు. రాజస్థాన్‌లో వాహనంపై వెళుతుంటే అందరూ తప్పుకొని మరీ దారి ఇచ్చేవారన్నారు. మరికొన్ని రాష్ట్రాల్లో పగటిపూట జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుండటం మరిచిపోలేని అనుభవం అన్నారు. ఒకే ఒక్కసారి మాత్రం రోడ్డు ప్రమాదం జరిగిందని, నలుగురు యువకులు బండిని నియంత్రించలేక ఢీకొట్టారని దెబ్బలకు ప్రధమ చికిత్స తీసుకొని వెంటనే ప్రయాణం అవడం నాకు సంతృప్తిని ఇచ్చిన విషయం అంటారు. అదే సమయంలో ఒక పాఠశాలలో ఆత్మహత్య స్వభావాన్ని గురించి ప్రసంగిస్తుండగా ఒకమ్మాయి భోరున ఏడుస్తూ వచ్చిందని, విషయం తెలుసుకొని షాక్ అయ్యానన్నారు. సొంత తండ్రే అమ్మాయి పట్ల క్రూరంగా ప్రవర్తిస్తే తల్లికి చెప్పినా పట్టించుకోకుండా పిచ్చి ఆసుపత్రిలో చేర్పించడంతో ఆమె పరిస్థితి మరీ దారుణంగా తయారైందని ఆమె వివరించారు. దాదాపు మూడు గంటలు కౌన్సిలింగ్ చేశా, అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతిరోజు కౌన్సిలింగ్ ఇస్తుంటే ఆమెలో 50శాతం మార్పు వచ్చిందని త్వరలో సంపూర్ణ ఆరోగ్యవంతురాలై ఉన్నత చదువులు చదువుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇంతకీ సనా యాత్ర పూర్తయ్యిందెప్పుడో తెలుసా జూన్ 14నే అన్నారు.

# టాప్ త్రీలో భారత్

## అగ్రదేశాల సరసన ఇస్రో జయకేతనం



**నెల్లూరు :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఒక రాకెట్ ద్వారా 20 ఉపగ్రహాలను విజయవంతంగా నింగిలోకి పంపింది. దీంతో సాంకేతికత, నూతన టెక్నాలజీలోనూ సత్తా చాటిన భారత్ అగ్రదేశాల సరసన ధీటుగా నిలబడింది. ఏ దేశమైనా ఒకటి లేదా రెండు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపడం సహజం. అంతకంటే ఎక్కువ ఉపగ్రహాలను పంపడం అరుదు. కానీ గతంలో అమెరికా 26, రష్యా 22 ఉపగ్రహాలను ఒకేసారి పంపి వరుసగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశం సైతం 2008లో ఒకే రాకెట్ ద్వారా 10 ఉగ్రహాలను పంపి మాకూ సత్తా ఉందంటూ సంకేతం పంపింది. అనంతరం టెక్నాలజీని అందిపుచ్చుకుని పీఎస్ఎల్‌వీ సీ 34 ద్వారా 20 ఉపగ్రహాలను ఒకేసారి నింగిలోకి పంపి తన సత్తా మరోసారి చాటింది. తాజా విజయంతో అంతరిక్ష ప్రయోగాల్లో అగ్రదేశాలు అమెరికా, రష్యా సరసన మనదేశం మూడో స్థానంలో నిలిచింది. ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల్లో అర్ధసెంచరీ దాటడంతో ప్రయోగం సక్సెస్ తర్వాత శాస్త్రవేత్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఆంత్రిక్స్ కార్పొరేష్‌తో ఒప్పందం చేసుకున్న విదేశాలకు చెందిన చిన్నతరహా ఉపగ్రహాలను ప్రయోగించి వాణిజ్యపరంగా ముందంజలో ఉంది.

1999 మే 26న పీఎస్ఎల్‌వీ సీ 2 ద్వారా జర్మనీకి చెందిన డీఎల్ఆర్ – టబ్‌శాట్, రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన కిట్‌శాట్ –3 విదేశీ ఉపగ్రహాలను వాణిజ్యపరంగా పంపించడానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు ప్రపంచంలోని 20 దేశాలకు చెందిన 57 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించారు. ఈ అన్ని ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారానే పంపి విజయాలు సాధించడం విశేషం. జర్మనీకి చెందిన టబ్‌శాట్, బర్డ్, కాంపాస్ –1, రూబెన్ –8 , క్యూబ్‌శాట్ –1 కూబ్‌సెట్ –2, రూబెన్ 9.1, రూబెన్ 9.2, ఎన్ఎల్ఎస్ 7.1, ఎన్ఎల్ఎల్ఎస్ 7.2 పది ఉపగ్రహాలను పంపించారు. కెనడాకు చెందిన క్యాన్‌ఎక్స్ –2, ఎన్ఎల్ఎస్ –5, ఎన్ఎల్ఎస్ –51, ఫెప్పైర్, నియోశాట్, ఎన్ఎల్ఎస్ – 7.1, ఎన్ఎల్ఎస్ – 7.2, ఎన్ఎల్ఎస్ – 14తో ఎనిమిది ఉపగ్రహాలను పంపించారు. సింగపూర్‌కు చెందిన ఎక్స్‌శాట్, వెలాక్సీ, టెలియాస్ –1 కెంట్‌రిడ్జి, వెలాక్సీ సీ 1, వెలాక్సీ –11, గెలాఫియా, ఎథినోక్సాట్ ఎనిమిది ఉపగ్రహాలు పంపారు. జపాన్‌కు చెందిన క్యూట్ –1.7, సీడ్స్, ప్రొయిటర్ అనే మూడు ఉపగ్రహాలు, డెన్మార్క్‌కు చెందిన ఆయాశాట్ –2, ఎన్ఎల్ఎస్ –8.3 రెండు ఉపగ్రహాలు, ఆస్ట్రియా ఎన్ఎల్ఎస్ 8.1 ఎన్ఎల్ఎస్ 8.2 రెండు ఉపగ్రహాలు, ఫ్రాన్స్‌కు చెందిన స్పాట్ –06, స్పాట్ –07, స్విట్జర్లాండ్‌కు చెందిన క్యూబ్‌శాట్– 4, టీశాట్ –1, అల్జీరియాకు చెందిన ఆల్‌శాట్ –24, ఇటలీకి చెందిన అజిల్, సౌత్‌కొరియాకు చెందిన కిట్‌శాట్, అర్జెంటీనాకు చెందిన ప్యూహెన్‌శాట్, ఇజ్రాయల్‌కు చెందిన టెక్సార్, లక్సెంబర్గ్‌కు చెందిన వెజల్‌శాట్, టర్కీకి చెందిన క్యూట్‌శాట్ –3 ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా నింగిలోకి పంపింది. ఒకే రాకెట్ ద్వారా 20 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన షార్ చరిత్రపుటల్లోకెక్కింది.

## అసంపూర్తిగా వ్యవసాయశాఖ కార్యాలయ నిర్మాణం



తుళ్లూరులోని వ్యవసాయశాఖ కార్యాలయం ఇదే.

**రాజధాని ప్రతినిధి – తుళ్ళూరు :** రాజధాని ప్రాంతం, మండల కేంద్రమైన తుళ్ళూరులో నిర్మించిన వ్యవసాయ శాఖ కార్యాలయం నిర్మాణం అసంపూర్తిగా జరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2002 వ సంవత్సరములో శాసనసభ్యులు, మంత్రిగా వ్యవహరించిన జెఆర్.పుష్పరాజ్ వ్యవసాయశాఖ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో రెండంతస్థులతో వ్యవసాయశాఖ కార్యాలయం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. నిర్మాణానికి సరిపడా నిధులు లేవన్న సాకుతో పై అంతస్తులో ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం, కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్ చేతులు ఎత్తివేయటంతో కార్యాలయం నిరుపయోగంగా మారింది. అధికారులు చేసేదేమిలేక గిడ్డంగిలోనే వ్యవసాయశాఖ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి వ్యవసాయ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించిన సంగతి తెలిసిందే. మండల పరిధిలో మొత్తం 21 గ్రామాలు ఉండగా (2 శివారు గ్రామాలతో కలిపి) 3 గ్రామాలను ల్యాండ్‌పూలింగ్ నుంచి మినహాయించింది. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలను మినహాయించడంతో ఆ మూడు గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. ఎరువులు, పురుగుమందుల వాడకం తదితర వ్యవసాయ సంబందమైన సూచనలు, సలహాల కోసం రైతులు వ్యవసాయ కార్యాలయానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయం నిర్మాణం అసంపూర్తిగా జరగడంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయశాఖ కార్యాలయంను పూర్తి స్థాయిలో నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

# ఆదాయపన్ను చెల్లించకుంటే అరదండాలే..

- రిటర్నులు దాఖలు చేయకపోయినా చిక్కులే
- ముక్కుపిండి వసూలు చేసే కార్యాచరణ

**న్యూఢిల్లీ :** ఉద్దేశపూర్వకంగా ఆదాయపన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్న వారికి అరదండాలు విధించే దిశగా తమకున్న ప్రత్యేక అధికారులను ఉపయోగించుకునేందుకు ఆ శాఖ అస్త్రాలను సిద్ధం చేసింది. ఉద్దేశపూర్వక పన్ను ఎగవేతదారులకు రుణాలు లభించకుండా, ఆస్తుల క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా చేయనుంది. ఇందుకోసం పాన్ నంబర్‌ను బ్లాక్ చేయడం సహా వారికి వంట గ్యాసు సబ్సిడీ అందకుండా చేయడం వంటి పలు చర్యల ద్వారా వారిని దారికి తేవాలని ఆదాయపన్ను శాఖ నిర్ణయించింది. ఈ మేరకు పన్ను ఎగవేతదారుల విషయంలో అనుసరించాల్సిన చర్యలతో ఆదాయపన్ను (ఐటీ) అధికారుల వార్షిక సమావేశంలో దీన్ని ప్రవేశపెట్టారు.

**కార్యాచరణ ప్రణాళిక...**

దేశంలో ఆదాయపన్ను పరిధిలోకి వచ్చికూడా రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య 2014లో 22.09 లక్షలుగా ఉండగా ఈ సంఖ్య 2015 నాటికి 58.95 లక్షలకు పెరిగింది. ఈ నేపథ్యంలో పన్ను ఎగవేతదారుల పాన్ నంబర్లను రిజిస్ట్రేషన్ల శాఖకు పంపడం ద్వారా సంబంధింత వ్యక్తుల పేరుతో ఎలాంటి ఆస్తుల లావాదేవీలకు అవకాశం లేకుండా చేయాలని కార్యాచరణ ప్రణాళికలో ఐటీ శాఖ ప్రతిపాదించింది. ఎగవేతదారులపై ఓ కన్నేసి ఉంచేందుకు వారి సమాచారాన్ని దేశవ్యాప్తంగా ఐటీ అధికారులందరికీ పంపనుంది. ఎగవేతదారుల నుంచి బకాయిల వసూలు, వారికి సంబంధించిన ఆస్తులను స్తంభింపజేసేందుకు వీలుగా ఆర్థిక లావాదేవీలు సమాచారాన్ని సిబిల్ నుంచి తెలుసుకోవాలని కూడా నిర్ణయించింది.

సీబీడీటీ మార్గదర్శనం ఉద్దేశపూర్వకంగా ఆదాయపన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్న వారిని అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు తమకున్న ప్రత్యేక అధికారులను ఉపయోగించుకోవాలని ఐటీ అధికారులకు కేంద్రప్రత్యేక పన్నుల బోర్డు (సీబీడీటీ) సైతం మార్గదర్శనం చేసింది. అరెస్ట్‌లు, నిర్బంధంతోపాటు వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు వెనుకాడవద్దని సూచించింది. ఈ మేరకు సీబీడీటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విధాన పత్రంలో ఆదాయపన్ను అధికారులను ఆదేశించింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 276 సీ (2) ప్రకారం ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు మూడు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు, జరిమానాకు అవకాశం ఉంది. పన్ను వసూలు అధికారి (టీఆర్‌వో) ఐటీ చట్టంలో ఉన్న ఈ అధికారాలను వినియోగించుకుని పన్నులు రాబట్టాలి. కానీ, ఈ దిశగా చర్యలు తక్కువగా ఉంటున్నాయని, టీఆర్‌వోల వ్యవస్థను మరింత పటిష్టపరిచి, మరిన్ని సౌకర్యాల కల్పనతోపాటు వారికి సిబ్బందిని కేటాయించాలని సీబీడీటీ సూచించింది. కావాలని పన్ను ఎగవేస్తున్న వారిని అరెస్ట్ చేయడంతోపాటు అవసరమైన కేసుల్లోప్రాసిక్యూట్ చేయడానికి కూడా వెనుకాడవద్దని కోరింది. పన్ను ఎగవేతదారుల ఆస్తులను అటాచ్ చేసివాటిని ఏడాదిలోపు విక్రయించేందుకు వీలుగా టీఆర్‌వోల పనితీరును పర్యవేక్షణ అధికారులు పరిశీలించాలని ఆదేశించింది.

**రూ. కోటి బకాయి ఉన్నా, పేర్లు బహిర్గతమే...**

ప్రస్తుతం రూ. 20 కోట్లకు పైగా పన్ను బకాయి పడిన వ్యక్తులు, సంస్థల పేర్లను వెల్లడిస్తూ ఆదాయపన్ను శాఖ జాతీయ దినపత్రికల్లో ప్రకటనలు ఇస్తోంది. అలాగే, తన వెబ్‌సైట్‌లోనూ ప్రముఖంగా పేర్కొంటోంది. ఇకపై రూ.కోటి ఆ పైన బకాయి ఉన్న వ్యక్తులు, సంస్థల పేర్లను కూడా ఇలానే బహిరంగ పరచాలని నిర్ణయం తీసుకుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 271 ఎఫ్ ప్రకారం పన్ను వర్తించే ఆదాయం పొందుతున్న వారు తప్పనిసరిగా గడువులోపు రిటర్నులు దాఖలు చేయాలి. లేదంటే రూ.1,000 నుంచి వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, 276 సీ ప్రకారం ఆదాయ వివరాలతో రిటర్నులు దాఖలు చేయని వారికి ఏడేళ్ల వరకు కఠిన జైలు శిక్ష, జరిమానా విధించేందుకు చట్టం అవకాశం కల్పింస్తోంది. ఈ నేపత్యంలో రిటర్నులు దాఖలు చేయని ప్రతీ కేసును ప్రత్యేకంగా పరిశీలించి ఈ చట్టాల కింద చర్యలు చేపట్టాలని కార్యాచరణ ప్రణాళికలో పేర్కొన్నారు. ఆదాయపన్ను కమిషనర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 2,58 లక్షలకు పెరిగినట్టు ప్రణాళిక తెలియజేస్తోంది. వీటిలో ఈఏడాది 1.33 లక్షల కేసులను పరిష్కరించాలన్న లక్ష్యాన్ని విధించారు.

## అంబులెన్సు హెలికాప్టర్‌లు !

**ఢిల్లీ :** ప్రమాదం జరిగినప్పుడు తక్షణ వైద్యం అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు అందుకే దీన్ని దృష్టిలో పెట్టుకుని అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు హెలికాప్టర్‌ను ఎక్కడైనా దించేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముందస్తు అనుమతి లేకుండానే రహదారి, ప్రమాద ప్రాంతాల్లో అంబులెన్సు హెలికాప్టర్ దించేందుకు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఇప్పటికే అనుమతి మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి విధివిధానాలపై కేంద్ర హోం, రక్షణ, రహదారులు, టెలికం మంత్రిత్వశాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెలికాప్టర్ సేవలందించడానికి పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు తక్షణం హెలికాప్టర్‌కు ఎక్కడైనా దిగేందుకు స్వేచ్ఛ ఉంటే ఉపయుక్తంగా ఉంటుందని డీజీసీఏ అధికారి తెలిపారు. ఇలాంటి సేవలు జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. తొలి దశలో పట్టణాల్లోని కొన్ని ప్రాంతాల్లో హెలికాప్టర్ ఉంచేందుకు స్థలాలను గుర్తిస్తామని తెలిపారు. రెండో దశలో సంబంధిత మంత్రిత్వశాఖల అనుమతి ఎక్కడైనా హెలికాప్టర్ దిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎయిర్ ట్రాఫిక్ అనుమతి లేకుండానే 5,000 అడుగుల ఎత్తులో ఒకచోటు నుంచి మరోచోటుకి ఎగిరేలా పౌర విమానాయాన విధానాన్ని తయారు చేసినట్లు తెలిపారు. దీన్ని గత వారంలోనే కేంద్ర కేబినెట్ అనుమతించిందని చెప్పారు. అంబులెన్సు హెలికాప్టర్‌లో ఇద్దరు శిక్షణా పైలెట్‌లు, సాంకేతిక సిబ్బంది, వైద్యుడితో పాటు అత్యటోల్‌ఫ్రీ నెంబరు ద్వారా హెలికాప్టర్ నియంత్రణా కేంద్రానికి సమాచారం ఇచ్చి హెలికాప్టర్ దిగేందుకు అనువుగా రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తారని చెప్పారు.


## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
దాదా : 9441754056, రాయపూడి
వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.
ఎస్‌కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు
ఎన్. రామోహనరావు : 8801933160, మందడం.

**దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్**
& జిరాక్స్ తీయబడును
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
కౌసర్ : 9989035143, రాయపూడి.

**ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్**
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
షేక్ జానీ, సెల్ : 9948450791

**వివాహ బంధం**
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభంధములు చూడబడును.
షేఖ్ జానీ : 9985394613
అయ్యప్పనగర్, విజయవాడ.

**REALESTATE**

అనంతవరం గ్రామంలో పూలింగ్‌లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

**రేమండ్ టైలర్స్**
మెయిన్ బజారు, తుళ్ళూరు

**చంద్రిక ట్రేడర్స్**
సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్‌సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
ఫోన్ : 9908073516

**కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్**
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
ఫోన్ : 97040748420

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
సెల్ నెం. 9848407935


# బానిస బ్రతుకులో భారత్ టాప్

- ప్రపంచంలోనే నాలుగో స్థానం
- యాచకులుగా... సెక్స్‌వర్కర్లుగా ఇటుక బట్టీల్లో వెట్టి కార్మికులుగా సంస్థల్లో బాలసైనికుల్లా మగ్గిపోతున్న 1.80 కోట్ల మంది భారతీయులు
- వాక్ ఫ్రీ ఫౌండేషన్ సర్వేలో వెల్లడి



**న్యూఢిల్లీ :** ప్రపంచంలో ఆధునిక బానిసత్వం విస్తరిస్తోంది. వెట్టి చాకిరి, బలవంతపు యాచకులుగా, వ్యభిచార కూపాల్లో పేదలు కట్టుబానిసలుగా మారిపోతున్నారు. ఉగ్రవాద సైన్యంలో బాలలు చిక్కుకుంటున్నారు. 1.84 కోట్ల మంది భారతీయులు ఇంకా ఆధునిక బానిసలుగా మారారంటే అతిశయోక్తి కాదు. ఈ కట్టు బానిసత్వంలో భారత దేశం ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందని ఇటీవల ఓ సర్వే సంస్థ ప్రకటించింది. వాక్ ఫ్రీ ఫౌండేషన్ అనే మానవ హక్కుల సంస్థ ఈ భయంకర నిజాన్ని వెలుగులోకి తీసుకు వచ్చింది. భారత దేశ జనాభాలో 1.84 శాతం మంది కట్టు బానిసలుగా మారిపోయారని వెల్లడిచేసింది. 167 దేశాల్లో బానిసల సంఖ్యతో పోల్చితే భారతదేశం నాలుగో స్థానంలో నిలిచిందని ఈ సంస్థ ప్రకటించింది. ఈ సంస్థ సర్వే ప్రకారం, 2014లో ప్రపంచ వ్యాప్తంగా 3.58 కోట్ల మంది ఆధునిక బానిసల సంఖ్య ప్రస్తుతం 4.58 కోట్లకు చేరింది. ఇందులో 58 శాతం మంది భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనా, ఉజ్బెకిస్థాన్ దేశాలను చెందిన పేదలున్నారు. దేశ జనాభాలో 4.37 శాతం మంది బానిసలుగా మారిన ఉత్తర కొరియా అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా 2.66 కోట్ల మంది ఆధునిక బానిసలుగా మారితే... ఒక్క భారత దేశంలోనే 1.80 కోట్ల మంది కట్టు బానిసలుగా మారారు. 25 దేశాల్లో 53 భాషల్లో 42,000 మందిని ఈ సంస్థ ఇంటర్వ్యూ చేసింది. ప్రపంచ జనాభాలో 44 శాతం మందిని పలకరించింది. ఆయా దేశాల జనాభా ప్రాతిపదికన, దామాషా ప్రకారం ఆధునిక బానిసల సంఖ్యను ఆధారం చేసుకుని ర్యాంకులను ఇచ్చింది. ఈ ప్రకారం ఉత్తర కొరియా, ఉజ్బెకిస్థాన్, కాంబోడియా, ఇండియా, ఖతర్ దేశాల్లో వరుస ర్యాంకుల్లో నిలిచాయి. ఇక భారతదేశంలో ఈ సంస్థ 15 రాష్ట్రాల్లో సర్వే జరిపింది. హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠాలు, అలాగే బాలలను తరలించి కార్మికులుగా, సెక్స్‌వక్కర్లుగా మార్చే ముఠాలకు కఠినంగా శిక్షించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లులో పేర్కొంది. అదే విధంగా ఉద్యోగులు ఇప్పించే ఏజెన్సీలనూ క్షుణ్ణంగా పరిశీలించాలని భావిస్తోంది. 1976లోనే వెట్టిచాకిరిని భారత ప్రభుత్వ నిషేధించింది. ఐతే, కొన్ని ముఠాలు ఇంకా వెట్టి చాకిరికి జనాన్ని సమకూరుస్తూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదలను మంచి ఉద్యోగుల పేరిట వల వేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సంపన్నుల ఇళ్లల్లో పని మనుషులుగా, ఇటుక బట్టీల్లో, టెక్స్‌టైల్ యూనిట్‌ల్లో కట్టు బానిసలుగా అమ్మేస్తున్నారు. ఏడాదిలోపు పసి పిల్లలను అద్దెకు తీసుకువచ్చి యాచించే ముఠాలు పెరిగిపోయాయి. ఇళ్లల్లోంచి పారిపోయే బాలలను చేరదీసి, ఆ తరువాత బలవంతంగా యాచకవృత్తిలోకి దించుతున్నారు. ఇలా యాచక మాఫియా దేశవ్యాప్తంగా విస్తరించింది. ప్రైవేటు ఏజెన్సీలకు మానవ వనరులను సరఫరా చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా బచ్‌పన్ బచావో ఆందోళన్ చేపట్టిన నోబెల్ బహుమతి గ్రహీత కైలాశ్ సత్యర్థి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ఓ నివేదిక ఇచ్చారు. ఈ కేసుల్లో బాధితులకు న్యాయం, పునరావాసం కల్పించే విషయంలో ఓ నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించాలని సత్యర్థి కోరారు. ఈ సర్వే నిర్వహించాలని సంస్థ అనేక కేస్ స్టడీస్‌ను ఉఠంకించిందని, తన భర్త పక్క గ్రామంలో వెట్టిచాకిరి చేస్తున్నాడని, తమను కలిసి ఏడేళ్లు గడిచిందని, అయినా అప్పు తీరటం లేదని ఓ మహిళ చెప్పింది. ఓ ఇంటిలో పని మనిషిగా పనిచేస్తున్న మరో మహిళ తన దీనగాథను తెలిపింది. ఇంత వరకూ తనకు జీతం ఇవ్వలేదని, అప్పు తీరటం లేదని, నిత్యం తనపై లైంగిక దాడి జరుగుతోందని కన్నీరు పెట్టుకుంది. దేశంలో కొన్ని ప్రాంతాల్లో మహిళలను తరలించి బలవంతంగా పెళ్లిళ్లు చేస్తున్నారు. జమ్ము కాశ్మీర్, జార్ఖండ్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలు బాలలను సైనికులుగా నియమిస్తున్నట్టు ఈ సర్వేలో తేలింది. 161 దేశాల్లో చట్టాలను పరిశీలిస్తే, 124 దేశాల్లో హ్యూమన్ ట్రాఫికింగ్‌ను నేరంగా పరిగణిస్తున్నాయి. 96 దేశాలు ఇలాంటి నేరాలను అరికట్టటానికి నిర్ణయం తీసుకున్నాయి.

స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ దుర్ముఖినామ సంవత్సరం

# నాడీ జ్యోతిష్యం

**12 రాశుల ఫలితాలు**
**జూన్ 26-జులై 2**

**ఆకుల వేణునాథ్ సిద్ధాంతి**
cell : 90324 50197

**మేషరాశి :** ప్రతి విషయములో జీవనంలో అంచనావేసి ధైర్యసాహసాలతో ముందు అడుగులు వేస్తారు. కొద్దిపాటి నిదానంగా అయిన ఫలితాలు సాధిస్తారు. చేతి వృత్తి ఉద్యోగులందు మహారాజ/రాణిగా చలామణి చేస్తారు. అంతర్గత: అనేక భయందోళనలు, మెంటల్‌టెంక్షన్స్ ఉంటాయి. స్త్రీలకు శుభం. పురుషులకు సన్యాసయోగంలో రాజయోగం హస్తకళల్లో రాణిస్తారు.

**వృషభరాశి:** ప్రేమ వివాహాది శుభకార్యములు నెరవేరుతాయి. సంతాన ప్రాప్తి అన్నిరకములుగా అందరి అండదండలతో శుభకార్యములు నెరవేరును. కావలసినంతవరకు ధనప్రాప్తి కలుగును. పురుషులకు సన్యాసయోగంలో రాజయోగం స్త్రీలకు అంతా శుభముల లాభం ధైర్యసాహసాలు ప్రకటించుతారు. మొత్తం మీద సర్వసుఖ సౌఖ్యాలు దినదినాభివృద్ధి. స్త్రీ,పు ఒకరికొకరు సహకరించుకుంటారు.

**మిధునరాశి :** మహరాణి యోగం ధైర్యసాహసాలు ప్రకటించుకుంటారు. పురుషులకు స్త్రీల వల్ల లాభం దినదినాభి వృద్ధి. వివాహాది శుభకార్యాలు నెరవేరుతాయి. ఆనందం, జీవితం అంతర్గత: అమలు చేయుట. ఆస్తులు లేదా తల తాకట్టు కట్టుపెట్టుట. తండ్రికి అనేక మానసిక అరోగ్యం టెంక్షన్స్ అందరి సహకారంతో ముందుకు సాగుట, శుభము కలుగును.

**కర్కాటక రాశి:** అనేక మానసిక టెంక్షన్స్ ఆందోళన ఆత్రుత అన్నివిధాలుగా బాగుంది. శత్రు,ఋణ రోగ భయం లేకుండుట దైవ పుణ్య శుభధర్మ కార్యాలు ఆచితూచి ఆలోచించి శుభము అనుకుంటేనే ధనము ఖర్చు చేయుదురు. సంతాన విషయంలో అంతర్గత: ఆలోచనలు అరోగ్యరీత్యా! అభివృద్ధి రీత్యా చేస్తారు. మొత్తం మీద శుభము కలుగును.

**సింహరాశి:** సర్వ సుఖసౌఖ్యాలు దినదినాభివృద్ధి సర్వకార్య వ్యవహార లాభములు బందుమిత్ర సపరివారం వల్ల లాభములు, ధైర్య సాహసాలు ప్రకటించుకొనుట. అంతర్గత: తండ్రి ఆరోగ్య, ఆస్తుల యందు ఆందోళన ఆత్రుత ఉండవచ్చు. కుటుంబ వ్యవస్థ గురించి అలోచనలు మదనపడుట. పెద్దల సహకారంతో ఆనందం.

**కన్యరాశి:** చేతి వృత్తి వ్యవహారాలందు మిశ్రమఫలితాలు జీవనపోరాటం ఆత్మశక్తితో ముందు అడుగులు వేయుట, సంతాన అభివృద్ధి కోసం టెంక్షన్స్ పురుషులు, స్త్రీలతో జాగ్రత్తలు. స్త్రీలకు మాత్రంలాభం మాటచలామణితో సర్వకార్యాలు అభివృద్ధి చేసుకొనుట బాహు, ఉదయంసంబంధ వ్యాది రావచ్చు ఉండవచ్చు.

**తులారాశి :** సర్వంశుభములు అనుకోకుండా పెళ్ళి, శుభకార్యాలు నెరవేరును అందరి సహకారాలు లభించును. వృత్తి వ్యాపారాలు యందు లాభం అంతా శుభమే. సంతాన విషయంలో మానసిక టెంక్షన్స్ గుర్తింపు అభివృద్ధి లేకపోవుట. తల్లిదండ్రుల భావాలు రిపీట్ అవుట ఆనాటి ప్రమాణాలు ఆదారంగా నిర్ణయాలు తీసుకోనుట, ముందు అడుగులు వేయుట అభివృద్ధి పొందుట.

**వృశ్చికరాశి :** ప్రతి విషయంలో అనేక మానసిక టెంక్షన్స్‌తో శారీరక నరాలు బలహీనం అగుట, నిర్జీవం అయినట్లు, భావం కావలసినంత ధనప్రాప్తి స్త్రీలకు కాస్తంత పర్వాలేదు. పురుషులకు మాత్రం అయ్యబాబోయి అన్నట్లు ఉండుట, మొత్తం మీద తమను తాము కాపాడుకుంటారు. దైవక్రియలు చేయును.

**ధనస్సురాశి :** అంతా అన్యోన్యదాంపత్యసుఖము,లాభమువివాహాది శుభకార్యాలు వల్ల లాభము. అందరి ఆశీర్యచనములు లభించును. ప్రతి రూపాయి మంచిది , శుభము అనుకుంటేనే ఖర్చులు చేయుదురు. భార్యమణిలకు ఖర్చులు ఎక్కువ, ధైర్యం సన్నగిల్లుట .అంతర్గత: సంతాన విషయయంలో చికాకు ఉండుట అభివృద్ధికి కష్టం.

**మకరరాశి :** అష్ట అవమాన భంగములు, జీవితం శత్రువుల చేతిలో ఇరుక్కున్నట్లు ఉండుట . ప్రతి మాట పెడ అర్థం చేసుకొనుట. ఎత్తైన ప్రదేశాల నుండి పడిపోవుట, ప్రాణగండములు. రాజకీయ నాయకులకు చాలా జాగ్రత్తలు పాటించుట మంచిది. విమానాలు, హెలికాప్టర్స్ ప్రమాణాలకు దూరంగా ఉండుట మంచిది. 65 నుండి 72 సం॥ వయస్సు వారు కూడా చాలా జాగ్రత్తలు పాటించుట, అరోగ్య సూత్రాలు పాటించుట మంచిది . అంతర్గత: ఆస్తుల విషయంలో ఆందోళనలు ఉండుట. ఇది అది అనేది లేకుండా ప్రతి విషయంలో జాగ్రత్తలు పాటించుట మంచిది. సీబీఐ దర్యాప్తులు గురి అవవచ్చు. జులై, ఆగష్టు నెలలు అసలు అశ్యవశ్యత ఉంటుంది. యోగం అష్టదరిద్ర్యాల వెంటాడుతున్నట్ల ఉండవచ్చు అతి జాగ్రత్తలు మంచిది.

**కుంభరాశి:** ఆందోళన ఆతురత,మాటలతో చలామణి చేయుదురు సర్వసుఖ సౌఖ్యములు అనుభవింతురు. అభివృద్ధి, గుర్తింపు లేకుండుట సన్యాసయోగంలో రాజు/రాణి యోగం అనుభవించుట. సంతాన విషయంలో వివాహాది శుభకార్యాలు నెరవేరుట. భార్య, భర్తలలో ఒక్కరికి దినదినాభివృద్ధి, సర్వసుఖ సౌఖ్య ప్రాప్తి అనుభవింతురు. వృత్తి యందు చికాకులు గుర్తింపు లేకపోవుట జరుగును.

**మీనరాశి :** గృహ అలంకరణ నిమిత్తం ఖర్చులు, ఇష్ట వస్తువు లభించుట వివాహాది శుభ కార్యాములు నెరవేరును. వృత్తియందు అధికారులు ఒత్తిడి అలసటలు నరాల బలహీనం. భార్య/భర్త అంతర్గత: ఆందోళన ఆత్రుత, ధైర్యంగా సమస్యలు పోరాటం. ఆవుల వలయంలో కూరుకుపోవుట రోటేషన్ లైఫ్ జీవిత భారం గమనం చేయును.

# పెరుగుతున్న ‘ చిల్లర ’ తగాదాలు

“ రూ.10కి 100 నోటు ఇచ్చావేంటి …?ఆటోవాలా
వందే ఉంది.. చిల్లరలేదు .. ప్రయాణీకురాలు
చిల్లర లేదంటే ఎలా.. మార్చుకొని తీసుకురా.. ఆటోవాలా చిరాకు
నాకెవరు ఇస్తారు.. ? నువ్వే వెళ్లి తీసుకురా.. ప్రయాణీకురాలు (కోపంతో)
చిల్లర లేకుండా ఎందుకు వస్తారమ్మా.. ఆటోవాలా.
మర్యాదగా మాట్లాడు.. ప్రయాణీకురాలు.

ఇదేంటయ్యా రూ.100కి 500 నోటు ఇచ్చావు.... చెప్పుల షాపు యజమాని
చిల్లర లేదు ఏమిచేయమంటావు …కస్టమర్
ఏమ్మా.. టిక్కెటు సరిపడా చిల్లర లేదా..అయితే బస్సు దిగు అందరికి చిల్లర ఎక్కడ తెచ్చి ఇచ్చేది…? బస్సు కండెక్టర్.
బస్సు నీ సొంతమా … దిగమంటున్నావు .. గయ్యిమంది.. ప్రయాణీకురాలు…

ప్రజావసరాలకు సరిపడా చిల్లర చెలామణి కాకపోతుండడంతో వాదనలు, తగదాలు చోటుచేసుకుంటున్నాయి. దుకాణాలు, హోటళ్ళు, బస్సులలో ప్రతి ఒక్కరిని చిల్లర సమస్య వేదిస్తుంది. చిల్లర కోసం అవసరంలేని వస్తువులను సైతం కొనాల్సివస్తోందని ప్రజానీకం వాపోతోంది. 95 రూ.ఏదైనా వస్తువును కొనుగోలు చేస్తే మిగిలిన 5రూ.లకు చిల్లర లేదనే నెపంతో చాక్లెటు, మరొకటో అంటగడుతున్నారని అనేక మంది వాపోతున్నారు. చిల్లర కారణంగా వాదనలు, గొడవలు నిత్య కృత్యంగా మారాయని, ఒక్కరోజు కూడా చిల్లర కారణంగా గొడవ జరగకుండా ఉండదని తుళ్ళూరులోని దుకాణాదారుడు ఒకరు చెప్పారు. ప్రభుత్వం స్పందించి ప్రజల అవసరాలకు అనుగుణంగా చిల్లరను చెలామణిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

– రాజధాని ప్రతినిధి, తుళ్లూరు

# పగటి పూట నీరు ఎలా త్రాగాలి?

ఆరోగ్యం



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

మనం ఉదయం పూట తాగిన నీరు 10,11 గంటల వరకు శరీర అవసరాలను తీర్చడానికి సరిపోయింది. ఆ సమయం నుండి శరీరానికి నీటి అవసరం వరకూ ఉంటుంది. పగటి పూట అంటే, ఉదయం టిఫిన్ తిన్న తరువాత నుండి సాయంకాలం వెలుతురున్న వరకు తాగే నీటి విషయం. ఈ సమయంలో తాగిన నీరు శరీరాన్ని శుభ్రపరచడానికి పనికి రాదు కానీ, శరీరాన్ని ఎండ నుండి కాపాడుకోవడానికి, పని చేసినపుడు కండరాలలో పుట్టే వేడిని చల్లార్చడానికి, జీర్ణాది రసాల ఉత్పత్తికి సహకరిస్తుంది. పగటి పూట మనం 2 1/2 లీటర్లు నీరు తాగితే మంచిది. ఈ నీటిని ఎప్పుడు పడితే అప్పుడు, తినేటప్పుడు కాకుండా ఒక పద్ధతి ప్రకారం తాగితే సవ్యంగా ఉపయోగపడతాయి. అలా అయితే శరీరం రక్షించబడుతంది.

### మూడవ దఫా నీరు

రెండవ దఫా నీటిని తాగిన తరువాత 25,30 ని॥లు గ్యాప్ ఇచ్చి, మీరు ఏదన్నా టిఫిన్ తినేటప్పుడు నీటిని తాగవద్దు. టిఫిన్ తిన్న రెండు గంటల తరువాత ఈ మూడువ దఫా నీటిని ఒకేసారి మాత్రం తాగకూడదు. అలా తాగితే బరువుగా, ఆయాసంగా ఉంటుంది. ఈ నీటిని 2,3 అంచెలుగా తాగితే మంచిది. అంటే, అప్పుడొక, గ్లాసు, చొప్పున తాగాలి. మధ్యాహ్నం భోజనానికి అరగంట ముందువరకు తాగి ఆపి వేయాలి. ఇక భోజన సమయంలో తాగరాదు. మాత్రలు మింగడానికి గానీ, గొంతుబాగా పట్టినప్పుడు గానీ ఒక గుక్కెడు తాగవచ్చు.

### నాల్గువ దఫా నీరు

మధ్యాహ్నం భోజనం అయిన రెండుగంటల తరువాత నుండి 2,3 అంచెలుగా లీటరు నుండి లీటరుంపావు వరకు తాగవచ్చు. ఇలా తాగితే జీర్ణమైన ఆహారాన్ని ప్రేగులు పీల్చుకోవడానికి సహకరిస్తుంది. 55,60 సం॥లు పైబడిన వారు సాయంకాలం 4,5 గంటలు దాటిన తరువాత ఇక నీటిని తాగకుండా ఉంటే రాత్రికి మూత్రం సమస్య ఉండదు.

### ఐదవ దఫా నీరు

ఇది అందరికీ అవసరం లేదు. ఎవరైతే నాల్గవ దఫాలో నీరు తక్కువ తాగారో వారికి, బాగా ఎండలో చెమటలు పట్టే పనిచేసినవారికి, యుక్త వయస్సులో ఉన్న వారికి, ఉదయం రెండవ విరేచనం సాఫీగా అవ్వని వారికి, మూడవ విరేచనం ప్రయత్నిద్దామనే వారికి మంచిది. పైన చెప్పిన వారు మాత్రం ముప్పావు లీటరు నుండి నీటి వరకు సాయంకాలం 6 గం॥ల సమయంలో తాగి విరేచనం అవ్వాలని ప్రయత్నిస్తే సరిపోతుంది. రాత్రిపూట నీటిని తాగనవసరం లేదు. ఎవరికన్నా రాత్రి 9,10 గం॥లకుక దాహం అనిపిస్తే అరగ్లాసు లేదా గ్లాసు తాగి పడుకోవచ్చు.

### తినేటప్పుడు నీరు త్రాగితే నష్టమేమిటి?

కొంతమంది నీరు తాగి వెంటనే తినడం మొదలు పెడతారు. మరికొందరు తినేటప్పుడు తాగితే, ఇంకొందరు తిన్నాక తాగుతారు. ఇలా నీటిని తాగడం జీర్ణక్రియకు ఇబ్బందిని కలిగించడమే. మనం తిన్న ఆహారాన్ని అరగించడానికి పొట్టలో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఊరుతుంది. ఆ యాసిడ్ మన ఆహారంతో డైరెక్టుగా కలిస్తే ఆహారం త్వరగా అరిగి పిండిపిండిగా విడగొట్టబడుతుంది. ఇలా జరగకుండా మనము తినేటప్పుడు తాగిన నీరు పొట్టలోనికి వెళ్ళి, లోపల ఊరిన హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని పలుచగా (యాసిడ్‌కి నీరు కలిపితే గాఢత లేదా పవర్ తగ్గిపోతుంది) చేసేస్తుంది. దానితో జీర్ణక్రియకు మామూలు కంటే రెట్టింపు సమయం పడుతుంది. తినేటప్పుడు నీరు తాగడం వల్ల వచ్చే నష్టాలు చూస్తే, భుక్తాయాసము రావడము, కడుపులో మంటలు రావడము, అజీర్ణం కలగడం, ఆహారం ఎక్కువ సేపు నిలువ ఉండి పులవడం, గ్యాసు తయారవడం, త్రేన్పులు ఎక్కువగా రావడం, పొట్ట సాగిపోవడం మొదలగునవి అన్నీ వస్తూ ఉంటాయి. తినేటప్పుడు నీటిని తాగడం అసహజం. పండ్లు,పచ్చి కూరలు తిన్నప్పుడు మీరు బాగా నమిలి తింటున్నారు కాబట్టి గొంతు పట్టడం గానీ, ఎక్కిళ్ళుగానీరావు. ఆహారాన్ని మెత్తగా పిండి,పిండిగా నమిలి, మెల్లగా తింటూ ఉంటే తినేటప్పుడు నీరు అవసరంరాదు. క్రొత్తలో వారం, పది రోజులు ఎంతో హాయి అనిపిస్తుంది. బద్దలు నీళ్ళు, కలిపి పోసి రోటిలో రుబ్బితే పిండి నలగదు కబట్టే ముందు బద్దలను రుబ్బి ఆ తరువాత నీరు కలుపుకోవడం మన అలవాటు అలాగే ఇక నుండి మీ పొట్టలో కూడా అలాగే రుబ్బుకోవడానికి ప్రయత్నించండి.

# రాజన్‌తో వ్యవహరించేది ఇలాగేనా

- ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించక తప్పదు
- మోడీ సర్కార్‌పై విరుచుకుపడ్డ ఆర్థికవేత్తలు

**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంకు గవర్నర్ రఘురామ్ రాజన్‌ను పొమ్మనకుండానే పొగబెడుతున్న తీరు మోడీ ప్రభుత్వాన్ని బోనులో నిలబెడుతోంది. ప్రముఖ ఆర్థికవేత్తలు, మాజీ విధానా నిర్ణేతలు కేంద్రప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు ఇది శుభ శకునం కాదని వారు తేల్చిచెపుతున్నారు. ద్రవోల్బణం నియంత్రణ, మొండి బకాయిల నిరోధక విధానంపై భారత్ వ్యతిరేక వైఖరి అవలంభిస్తుందని ప్రపంచ భావించే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇది భారత ప్రతిష్టకు భంగకరమని స్పష్టం చేస్తున్నారు. ఆర్‌బీఐ గవర్నర్ రంగరాజన్ పదవి నుంచి తీరు ప్రపంచ దేశాలలో చర్చకు దారి తీస్తోంది. భారత్.. ప్రపంచ ఆర్థిక రంగ చోదక శక్తి అంటూ మోడీ అంతర్జాతీయ వేదికలపై చేస్తున్న ప్రసంగాలు చేస్తున్నారు. మరోవైపు ద్రవ్యోల్బణం నియంత్రణ, బ్యాంకుల మొండి (కార్పొరేట్) బకాయిలపై గట్టిగా వ్యవహరిస్తున్న ఈ వైఖరుల మధ్య ఎక్కడా పొంతన కుదరడం లేదు. బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ఇటీవల వరుసబెట్టి రాజన్‌పై తీవ్ర ఆరోపణలు చేయడం, వాటిని ప్రభుత్వ పెద్దలెవరూ ఖండించకపోవడం ఓ పథకం ప్రకారమే జరిగిందేమోననే అనుమానాలకు ఇప్పుడు బలం చేకూరుతోంది. రాజన్‌ను సాగానంపేందుకు సుబ్రహ్మణ్య స్వామి అనే తూర్పుముక్కను ప్రయోగించారని స్పష్టమవుతోంది. చికాగో వర్సిటీకి చెందిన రాజన్ సహోద్యోగి ప్రొఫెసర్ లూగి జింగేల్స్ ఇది ‘భారత్‌కు అతిపెద్ద నష్టం’గా అభివర్ణించారు. హార్వార్డ్ వర్సిటీ ప్రొఫెసర్ గీతా గోపీనాథ్ ‘ప్రభుత్వ నిర్ణయం తీవ్ర నిరాశకు గురిచేసింది’ అని వ్యాఖ్యానించారు. రాజన్‌ను కాపాడుకోవడానికి ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించడానికి బదులు.. భారత ప్రయోజనాలపై ఆయనకున్న నిబద్ధతపై అవమానకర వ్యాఖ్యలు చేసి సాగనంపడం అత్యంత విచారకరమన్నారు. భారత సంతతికి చెందిన ఆర్థికవేత్త, బ్రిటీష్ లేబర్ పార్టీ నాయకుడు మేఘనాథ్ దేశాయి ‘విదేశాలలో భారత ప్రతిష్ట ఇలా దిగజారడం బాధకలిగిస్తోంది’ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్రబ్యాంకులు అత్యుత్తమ గవర్నర్లలో రాజన్ ఒకరని ప్రపంచ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త, భారత మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు ప్రశంసించారు. అర్థిక వ్యవహారాలలో ప్రపంచంలోనే అత్యంత నిపుణుడైన ఆలోచనాపరుల్లో ఒకరిని భారత్ వదలుకుంటోందని నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. ఇది దేశానికి, ప్రభుత్వానికి కూడ విచాకరమన్నారు. ఆయిన మోడీకి మంచి ప్రశంసకుడు కాదని వ్యాఖానించారు. ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా పనిచేసిన రాజన్ (53) ఆర్బీలో కొనసాగడంపై తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబరు 4తో తన పదవీ కాలం ముగుస్తున్నదని, రెండో విడత ఆ పదవిలో కొనసాగనని స్పష్టం చేశారు. చికాగో బూత్ స్కూల్ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా ఉన్న రాజన్ ప్రస్తుతం లీవ్‌పై ఉన్నారు. ఆయిన తిరిగి తన ప్రొఫెసర్ విధుల్లో చేరనున్నారు. అయితే భవిష్యత్‌లో మరోసారి ఆయిన భారత్‌లో పనిచేసే అవకాశాలు లేకపోలేదు. ద్రవ్యోల్బణం నియంత్రణ, బ్యాంకుల బకాయిల పుస్తకాలు శుభ్రం చేయాలనే తన లక్ష్యం అసంపూర్తిగానే ఉందని రాజన్ తెలిపారు. అయితే ‘తగిన పరిశీలన, ప్రభుత్వంతో సంప్రదింపుల అనంతరం’ రెండో సారి ఆ పదవిలో కొనసాగకూడదని నిర్ణయించుకున్నానని ఆయిన వెల్లడించారు. ఈ మాటలలో ఆయిన మనోభావాలేమిటో చెప్పగనే చెప్పారు. ఇటీవల నెలల్లో సంభవించిన పరిణామాలు, కొన్ని వర్గాలు ఆయినపై వ్యక్తిగత దాడులకు దిగడం, దానిపై ప్రభుత్వం అంటీముట్టనట్టు వ్యవమరించడంపై ఆయిన అసంతృప్తికి లోనయ్యారని కొన్ని వర్గాలు చెపుతున్నాయి. భారత్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు రాజన్‌ను పదవి నుంచి సాగనంపడం ‘దేశానికి నష్టం’ అని అభిప్రాయపడ్డారు. దీనికి భారత్ ఆర్థిక వ్యవస్థ చాలాపెద్ద మూల్యమే స్పష్టం చేస్తున్నారు. రాజన్ భారత్‌లోనే కాదు ప్రపంచంలోనే అత్యంత ప్రతిభావంతులైన కేంద్ర బ్యాంకు గవర్నర్‌లలో ఒకరని చరిత్ర నిరూపిస్తుందని గోపీనాథ్ తెలిపారు.

# తుళ్లూరు బస్టాండ్ అభివృద్ధి జరిగేనా…?

**రాజధాని ప్రతినిధి – తుళ్ళూరు :** రాజధాని ప్రాంతం మండల కేంద్రమైన తుళ్ళూరులో ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడంలేదు. అరకొర సౌకర్యాలతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. రాజధాని నేపథ్యంలో బస్టాండ్ అభివృద్ధికి అధికారులు చర్య తీసుకుంటారని భావిస్తే అందుకు విరుద్ధంగా మొక్కుబడిగా అభివృద్ధి చర్యలు స్థానికులు విమర్శిస్తున్నారు. రాజధాని ప్రకటన అనంతరం బస్టాండ్ ఆవరణలో గుంతలు పూడ్చడం, రంగులు వేయడం. నామమాత్రంగా మొక్కలు నాటించడం మినహా చేసిందేమీ లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌కు 1977 వ సంవత్సరములో అప్పటి రోడ్డు రవాణా శాఖ మంత్రిగా ఉన్న చేబ్రోలు హనుమయ్య శంకుస్థాపన చేయగా 1981లో మంత్రిగా ఉన్న కె.రోశయ్య బస్టాండ్‌ను ప్రారంభించారు. అమరావతి, విజయవాడ, గుంటూరు, మంగళగిరికి ఈ బస్టాండు మీదుగా బస్సులు రాకపోకలు సాగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన బస్టాండ్ అభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు సరైన శ్రద్ధ కనబరచడం లేదన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. రాజధాని నిర్మాణ నేపథ్యంలో ప్రజావసరాలకు అనుగుణంగా సుమారు 25 ఎకరాల్లో రాజధానిలో బస్టాండ్ నిర్మాణం జరిపేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేందుకు ఎంత సమయం పడుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో తాత్కాలికంగానైనా బస్టాండ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానికులతో పాటు ప్రయాణీకులు కోరుకున్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్‌లో వసతులు కల్పించాలని కోరుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా బస్టాండ్ ఆవరణలో బురదమయంగా మారుతోందని తక్షణమే బస్టాండ్ ఆవరణను అభివృద్ధి చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం ప్రయాణీకులకు అవసరమైన మేరకు బల్లలు ఏర్పాటు చేయడం తదితర సౌకార్యలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బురదమయమైన తుళ్ళూరు బస్టాండ్

# 30 లక్షల టన్నుల పప్పుధాన్యాల దిగుమతి

**న్యూఢిల్లీ :** దేశంలో నిత్యావసర వస్తువులు ప్రత్యేకించి పప్పుధాన్యాల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో పప్పు ధర రూ. 200కు చేరింది. ధరలు తగ్గించే విషయంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు చేతులెత్తేశాయి. పెరిగిన ధరలు తగ్గించే ప్రయత్నంలో భాగంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 30 లక్షల టన్నుల పప్పు ధాన్యాలు దిగుమతి చేసుకోవడానికి వ్యాపారవేత్తలు ఒప్పందాలు సంతకాలు చేశారు. దేశీయంగా పప్పుధాన్యాల దిగుమతికి వ్యాపారవేత్తలు ముందుకు వచ్చారు. పప్పు ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గటంతో దిగుమతులపై ఆధారపడవలసి వచ్చింది. వరుస కరువులు, దేశీయంగా డిమాండు పెరగడం కారణంగా ధరలు విపరీతంగా పెరిగాయి. 2015-16 పంటల సంవత్సరం(జులై-జూన్)లో పప్పుధాన్యాల ఉత్పత్తి 17.06 మిలియన్ టన్నులకు పడిపోయింది. దేశీయంగా 23-24 మిలియన్ టన్నుల డిమాండు పెరిగింది. ఈ వ్యత్యాసాన్ని పూడ్చడానికి వ్యాపారవేత్తలు దిగుమతులపై ఆధారపడుతున్నారు. గతేడాది వ్యాపారవేత్తలపై రికార్డు స్థాయిలో 5.79 మిలియన్ టన్నుల పప్పుధాన్యాల దిగుమతికి ఒప్పందాలు జరిగాయి. ఇది ఆగష్టు నుంచి డిసెంబరు దాకా జరిగే అవకాశం ఉంది. ఇందులో కందిపప్పు, పెసర, మినుము, వంటి ఇతర పప్పులు ఉన్నాయని ఇండియన్ పల్సెస్ అండ్ గ్రెయిన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిమల్ కొథారి పియన్, దేశాలు, తూర్పు ఆఫ్రికా, మిమన్మారు నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉందని ఆయిన వివరించారు. దాదాపు రెండు బిలియన్ డాలర్ల విలువైప పప్పుధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నామన్నారు.

# ఉద్యోగావకాశాలు

**బీపీసీఎల్ కొచ్చి రిఫైనరీలో.. కొచ్చి రిఫైనరీలో ఖాళీల భర్తీకి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **కెమిస్ట్రీ ట్రైయినీ :** 6 కనీసం 60 శాతం మార్కులతో ఎం.ఎస్.సి. కెమిస్ట్రీ/ ఎనలిటికల్ కెమిస్ట్రీ చేసి ఉండాలి.
- **జనరల్ వర్క్‌మ్యాన్ (ట్రైయినీ) - కెమిస్ట్రీ :** 15 వర్క్‌మ్యాన్ (ట్రైయినీ) – మెకానికల్ : 35 – జనరల్ వర్క్‌మ్యాన్ (ట్రైయినీ) – ఎలక్ట్రికల్ : 15 – అర్హత : జనరల్ వర్క్‌మ్యాన్ పోస్టులకు సంబంధింత విభాగంలో (కెమికల్ ఇంజినీరింగ్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్) కనీసం 60 శాతం మార్కులతో డిప్లమో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు :** జూన్ 1, 2016 నాటికి 18 – 30 సంవత్సరాల మధ్య ఉండాలి.
- **ఎంపిక :** రాత పరీక్ష, స్కిల్/ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా.
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తుకు చివరితేదీ :** జులై 4
- **వెబ్‌సైట్ :** www. bharatpetroleum.com

### దేశ సేవ, కెరీర్ కోసం.. బీఎస్ఎఫ్ ఉద్యోగాలు

త్రివిధ దళాల్లో ఉన్నట్లుగానే సరిహద్దు భద్రతాదళం (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ – బీఎస్ఎఫ్)లో కూడా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి ప్రతి సంవత్సరం ప్రకటన వెలువడుతుంటుంది. రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్ష, మెడికల్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తుంటారు. జనరల్ డ్యూటీ విభాగంలో అసిస్టెంట్ కమాండెంట్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (రేడియో మెకానిక్), కానిస్టేబుల్ (రేడియో ఆపరేటర్), హెడ్ కానిస్టేబుల్ (ఫిట్టర్) పోస్టులు ఉంటాయి. వీటిలో చేరాలనుకునేవారికి అవసరమైన అర్హతలు పోస్టుల వారీగా ఇలా ఉన్నాయి.

- **సబ్ ఇన్‌స్పెక్టర్ అర్హత :** డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్వేశిత శారీరక ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి. అభ్యర్థి 170 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి.
- **వయో పరిమితి :** 20–25 సంవత్సరాలు ఉండాలి. (ఎస్సీ, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది)
- **కానిస్టేబుల్ అర్హత :** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కూడా తప్పనిసరిగా ఉండాలి.
- **వయో పరిమితి :** ఆగస్టు ఒకటో తేదీ నాటికి 18–23 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది)
- **శారీరక ప్రమాణాలు :** పురుషులైతే 170 సెంటీమీటర్ల ఎత్తు ఛాతీ 80–85 సెంటీమీటర్ల మధ్య ఉండాలి. మహిళాలు 157 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగ్గబరువు తప్పనిసరి.
- **అసిస్టెంట్ కమాండెంట్ అర్హత :** డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఎన్.సి.సి. బి లేదా సి సర్టిఫికెట్ ఉండాలి. ఏవైనా క్రీడల్లో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధ్యానం ఇస్తారు.
- **వయో పరిమితి :** 19–25 సంవత్సరాల మధ్యవయసు ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది)
- **ఎంపిక విధానం :** రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టు, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులకను ఎంపిక చేస్తారు.
- **అసిస్టెంట్ కమాండెంట్ (టెక్నికల్) అర్హత :** మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో బీఎస్సీ ఉత్తీర్ణత
- **వయో పరిమితి :** 19–25 సంవత్సరాల మధ్య ఉండాలి (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది)
- **అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (రేడియో మెకానిక్) అర్హత :** రేడియో అండ్ టీవీ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో ఎందులోనైనా డిప్లమో లేదా ఎంపీసీ గ్రూప్ 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులైతే 170 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి.
- **వయో పరిమితి :** 18–25 సవత్సరాల మధ్య వయసు ఉండాలి (ఎస్సీ, ఎస్టీ,ఓబీసీ, అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది)
- **హెడ్ కానిస్టేటుల్ (ఆపరేటర్) అర్హత :** పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు రేడియో, టీవీ, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో రెంటు సంవత్సరాలు ఐటీఐ లేదా ఎంపిసి గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. జనరల్ అభ్యర్థులు 170 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి.
- **వయో పరిమితి :** 18–23 సంవత్సరాల మధ్య ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది)
- **హెడ్ కానిస్టేబుల్ (ఫిట్టర్) అర్హత :** పదో తరగతితోపాటు ఇంజిన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఆటోమొబైల్, మోటార్ మెకానిక్ విభాగాల్లో ఎందులోనైనా రెండు స్వత్సరాల ఐటీఐ కోర్సు లేదా ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయో పరిమితి :** 18–23 సంవత్సరాల మధ్య ఉండాలి (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

# ఫిదియా సిద్ధాంతం

## (రంజాన్ సందర్భంగా)

**(గతవారం తరువాయి)**

ఫిదియా సిద్ధాంతములు

01. ఒక ఉపవాసపు ఫిద్య (బదులుగా) కొంతమంది పేదలకు ఇవ్వవచ్చును. ఇదే విధముగా కొన్ని ఉపవాసాల ఫిద్య ఒకే పేదవానికి ఇవ్వవచ్చును. **(ఫతావా రహీమియా 5/196)**

02. "షేఖె ఫానీ' అనగా మిక్కిలి వృద్ధులైన వారు ఉప వాసము పాటించే శక్తి లేనప్పుడు, తరువాతి కాలములో కూడ ఉపవాసముందు శక్తిని పొందే ఆశ లేనప్పుడు, ఉపవాసమునకు బదులు (ఫిద్య) చెల్లించుట తగును. **(ఫతావా దారుల్ ఉలూమ్, జి6. స 482)**

03. బలహీనులైన గర్భవతులు లేక వ్యాధిగ్రస్తులు ఉప వాసపు ఫిదియా ఇచ్చిన సరిపోదు. ఫిదియ ఇచ్చినప్పటికి ఆరోగ్యవంతులైన తరువాత ఉపవాసముల ఖజా పాటించడం వాజిబ్ (తప్పనిసరి)యై యున్నది. **(ఫతావా దారుల్ ఉలూమ్, జి.6, /478)**

22. ఉపవాసపు కఫ్ఫార

(పరిహారము, శిక్ష)

పాపమునకు బదులు అల్లాహ్ నిర్ణయించి పరిహారమును, శిక్షను కఫ్ఫార అందురు. కఫ్ఫారతో పాపములు కడిగివేయబడతాయి. ఉపవాసముయొక్క కఫ్ఫార ఒక బానిసను విడిపించుట (స్వతంత్రుని జేయుట) ఇది కానిచో రెండు నెలలు ఎడతెరిపి లేకుండ ఉపవాసముండుట. ఇది కూడా వీలుకానిచో 60 మంది పేదలకు రెండు పూటలా కడుపునిండా భోజనము పెట్టవలెను. లేకపోతే ఒక్కొక్కరికి సదఖయె ఫిత్ర్ పరిమాణములో (1 కిలో, 574 గ్రాముల 640 మిల్లిగ్రాముల) ధాన్యమును 60 మందికి ఇవ్వవలెను. లేదా దాని విలువను చెల్లించవలెను. **(బిహిష్తీజేవర్, 3/15, దీనియాత్ 2 యం. స.73)**

23. తరావీహ్ నమాజ్

పవిత్రమైన రమజాన్ నెలలో ఇషా నమాజ్‌యొక్క ఫర్జ్ మరియు సున్నత్ నమాజ్‌లు ఆచరించిన తరువాత విత్ర్ నమాజ్‌కు ముందు ఆచరించే నమాజ్‌ను తారావీహ్ నమాజ్ అందురు. దీని వేళ ఇషా నమాజ్ తరువాత నుండి ఉషోదయం వరకు ఉంటుంది.

యుక్త వయస్కులైన ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ తరావీహ్ నమాజ్‌ను ఆచరించుట "సున్నతె ముఅక్కద" (మన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి స సల్లమ్ తప్పకుండ ఆచరించిన పనులు). కాబట్టి సమర్థనీయమైన కారణం లేకుండా, కావాలని తరావీహ్ నమాజ్‌ను ఆచరించనివాడు అపరాధి అవుతాడు. పవిత్ర రమజాన్ నెలపొడుపు కనపడిన రాత్రి నుండి తరావీహ్ నమాజ్ ఆచరించుట ప్రారంభం అవుతుంది. రమజాన్ పండుగ నెలపొడుపు (షవ్వాల్ నెలవంక) కనపడే వరకు ఆచరించబడుతుంది.

**(దీనియాత్ 5, బిజి స. 104)**

**గమనిక**

అల్లాహు తఆలా నుండి లభించే పరలోక పుణ్యఫలాలపై నమ్మకముంచి, క్రమము తప్పకుండా తరావీహ్ నమాజ్‌ను శ్రద్ధాభక్తులతో ఆచరించిన విశ్వాసియొక్క పూర్వపు సమస్త పాపాలను అల్లాహు తఆలా క్షమించివేస్తాడు. (తిర్మిజీ, 1/84)

**23.1. తరావీహ్ నమాజ్ ఆచరించే పద్ధతి**

పవిత్రమైన రమజాన్ మాసంలో ఇషా యొక్క ఫర్జ్ మరియు సున్నత్ నమాజ్‌లు ఆచరించిన తరువాత, తరావీహ్ నమాజ్ కొరకు సంకల్పం చేసుకొని, రెండేసి రకాతుల చొప్పున, పది సలాములతో 20 రకాతుల నమాజ్‌ను ఆచరించవలెను. ప్రతి నాలుగు రకాతుల తరువాత కొంతసేపు కూర్చొని విశ్రాంతి తీసుకోవలెను. ఆ విశ్రాంతి సమయంలో కూడా మౌనంగా దైవనామ స్మరణం చేయడం మంచిది. (దీనియాత్ 5 బిజి, స. 104)

రమజాన్ నెలంతా ఆచరించే తరావీహ్ నమాజ్‌లో పవిత్ర ఖుర్‌ఆన్‌ను సంపూర్తిగా పఠించుట సున్నత్ అయియున్నది. కానీ తమ శక్తి కొలది అనేకసార్లు పవిత్ర ఖుర్‌ఆన్‌ను సంపూర్తిగా చదివిన మరీ మంచిది. (దీనియాత్, 5 బిజి, స. 194)

ఇషా నమాజ్ ఆచరించే సమయమందే తరావీహ్ నమాజ్ కూడా ఆచరించ బడుతుంది. కానీ తరావీహ నమాజ్, ఇషా నమాజ్‌కు అనుబంధమగుటచే ఇషా ఫర్జ్ నమాజ్‌కు ముందు తరావీహ్ నమాజ్ ఆచరింపబడదు. కాబట్టి ఎవరైనా తరావీహ్ నమాజ్ ప్రారంభమైన తరువాత మసీదుకు వెళ్ళినచో, ముందు ఇషా ఫర్జ్ ఆచరించి, తరువాత తరావీహ నమాజ్ జామాత్‌లో పాల్గొనాలి. (దీనియాత్ 5 బిజి, స. 104)

**మసాయిల్ (సిద్ధాంతాలు)**

01. ఇషా నమాజ్ జమాత్‌తో ఆచరించని వ్యక్తి. ఇషా ఫర్జ్ ఆచరించిన తరువాత, తరావీహ్ నమాజ్ జమాతోత్ ఆచరించవచ్చును.

02. ఆలస్యంగా తరావీహ్ నమాజ్‌లో పాల్గొనిన వ్యక్తి, ఇమామ్‌గారితో విత్ర్ నమాజ్ ఆచరించిన తరువాత తప్పిపోయిన తరావీహ్ నమాజ్‌ను ఆచరించాలి. (దీనియాత్ 5 బిజి, స 104)

**24. రమజాన్ నెలలో ఖుర్‌ఆన్ పారాయణము**

"మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారు రమజాన్ నెలలో అందరికన్నా ఎక్కువగా దనధర్మాలు చేసేవారు. ప్రతిరోజూ రాత్రి జిబ్రా ఈల్ దూతకు ఖుర్‌ఆన్ పారాయణము చేసి వినిపించేవారు. జిబ్రాఈల్ అలైహిస్సలామ్ కూడ మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారికి ఖుర్‌ఆన్ వినిపించేవారు."**(బుఖరీ, ముస్లిమ్)**

కాబట్టి మనము కూడా రమజాన్ నెలలో అత్యధికముగా ఖుర్‌ఆన్ పారాయణము చేయవలయును.

25. రమజాన్ నెలపొడుపును చూసి చదివే దుఆలు

అల్లాహు అక్బర్, అల్లాహుమ్మ అహిల్లహూ అలైనా బిల్ యుమ్ని వల్ ఈమాని వస్సలామతి వల్ ఇస్లామి వత్తౌఫీఖి లిమా తుహిబ్బు వతర్‌జా వ రబ్బీ ద రబ్బుకల్లాహ్, ...(తిర్మిజీ)

అర్థం : అల్లాహు తఆలా అందరి కంటే గొప్పవాడు. ఓ అల్లాహ్! నీకు ఇష్టమైన, నీవు ఇష్టపడే 'శ్రేయో శుభాలు, విశ్వాసము, శాంతి సౌభాగ్యాలు, ఇస్లామ్ మరియు దాని ఆచరణ మార్గదర్శనము'తో ఈ చంద్రుని ఉదయింపజేయుము. ఓ చంద్రుడా! నాయొక్క మరియు నీయొక్క (మనిద్దరి) పోషకుడు ఔన్నత్యముగల అల్లాహ్‌యే.

26. శుభకరమైన రమజాన్ నెలలో చదివే శ్రేష్ఠమైన దుఆలు

26.1 సహ్‌రీలో చదివే దుఆ

యా వాసి అల్ మగ్‌ఫిరహ్ - ఓ అత్యధికముగా క్షమించువాడా! **(ఓ అల్లాహ్! నన్ను క్షమించుము)**

26.2 ఉపవాస స్థితియందు

"ఉపవాస స్థితి యందు తిట్టుట, పోట్లాడుట, కొట్లాడుట మొదలగునవి చేయకుము. ఎవరైనా మిమ్ములను తిట్టినను, మీతో మాట్లాడినను, ఆయనతో మీరు "ఇన్నీ సాయిమున్" - (నేను ఉపవాసమన్నాను) అని రెండుసార్లు పలుకమని" రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు తెలిపిరి. **...(బుఖారి)**

26.3 అస్ర్ నుండి షుగ్‌రిబ్ వరకు చదువే దుఆ

యా వాసిఅల్ ఫజ్‌లి ఇగ్‌ఫిర్ లీ – ఓ అత్యధికముగా అనుగ్రహించువాడా! నన్ను క్షమించుము.

26.4 పవిత్రమైన రమజాన్ నెలలో అత్యధికముగా చదువ వలసిన దుఆలు

01. లాఇలాహ ఇల్లల్లాహు అస్‌తగ్‌ఫిరుల్లాహ, అల్లాహుమ్మ ఇన్నీ అన్‌అలుకల్ జన్నత వ అఊజుబిక మినన్నార్ (అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనా యోగ్యులు లేరు. నేను అల్లాహ్‌తో క్షమాపణ వేడుచున్నాను. ఓ అల్లాహ్! నేను స్వర్గమును కోరుచున్నాను. నరకాగ్ని నుండి నీ సరణు (రక్షణ) కోరుచున్నాను.

02. అల్లాహుమ్మ ఇన్నీ అస్ అలుక రిజాక వ జన్నతిక వ అఊజుబిక మిన్ గజబిక, వన్నార్ (ఓ అల్లాహ్! నేను నీ అభీష్టమును (ఇష్టాన్ని), మరియు స్వర్గమును ప్రార్థించుచున్నాను. మరియు నీ ఆగ్రహము (కోపము) నుండి మరియు నరకము నుండి నీ శరణు వేడుచున్నాను)

03. దరూదె షరీఫ్

26.5 రమజాన్‌లో 1-10వ రోజు వరకు పఠించవలసిన దుఆ

అల్లాహుమ్మర్‌హమ్‌నీ యా అర్‌హమఱ్ఱాహిమీన్ (కరుణించేవారిలో కెల్లా మిక్కిలి కరుణించే వాడా! ఓ అల్లాహ్! నాపై కరుణించుము)

26.6 రమజాన్‌లో 11-20వ రోజు వరకు పఠించవలసిన దుఆలు

01. అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ జునూబ్ యా రబ్బల్ ఆలమీన్. **(ఇహ పరలోకాలకు ప్రభువైన ఓ అల్లాహ్! నా పాపములను క్షమించుము)**



02. రబ్బిగ్‌ఫర్ వర్‌హమ్ వ అన్త ఖైరు ర్రాహిమీన్. **(ఓ అల్లాహ్! నన్ను క్షమించుము, మరియు నాపై కరుణించుము, నీవే అత్యధికముగా కరుణించువాడవు)**

26.7 21వ రోజు నుండి చివరి వరకు పఠించవలసిన దుఆ

అల్లాహుమ్మ అతిఖ్‌నీ మినన్నారి వ అద్‌ఖిల్‌నీ ఫిల్ జన్నతి యా రబ్బల్ ఆలమీన్ **(ఇహ పరలోకాలకు ప్రభువైన ఓ అల్లాహ్! నన్ను నరకాగ్ని నుండి కాపాడుము మరియు స్వర్గ ప్రవేశమును ప్రసాదించుము)**

26.8 ఇఫ్తార్ సమయపు దుఆ

అల్లాహుమ్మ లక సుమ్‌తు వ అలా రిజ్‌బిఖిక అఫ్‌తర్‌తు....(అబూదావుద్)

(ఓ అల్లాహ్! నిన్ను ప్రసన్నుని చేయుట కొరకు నేను ఉపవాసముంటిని. నీవు ప్రసాదించిన ఆహారముతో నేను ఉపవాసము విరమించితిని. (విరమించుచున్నాను).)

26.9 ఇఫ్తార్ తరువాత దుఆలు

01. జహబ జ్జమవు వబ్‌తల్లతిల్ వురూఖు వ సబతల్ అజ్‌రు ఇన్‌షా అల్లాహ్....(అబూదావూద్) (దాహము తీరినది. నరాలు ఉల్లాసమును పొందినవి (కళకళలాడినవి) అల్లాహ్ తలచినచో పుణ్యఫలము కూడా నిజపరుపబడినది. (పుణ్య ఫలము లభించును).

02. అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక బి రహ్మతికల్లతీ వసిఅత్ కుల్ల షయ్‌యిన్ అన్ తగ్‌ఫిజీ లీ జునూబీ.... **(అబూదావుద్, ఇబ్నెమాజ)**

(ఓ అల్లాహ్! ప్రతి వస్తువును ఆవరించియున్న నీ కరుణ కటాక్షాల మూలముగా నిన్ను ప్రార్థించుచున్నాను - నీవు నా సమస్త పాపాలను క్షమించుము.

26.10 ఇతరుల చెంత ఇఫ్తార్ చేసిన పఠించు దుఆ

అఫ్తర ఇన్‌దకుముస్సాయిమూన వ అకల తఆమకుముల్ అబ్‌రారు వసల్లత్ అలైకుముల్ మలాయికహ్

**(అబుధావుద్, ముస్లిమ్)** (ఉపవాసులు మీ చెంత ఉప వాసమును విరమించిరి. సజ్జనులు మీ ఆహారమును భుజించిరి. అల్లాహ్ దూతలు (ఫరిష్తాలు) మీ కొరకు దుఆ (వేడుకోలు) చేసిరి. (అల్లాహ్ అనుగ్రహముతో, ఇదేవిధముగా ఉపవాసులు మీ చెంత ఇఫ్తార్ విందు ఆరగిస్తూ యుండాలి. సజ్జనులు మీ ఆహారమును భుజిస్తూ యుండాలి, అల్లాహ్ దూతలు మీ కొరకు కరుణా కటాక్షాల ప్రార్థన చేస్తూ యుండాలి).

27. ఇత్‌తికాఫ్ యొక్క వివరణ

27.1 ఇత్‌తికాఫ్

ఐదు వేలల సామూహికముగా (జమాఅత్‌తో) నమాజ్ జరుగు మసీదునందు ఆరాధనా సంకల్పముతో కొన్ని ప్రత్యేక నియమ నిబంధనలతో ఉండుటను ఇత్‌తకిఫ్ అని, వారు కూర్చొను ప్రదేశాన్ని ముత్‌కఫ్ అని అందురు. **(బిహిష్తేజేవర్, 3/21, దీనియాత్ 2 యం/73)**

ఏకైక ఆరాధయోగ్యుడైన అల్లాహ్ గృహము (మసీదు) యందు యుండి, ఆయనను ఆరాధించుచు, ఆయన నామస్మరణ చేయుచు, ఆయన గ్రంధ పారాయణము చేయుచు ఇహలోక సమస్త కార్యకలాపాలకు దూరమై కాలము గడుపుటయే ఇత్‌తికాఫ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యము. స్త్రీలు మస్‌జిద్‌కు బదులు తమ ఇంటి యందే ఇత్‌తికాఫ్ ఆచరించవలెను.

పవిత్ర రమజాన్ నెల చివరి పది రోజులు ఇత్‌తికాఫ్ పాటించుట "సున్నతె ముఅక్కదయె కిఫాయా" అవుతుంది. అనగా గ్రామము లేక వాడలోని కొందరు ముస్లింలు అయినా ఈ సంప్రదాయాన్ని పాటిస్తే, అది అందరి తరఫున పాటించినట్లవుతుంది, ఏ ఒక్కరూ పాటించకపోతే ఆ గ్రామ ప్రజలందరూ పాపాత్ములవుతారు.

27.2 ఇత్‌తికాఫ్ - ఘనత, విశిష్టత

01. "అల్లాహు తఆలాను ప్రసన్నుని చేసుకొనుటకు ఎవరైన ఒకరోజు ఇత్‌తికాఫ్ ఆచరించినను, అల్లాహు తఆలా ఆయనకు నరక మునకు మధ్య మూడు కందకములు (అగడ్తలు) అడ్డుగా నిర్మిస్తాడు. ఒక్కొక్క కందకము యొక్క వెడల్పు భూమ్యా కాశాల మధ్య యున్న దూరము కన్నా ఎక్కువగా యుండును" అని మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లామ్ గారు తెలిపిరి. (తబ్రాని అనీసత్)

02. "ఎవరైన రమజాన్ నెలలో 10 రోజులు ఇత్‌తికాఫ్ ఆచరించిన, అది రెండు హజ్‌లు, రెండు ఉమ్రాలు ఆచరించిన దానితో సమానమని" మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు తెలిపిరి. **(ఖుత్‌బాతుల్‌అహ్‌కామ్)**

03. "ఇత్‌తికాఫ్ ఆచరించు వారు పాపాల నుండి రక్షింపబడతాడు. అంతేగాక ఇత్‌తికాఫ్ మూలముగా ఏయే పుణ్యకార్యాలు చేయలేరో, వాటి పుణ్యఫలము కూడా వారికి ఆ పుణ్యకార్యాలు ఆచరించు వారికి కలుగు విధముగానే లభించునని" ఒక హదీసులో తెలుపబడియున్నది. **(ఇబ్నె మాజ)**

04. అల్లాహు తఆలా, తనతో సన్నిహిత సంబంధము ఏర్పరచుకొనుటక మరియు దానిని పటిష్టము చేయుట కొరకు తనదాసులకు ఇత్‌తికాఫ్‌ను ఆచరించుటకు ఆజ్ఞాపించెను. మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ప్రతి సంవత్సరము నిష్ఠతో ఆచరించేవారు. పరలోక శ్రేయస్సును కోరి ఇత్‌తికాఫ్ ఆచరించుట చాల పుణ్యకార్యము.

05. ఇత్‌తికాఫ్ ఆచరించు వాడు తన సమస్త శరీరము మరియు సమస్త సమయము అల్లహ్ యొక్క ఆరాధన కొరకు త్యాగము **(అంకితము)** చేయుచున్నాడు.

06. ఇత్‌తికాఫ్ వలన హృదయం నిర్మలమవుతుంది. పరలోక చింతన పటిష్టమవుతుంది. దేవుని సాన్నిధ్యం ప్రాప్తమవుతుంది.

07. ఇత్‌తికాఫ్ ఆచరించువారు ప్రాపంచిక కార్యాలు మరియు అనేక పాపకార్యాల నుండి రక్షింపబడుతారు.

08. అల్లాహు తఆలాను మెప్పించుటయే ఇత్‌తికాఫ్ ఆచరణ యొక్క ముఖ్య ఉద్దేశ్యము. ఇత్‌తికాఫ్ ఆచరించువారు అన్నివేళల నమాజ్ మరియు జమాత్ (సామూహిక నమాజ్) కొరకు ఉత్సాహముతో ఎదురు చూస్తూ కూర్చొనియుంటారు. కావున వారికి అన్ని వేళల నమాజ్ యొక్క పుణ్యము లభించును.

09. ముత్‌కకిఫ్ **(ఇత్‌తికాఫ్ ఆచరించువ్యక్తి)** ఇత్‌తికాఫ్ స్థితియందు అల్లాహ్ యొక్క దూతలను పోలి యుండును. వారివలెనే అన్నవేళలయందు ఆరాధనలలోను, అల్లాహు తఆలా నామ సంస్మరణ యందును, అల్లాహు తఆలా ఔన్నత్యమును కొనియాడుట యందును లీనమై యుండును.

10. మస్‌జిద్ అల్లాహు తఆలా యొక్క ఇల్లు. కాబట్టి ఇత్‌తికాఫ్‌లో యున్న ముత్‌తకిఫ్ **(ఇత్‌తికాఫ్ ఆచరించువ్యక్తి)** అల్లాహు తఆలా యొక్క పొరుగువాడు కాదు కదా, ఇంటిలో ఉన్న అతిథిఇగా పరిగణింపబడును.

11. ముత్‌తకిఫ్ (ఇత్‌తికాఫ్ ఆచరించు వ్యక్తి) అల్లాహ్ ఇంటిలో యుండుటచే షైతాన్ యొక్క దాడుల నుండి సురక్షితముగా యుండును.

12. ముత్‌తకిఫ్ (ఇత్‌తికాఫ్ ఆచరించు వ్యక్తి) ప్రతి నిమిషం అల్లాహ్ యొక్క ఆరాధనలో యుంటాడు. కాబట్టి అతనికి 'షబ్-ఎ-ఖదర్' కూడ తప్పిపోదు. కాబట్టి 'షబ్-ఎ-ఖదర్' ఆరాధన యొక్క పుణ్యఫలము కూడా అతనికి లభించును. **(బెహెష్తీజేవర్, 3/21, దీనియాత్ 2 యం. స. 73)**

27.3 ఇత్‌తికాఫ్ యొక్క సంకల్పము

(నియ్యత్)

బిస్మిల్లాహి దఖల్‌తు వ అలైహి తవక్కల్‌తు వ నవైతు సున్నతల్ ఇత్‌తికాఫ్ (అల్లాహ్ యొక్క శుభనామముతో **(నేను మసీదులో ప్రవేశించుచున్నాను)** మరియు అతనిపై సంపూర్ణ విశ్వాసము కలిగియున్నాను. మరియు సంప్రదాయమైన ఇతిత్‌కాఫ్ యొక్క సంకల్పము చేయుచున్నాను)

27.4 ఇత్‌తికాఫ్‌లో రకాలు

ఇత్‌తికాఫ్ మూడు రకాలు. అవి : 01. వాజిబ్ 02. సున్నతె ముఅక్కదా 03. ముస్తహబ్.

27.4.1. వాజిబ్

మ్రొక్కుబడి తీర్చుట కొరకు ఆచరించు ఇత్‌తికాఫ్ వాజిబ్ అవుతుంది. ఉదా : ఎవరైనా నా ఫలానా పని పూర్తి అయినచో నేను అల్లాహు తఆలా కొరకు మూడు రోజులు ఇతిత్‌కాఫ్ ఉంటానని మ్రొక్కుబడి చేసుకొనినచో, మూడు రోజులు ఇత్‌తికాఫ్ యుండుట వాజిబ్ (తప్పనిసరి) అగును. ఏదైనా కారణంగా వాజిబ్ ఇత్‌తికాఫ్ భంగమైతే దాని ఖజా పాటించడం వాజిబ్ **(తప్పనిసరి)** అవుతుంది.

27.4.2. సున్నతె ముఅక్కద

పవిత్రమైన రమజాన్ నెలలోని చివరి 10 రోజులలో ఆచరించే ఇత్‌తికాఫ్ సున్నతె ముఅక్కద అలల్ కిఫాయహ్ అనగా ఆ ఊరిలోని కొంతమంది ఆచరించిన అందరి తరఫున సరిపోతుంది. ఇది రమజాన్ నెల 20వ తేదీ సూర్యుడు అస్తమించినప్పటినుండి ప్రారంభమగును. షవ్వాల్ మాసపు (రమజాన్ పండుగ) నెలవంకను చూసిన వెంటనే ముగియును. నెలవంక రమజాన్ నెల 29వ తేదీ అంతంలో కనిపించినా, 30వ తేది అంతములో కనిపించినను, షవ్వాల్ మాసపు నెలవంకను చూచిన వెంటనే ఇత్‌తికాఫ్ పూర్తి అవుతుంది.

27.4.3 ముస్తహబ్

పైన పేర్కొనబడిన వాజిబ్ మరియు సున్నతె ముఅక్కద కాక మిగిలిన అన్ని ఇత్‌తికాఫ్‌లు ముస్తహబ్‌గా పరిగణింపబడును. వీని కొరకు ప్రత్యేక సమయ నిర్ణయమేమియు లేదు. సంవత్సరములోని అన్ని రోజులలోను పాటించవచ్చును. **(దేనియాత్ 2 యం, స.74)**

**గమనిక**

వాజిబ్ ఇత్‌తికాఫ్ కొరకు ఉపవాసముండుట తప్పనిసరి. కావున కనీసము ఒకరోజైనా ఉండాలి. కొన్ని గంటలు లేక కేవలము రాత్రి ఇత్‌తికాఫ్ యొక్క మ్రొక్కుబడి చేయుట తగదు. **(దేనియాత్ 2 యం., స. 74)**

27.5 ఇత్‌తికాఫ్ కొరకు షరతులు

01. ముస్లిమ్ అయి యుండాలి.

02. హదసె అక్బర్ (జనాబత్, హైజ్ మరియు నిఫాస్‌ల వల్ల సంభవించే పెద్ద అశుద్ధత) నుండి పరిశుభ్రత పొంది యుండాలి.

03. మతిస్థిమితము గలవాడై (ప్రాజ్ఞుడై) ఉండాలి. **(తెలివిలేనివాడు, పిచ్చివాడు కారాదు)**

04. పురుషుల మస్‌జిద్‌లో ఇత్‌తికాఫ్ ఆచరించాలి.

05. ఇత్‌తికాఫ్ యొక్క సంకల్పము (నియ్యత్) చేయాలి. **(దీనియాత్ యం. స. 74)**

గమనిక

01. స్త్రీలు అపరిశుద్ధావస్థలో అనగా బహిష్టు అయినప్పుడు, టఫాస్ **(పురుటి రక్తస్రావము)** స్థితిలో ఇత్‌తికాఫ్ పాటించరాదు.

27.6 ఇత్‌తికాఫ్‌లో చేయదగిన పనులు

01. మల, మూత్ర విసర్జన కొరకు మసీదు నుండి బయటకు వెళ్ళుట.

02. ఫర్జ్ గుస్ల్ కొరకు మసీదు నుండి బయటకు వెళ్ళుట.

03. అజాన్ పలుకువారు లేనియెడల అజాన్ పలుకు స్థలమునకు మసీదు నుండి బయటకు వెళ్ళుట.

04. జాముఅ ఖుత్‌బా పూర్వము నాలుగు రకఅత్‌లు సున్నత్ నమాజ్ చదువుటకు సరిపడే సమయము మాత్రమే ఉండేట్లు జుముఆ నమాజ్ కొరకు జామిఅ మసీదుకు వెదలుట.

05. మసీదులో తినుట, త్రాగుట, నిద్రించుట.

06. కుటుంబ లేక వ్యాపార సంబంధమైన అత్యవసర విషయాలు మాత్రమే మాట్లాడుట.

07. ఆహార పానీయాలు తెచ్చి ఇచ్చువారు లేనిచో, వాటి కొరకు వెళుృట కూడ తగును. (దీనియాత్7 యం స.75)

27.7 ఇత్‌తికాఫ్‌లో అవాంఛనీయ (మక్రూ) విషయాలు

మౌనమును ఆరాధనగా భావించి, మౌనముగా యుండుట, కొట్లాడుట, పోట్లాడుట, అనవసరపు మాటలు మాట్లాడుట. (దీనియాత్ 2 యం, స. 75)

27.8 ఇత్‌తికాఫ్‌లో అభిలషణీయ కార్యాలు

01. జామిఅ మస్‌జిద్‌లో ఇత్‌తికాఫ్ ఆచరించుట.

02. ఆరాధనలు, ఖుర్‌ఆన్ పఠనము, జిక్ర్ (అల్లాహ్ నామస్మరణము) చేయుట, మరియు దరూదె షరీఫ్ పఠించుటలో నిమగ్నలగుట.

03. పాపాల క్షమాభిక్ష కొరకు అల్లాహ్‌ను అధికముగా వేడుకొనుట.

04. ధార్మిక పుస్తకములు చదువుట, ప్రవక్తలు, సహాబాల, నలియా అల్లాహ్‌ల వృత్తాంతములు చదువుట.

04. ఉపన్యాసములిచ్చుట, హితబోధ చేయుట మొదలగునవి (దీనియాత్ 2 యం, స. 75)

27.9 ఇత్‌తికాఫ్‌ను భంగపరిచే విషయాలు

01. అనుమతింపబడిన కారణము లేకుండా కావాలని కాని మరచిపోయి కాని మసీదు నుండి బయటకు వెళ్ళుట లేక ఎవరైనా బలవంతముగా మసీదు నుండిగెంటివేయుట.

02. భయముచేత గాని లేక వ్యాధి కారణంగా కానీ మసీదు నుండి బయటకు వెళ్ళుట.

03. ఇత్‌తికాఫ్ స్థితిలో సంభోగము చేయుట.

04. అనుమతింపబడిన కారణముతో బయటకు వెళ్ళినప్పటికి, అవసరము కన్నను ఎక్కువ సమయము బయట గడుపుట. ఉదా : మల మూత్ర విసర్జనకు బయటకు వెళ్ళి ఆ కార్యము పూర్తి చేసుకొన్న వెంటనే తిరిగిరాక ఎవరితోనైనా మాట్లాడుట గడపడం. తిరిగి రాక ఎవరితోనై మాట్లాడుతూ గడపడం.

**సిద్ధాంతము :** పుజూ ఉన్నప్పటికీ తాజా పుజూ చేయుటకు వెళ్ళినను, గుస్ల్ వాజిబ్ కాకున్నను గుస్ల్ చేయుటకు వెళ్ళినను ఇత్‌తికాఫ్ భంగమగును.

**హెచ్చరిక :** వాజిల్ ఇత్‌తికాఫ్ భంగమైన యెడల, ఎన్ని రోజుల ఇత్‌తికాఫ్ సంకల్ప ముండినదో, అన్ని రోజుల ఖజా ఇత్‌తికాఫ్ ఆచరించడం వాజిబ్ (తప్పనిసరి) అగును. కాని సున్నత్ ఇత్‌తికాఫ్ భంగమైన యెడల, కేవలము భంగమైన రోజు ఇత్‌తికాఫ్ మాత్రమే ఖజా ఆచరించుట వాజిబ్ (తప్పనిసరి) అగును. **(బిహిష్తీకేవర్ 3/21, దీనియాజ 2 యం. స. 75)**

# 'పుష్కరాల ప్రాశస్త్యం'



కృష్ణవేణి నదికి 2016 ఆగష్టు 12 నుండి 23 వరకు పవిత్ర కృష్ణాపుష్కరాలు వేడుకను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధములైన చర్యలను చేపట్టడం జరుగుతోంది. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు భద్రతతో కూడిన సదుపాయాలకు ఆధిక ప్రాధాన్యత ఇస్తూ మహాఘాట్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతోంది. ప్రకాశం బ్యారేజి ఎగువున దుర్గగుడి, ఇంద్రకీలాద్రి ప్రాంతంలోని దుర్గాఘాట్ నుండి పున్నమి ఘాట్ వరకు మహాఘాట్ నిర్మాణాన్ని ప్రతిపాదించి చురుగ్గా ఏర్పాట్లు చేయడం జరుగుతోంది. ఈ నిర్మాణాలలో భాగంగా పుష్కరఘాట్లను ఆనుకుని 'వాకింగ్ ట్రాక్' నిర్మాణాలు చేపట్టడం ప్రత్యేకతను సంతరించుకోవడం జరుగుతోంది. పుష్కరం అంటే 12 సంవత్సరాలు అని అర్థం.

**రాజధాని, ప్రతినిధి - విజయవాడ :** భారత కాలమానం ప్రకారం భారతదేశంలోని 12 ముఖ్యమైన నదులకు పుష్కరాలు బృహస్పతి ఆయా రాశులలో ప్రవేశించిన సమయంలో పుష్కరాలు వస్తాయి. బృహస్పతి ఆయా నదుల రాశిలలో ఉన్నంత కాలం ఆ నదిలో పుష్కరాలు ఉన్నట్లే లెక్క. ఒక సంవత్సరం కాలంపాటు బృహస్పతి ఆయా రాశులలో ఉండడం జరుగుతుంది. ఆ సందర్భాల్లో ప్రవేశించిన మొదటి 12 రోజులు ఆది పుష్కరాలు, సంవత్సరాంతంలోని చివరి 12 రోజులు అంత్య పుష్కరాలుగా పిలవడం జరుగుతుంది. మొదటి, చివరి 12 రోజులు ఎంతో ప్రత్యేకమైన రోజులుగా పరిగణించడం జరుగుతుంది. పుష్కర అనే శబ్దానికి నీరు, వరుణుని కుమారుడు వంటి అనేక అర్థాలు ఉన్నాయి. పుష్కరాల ముఖ్య ఉద్దేశ్యం నది పర్యావరణ సంరక్షణ , పరిశుభ్రతను తెలుసుకునేందుకే పుష్కరాలను ఆచరించాలనే సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం జరిగిందని పెద్దలు పేర్కొన్నారు. నదీ తీరంలో ఎక్కడ మెరక ఉందో, ఎక్కడ పల్లం ఉందో, ఎక్కడ నదితీర ప్రాంతం కోతకు గురైందో, చెట్లు కొట్టివేసిన ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించేందుకు గాను పూర్వికులు ఇటువంటి సంప్రదాయాన్ని ప్రారంభించి నది పవిత్రతను కాపాడేందుకు ఆయా నదులలో పుణ్యస్నానాలు ఆచరించడం ద్వారా నీటి వనరుల ప్రాముఖ్యాన్ని చెప్పకనే చాటి చెప్పారు. హిందు సనాతన ధర్మంలో నదులకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చి పుజాదులు ఆచరించడం ద్వారా భవిష్యత్ తరాలకు జలాల ప్రాముఖ్యాన్ని తీసుకువెళ్ళడమే ధ్యేయంగా పుష్కరాలను నిర్వహించడం జరుగుతుంది.

**ఆయా నదులలో బృహస్పతి ప్రవేశించే రాశుల వివరాలు:**

గంగానదికి మేషరాశిలోను, నర్మదానదికి వృషభరాశి, సరస్వతీ నదికి మిధునరాశి, యమునానదికి కర్కాటరాశి, గోదావరి నదికి సింహరాశి, కృష్ణానదికి కన్యారాశి, కావేరి నదికి తులారాశి, భీమానదికి వృశ్చికరాశి, పుష్కరవాహిని/రాధ్యసాగనదికి ధనుర్‌రాశి, తుంగభద్ర నదికి మకరరాశి, సింధునదికి కుంభరాశి, ప్రాణహిత నదికి మీనరాశిలోను బృహస్పతి ప్రవేశకాలం నుండి పుష్కరాలను నిర్వహించుకోవడం జరుగుతుంది. గత ఏడాది జూలై 14 నుండి జూలై 25 వరకు గోదావరి పుష్కరాలు బృహస్పతి, సింహరాశిలో ప్రవేశించిన సమయంలో నిర్వహించుకోవడం జరిగింది. ఈ ఏడాది కృష్ణా పుష్కరాలను బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించే ఆగష్టు 12 నుంచి ఆగష్టు 23 వరకు 12 రోజుల పాటు ఆది పుష్కరాలను నిర్వహించుకోవడం జరుగుతుంది. ఇదే రోజు (ఆగష్టు 12 శుక్రవారం) హిందువులకు ఎంతో పవిత్రమైన వరలక్ష్మీ వ్రతం పండుగ రావడం యాథృచ్ఛికం.

**పుష్కరుని చరిత్ర:** పూర్వం తుందిలుడనే ధర్మాత్ముడు ధర్మబద్ధమైన జీవితం గడుపుతూ ఈశ్వరుని గురించి తప్పసు ఆచరించి ఈశ్వరుని ప్రసన్నంతో తందిలునితో ఏమి వరం కావాలో కోరుకోమని ఈశ్వరుడు వరం ఇచ్చాడు. తనకు శాశ్వతంగా ఈశ్వరునిలో స్థానం కావాలని వరం కోరుకున్నాడు. ఈశ్వరుడు సంతోషించి తమ అష్టమూర్తులలో ఒకటైన జలమూర్తిలో అతనికి శాశ్వతంగా స్థానం ఇచ్చాడు. ఇలా తుందిలుడు మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు అధిపతి అయ్యే వరాన్ని పొందాడు. తద్వారా సకల జీవరాశిని పోషించగలిగే శక్తి అతనికి లభించింది. పోషించే శక్తిని సంస్కృతంలో పుష్కరం అంటారు. అలా తందిలుడు పుష్కరుడైయ్యాడు. బ్రహ్మదేవునికి సృష్టి చేయవలసిన అవసరం ఏర్పడినప్పుడు జలంతో అవసరమేర్పడి జలంకోసం ఈశ్వరుని గురించి తపమాచరించి ఈశ్వరుని ప్రత్యక్షం చేసుకుని జల సామ్రాజ్యానికి చక్రవర్తి అయిన పుష్కరుని తనకు ఇవ్వవలసినదని కోరుకున్నాడు. ఈశ్వరుడు అందుకు అంగీకారం తెలుపగానే పుష్కరుడు బ్రహ్మదేవుని కమండలంలోకి ప్రవేశించాడు. బ్రహ్మకార్యం పూర్తి అయిన తరువాత ప్రాణులను బ్రతికించే ధర్మము నెరవేర్చుడానికి బృహస్పతి ప్రాణులకు జీవనాధారమైన జలంకావాలని బ్రహ్మదేవుని ప్రార్థించాడు. ఆ కోరికను బ్రహ్మదేవుడు మన్నించాడు. కానీ పుష్కరుడు తాను బ్రహ్మదేవుని వదలి వెళ్ళలేనని చెప్పాడు. అప్పుడు బృహస్పతి, బ్రహ్మ, పుష్కరులు కలసి ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఆ ఒప్పందం ప్రకారం గ్రహరూపంలో ఉన్న బృహస్పతి మేషం మొదలు పన్నెండు రాశులలో ప్రవేశించేటప్పుడు పన్నెండు రోజులు మిగిలిన కాలం సంవత్సరమంతా మధ్యాహ్నం సమయంలో రెండు ముహూర్తాల సమయం పుష్కరుడు బృహస్పతితో ఉండాలని నిర్ణయించాడు. ఆ సమయంలో సమస్త దేవతలు బృహస్పతి ఆధిపతిగా ఉన్న నదికి పుష్కరునితో వస్తారు కనుక పుష్కర కాలంలో నదీ స్నానం పుణ్యపధమని పురాణాలు చెప్తున్నాయి.

### కృష్ణాజిల్లాలో పుష్కరఘాట్లు 73:

కృష్ణాపుష్కరాలు సందర్భంలో కృష్ణానది పరివాహక ప్రాంతాలలో 73 పుష్కరఘాట్లను ప్రభుత్వం అనువైన ప్రాంతాలుగా గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. గుర్తించిన ఆయా ఘాట్లలో ఆయా ప్రాంతాలలో భక్తుల ప్రతిరోజు వచ్చే భక్తుల తాకిడి, గత పుష్కరాల సమయంలో వచ్చిన భక్తుల వివరాల అనుగుణంగా నూతనంగా చేపట్టిన ఘాట్లలో రానున్న భక్తుల అంచనాలతో కేటగిరిలుగా విభజించి అందుకు అనుగుణంగా పార్కింగ్, పుష్కర నగర్‌లు, వాహన సదుపాయాలను కల్పించడం జరుగుతుంది. ఎ+ ఘాట్‌లుగా గుర్తించిన ఘాట్లలో లక్ష మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు అచరిస్తారని అందుకు జిల్లాలో 4 ఘాట్లను గుర్తించారన్నారు. అదే విధంగా ఎ కేటగిరిలో 50 వేల నుండి లక్ష లోపు భక్తులు వచ్చే ఘాట్లు 4, అదే విధంగా బి కేటగిరిలో 10 వేల నుండి 50 వేల మంది భక్తులు వచ్చే ఘాట్లు 11, అదే విధంగా సి కేటగిరిలో వెయ్యి నుండి 10 వేల మంది భక్తులు వచ్చే ఘాట్లు 29, అదే



విధంగా లోకల్ ఘాట్‌ల కేటగిరిలో వెయ్యి మంది భక్తులు వచ్చే ఘాట్లు 25 ఉన్నాయి.

## పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో యోగ దినోత్సవం




**దేవసహాయం, రాజధాని ప్రతినిది, హనుమాన్‌జంక్షన్ :** యోగదిన్సోవం సందర్భంగా హనుమాన్ జంక్షన్ పోలీస్ సిబ్బంది వారు మంగళవారం ఉదయం హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ ఆవరణంలో యోగాను నిర్వహించారు. ఈకార్యక్రమానికి సి.ఐ జయకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి యోగ అనేది చాలా అవసరమని యోగా వలన మంచి ఆరోగ్యం పొందవచ్చని ఆయన అన్నారు. ఎస్సై బెజవాడ తులసీధర్ మాట్లాడుతూ ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ముందుగా శుభకాంక్షలు తెలియచేశారు. ఈకార్యక్రమములో యోగ గురువు రిటైర్డ్ టీచర్ డి వి రమణ, సీనియర్ జర్నలిస్ట్ తాడి రంగారావు, పోలీస్ స్టేషన్ రైటర్ వై ఆంజనేయులు,హెడ్ కానిస్టేబుల్ పొలిమెట్ల రత్నం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఉద్యోగుల పిల్లల ప్రవేశాలపై సానుకూలంగా స్పందించండి

– కలెక్టర్ బాబు ఎ

**రాజధాని ప్రతినిధి – విజయవాడ :** అమరావతి ప్రాంతానికి తరలివచ్చే ఉద్యోగుల పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలను కల్పించాలని, సానుకూలంగా స్పందించాలని కలెక్టర్ బాబు ఎ కోరారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం 13 సి.బి.యస్.ఇ పాఠశాలల నిర్వాహకులతో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ బాబు ఎ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ఆరంభంలో నూతన రాజధాని ప్రాంతమైన విజయవాడలో వివిధ పాఠశాలలో ప్రవేశాల కోసం ఎందరో ఆయా పాఠశాలలను సంప్రదించడం జరుగుతోందని, కొంత వెసులుబాటు ధోరణితో వారికి ప్రవేశాలు కల్పించాల్సిన అవశ్యకృత తప్పనిసరిగా మనపై ఉందని కలెక్టర్ తెలియజేశారు. ఈ ప్రాంతంలో పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించడం లేదనే మాట ప్రస్తావనకు వస్తుందని, అవసరమైతే అదనపు వసతులను కల్పించి తరగతులను నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒక సమన్వయకర్తగా జిల్లా యంత్రాంగం తరుపున ప్రభుత్వ నియమాలకు లోబడి అను



మతులను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన రాజధాని ప్రాంతంలో మరింత ఉన్నత ప్రమాణాలు గల పాఠశాలలు ఏర్పాటుపై దృష్టిసారించిందని, జూన్ 27 నాటికి పూర్తి స్థాయి అధికారిక కార్యకలాపాలు అమరావతి రాజధాని ప్రాంతం నుండే నిర్వహించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఇప్పటికే అందుకు అనుగుణంగా ఆయా శాఖలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు, ఇతర సిబ్బంది విజయవాడకు పరిసర ప్రాంతాలకు చెరుకోవడం జరుగుతుందన్నారు. వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో 6000 పైగా అధికారులు సంబంధిత ఉద్యోగులు రావడం జరుగుతుందన్నారు. ఇప్పుడు రాజధాని ప్రాంతానికి తరలి వచ్చిన కుటుంబాలకు చెందిన పిల్లలకు మీ పాఠశాలలో ప్రవేశాలను కల్పించడంలో సహకరించాలని, కొందరూ నేరుగా ఆయా పాఠశాలలను సంప్రదించిన సంఘటనలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అవసరమైతే మీ పాఠశాల పరిధిలో ఆదనపు గదులు నిర్మాణాలను చేపట్టాలని, వీటి అనుమతులకు మున్సిపల్ కమీషనర్‌కు ధరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్ జి.వీరపాండియన్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ జి.సృజన, జిల్లా విద్యా శాఖాధికారి ఎ.సుబ్బారెడ్డి, డిప్యూటి డి.ఇ.వో రవికుమార్, ఎన్.ఎస్.ఎఫ్ పాఠశాల ప్రతినిధి లారెన్స్, నిర్మల స్కూల్–జి.బి.ఆంటోని, ఎకిన్‌సన్–బాలాపుష్పం, కె.కె.ఆర్ –జె. మంజుల, ఢిల్లీ పబ్లిక్ స్కూల్–సంజయ్ భాటియా, నలంద ప్రతినిది–బి.వెంకటేశ్వర్లు, కె.కె.ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ –ఎన్.పద్మకళ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల సాధనకు పాటు పడదాం

– మంత్రి పీతల సుజాత





**రాజధాని ప్రతినిధి – ఆచంట :** రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ భూగర్భ గనుల శాఖ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. సమ సమాజ స్థాపన, కుల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తి డా॥ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. మండల పరిధిలోని మార్టేరులోని రెడ్డి కళ్యాణ మండపంలో నందు నవ్యాంధ్ర ప్రదేశ్ యస్.సి/యస్.టి కమీషన్ చైర్మన్ కారెం శివాజీని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు అంది పుచ్చుకున్న కారెం శివాజీకి అణగారిన, బడులు, బలహీన వర్గాల ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. స్థానిక ఎం.ఎల్.ఏ పితాని సత్య నారాయణ మాట్లాడుతూ కారెం శివాజీ తన నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడం ఆనందదాయకమన్నారు. సన్మాన గ్రహీత కారెం శివాజీ మాట్లాడుతూ మార్టేరులో ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న దళితులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి వారి ఋణం తీర్చుకోవాలని మంత్రి ఎం.ఎల్.ఏ విజ్ఞప్తి చేశారు. దళితుల సమస్యల పట్ల రెవెన్యూ, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రుణ మంజూరులో బ్యాంకర్లు దళితులను ఇబ్బందులకు గురి చేస్తూ వడ్డీ వ్యాపారులను ప్రోత్సాహిస్తున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రంలో యస్.సి/యస్.టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీకి నోటిఫేకేషన్ జారీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యస్. నాగేశ్వరరావు, కారెం సింహాచలం,ఎ. సత్తిరాజు, యస్.జైపాల్, యమ్ పిపిలు కె.సరోజిని, పి.సురేఖ, సర్పంచ్‌లు కె.మహాలక్ష్మీ, కారెంసుజాత, యాదల ఆశాజ్యోతి, డి.సి.యమ్.యస్. ఉపాధ్యక్షురాలు ఎం. మరియమ్మ, ఇ.అనిత ప్రవీణ్ జెడ్‌పిటిసి బి.నాగేశ్వరరావు పలువురు అధికారులు, దళిత గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండు రాష్ట్రాల దొంగల ముఠా పట్టివేత




**దేవసహాయం, రా.వా, హనుమాన్‌జంక్షన్ :** వీరవల్లి ఎస్సై మురళీకృష్ణ, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జయకుమార్ రోబరీ దొంగలను పట్టుకున్నారు. డీఎస్పీ వి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 19,20 సం లు వయస్సు కల్గిన నలుగురు కుర్రాళ్ళు ఎ.పి 28 సిహెచ్ 1460 నెంబరు గల ఫోర్డ్ కారులో బొమ్ములూరులలో, కోమటగుంట చెరువు వద్ద వేరు వేరు వ్యక్తులను కారులో ఎక్కించుకొని వారిని కొట్టి బంగారం, నగదు,సెల్‌ఫోన్‌లు దొంగి లించారు. నేరస్తుల వివరాలు 1,చేబత్తిన అఖిల్(19) తండ్రిప్రభాకం కుమార్, 2షేక్ ఫయాజ్‌భాషా(19) తండ్రిమహబూబ్ సుభానీ, 3కళ్యాణం వికాస్(19) తండ్రి శ్రీరామ్,4 చాగంటి శ్రీకాంత్(20) తండ్రి(లేటు)రాజు ఈనలుగురు హైదరాబాద్ కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీకి చెందినవారు. వీరు హైదరాబాద్ వాస్తవ్యులు కె.పి.హెచ్. బి.పి.ఎస్ పరిధిలో టి.ఎస్ 009 వి.ఎ 4732 నెంబరు గల ఫోర్డ్ కారును దొంగిలించి దాని నెంబరు ఎ.పి28 సిహెచ్1460 నెంబరుగా మార్చి దొంగ తనాలు చేశారు. 1,రామోజీ ఫిలిం సిటీవద్ద, 2,కోదాడ వద్ద,3, తెలంగాణా భీమవరం ఆంధ్రికవరం వద్ద,4, మంగళగిరి వద్ద,5, విజయవాడ, కాకినాడ మధ్య,6, పెంటపాడు వద్ద,7,తెనాలి సమీపంలో, 8,గుంటూరు సమీపంలో, 9,హైదరాబాదు ఎల్.బి నగర్‌లో, 10, మంగళగిరి వంతెన వద్ద, 11,గుంటూరు సమీపంలో, 12, తుమ్మలపాలెం వద్ద,13,పోదిలి సమీపంలో,14, బొమ్ములూరు వద్ద, 15, హనుమాన్‌జంక్షన్ వద్ద,16, గన్నవరం ఎర్‌పోర్ట్ సమీపంలో, 17,తెనాలి బస్టాండ్ సమీపంలో, 18, గుంటూరు స్టేడియం వద్ద,19, గుంటూరు బిగ్ స్టోర్స్ సమీపంలో, 20,కాకాని వద్ద,వీరు కారులో తిరుగుచూ ప్రయాణించే వ్యక్తులను కారులో ఎక్కించుకుని వారిని కొట్టి గాయపరిచి వారివద్ద నుండి నగదు, బంగారం,సెల్‌ఫోన్స్ దోచు కోనుచూ నేరాలు చేస్తుండగా అంపాపురం ఆదిత్య వెంచర్ వద్ద సి.ఐ జయ కుమార్, వీరవల్లి ఎస్సై మురళీకృష్ణ, వారి సిబ్బంది ఎ.ఎస్.ఐ840,హెచ్. ఈ143,పి.సి 174, 1009, 1455, 1936, అను వారులు వాహనాన్ని తనిఖీ చేసి కారులో పారిపోతున్న నేరస్తులను పట్టుకున్నారు. వీరు 2లక్షల50వేలు వరకు డబ్బు దొంగతనం చేశారు. వీరివద్ద రికవరీ చేసినవి 2బంగారపు ఉంగరాలు,20 సెల్‌ఫోన్‌లు,ఫోర్డ్ కారు,నేరస్తులు నేరాలు చేయ్యటానికి ఉపయోగించినవి స్టీల్‌గిన్నె,కార్ జాకీ, ఇనుపకట్టర్ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వి శ్రీని వాసరావు తెలిపారు. సి.ఐ జయకుమార్‌ను, హనుమాన్ జంక్షన్ ఎస్సై తులసీధర్‌ను, వీరవల్లి ఎస్సై మురళి కృష్ణను వారి సిబ్బందిని అభినందించి వారి కష్టానికి రివార్డులను అందించారు.

# పుష్కరపనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవు

## కాంట్రాక్టర్లకు సీఎం చంద్రబాబు హెచ్చరిక



**రాజధానిప్రతినిధి – విజయవాడ :** పుష్కర పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిర్ణీత వ్యవధిలో పూర్తి చెయ్యాలని అలా కాని పక్షంలో తీవ్రమైన చర్యలు వుంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు తీవ్రంగా హెచ్చరించారు. విజయవాడ నగర పరిధిలో పుష్కర ఘాట్ల నిర్మాణం, 4 లైన్ల రోడ్ల పనులు , దుర్గగుడి పైన చేపడుతున్న విస్తరణ పనులను గురువారం ముఖ్యమంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పద్మావతి ఘాట్ వద్ద పాత్రికేయులతో మాట్లాడుతూ , పుష్కర పనుల సత్వర పూర్తి పై అధికారులు , ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని అన్నారు.

ఇక పై వారం వారం పుష్కర పనులను తనిఖీ చేస్తామన్నారు.

కృష్ణా పుష్కరాలలో అందరు భాగస్వాములై రాజధాని ఔన్నత్యాన్ని చాటేలా పుష్కర యాత్రికులకు అతిథ్యాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరు తమ ఇంటా అతిథుల్ని సత్కరించే రీతిలోనే పుష్కర యాత్రికులను ఆదరించాలని సూచించారు. గత గోదావరి పుష్కరాలు రాజమండ్రి వాసులు చూపిన రీతిలోనే పుష్కర యాత్రికులకు అతిథ్యం వెల్లి విరియాలని ముఖ్యమంత్రి ఆకాక్షించారు. పుష్కరాలకు సంబంధించి చేపట్టిన అన్ని పనులు శాశ్వత ప్రాతిపదకన విజయవాడ నగరాన్ని శోభాయ మానంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించినవని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వారధి నుంచి కనకదుర్గమ్మ గుడి ఆ పైన పవిత్ర సంగమం వరకు నది తీరాన్ని సుందరీకరిస్తున్నామన్నారు. విజయవాడ నగరం గుండా వెళ్లే 3 కాలువల ను ఆహ్లాదంగా నగర వాసులు సాయం వేళల్లో సేద తీరేందుకు అనువుగా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బస్ కాంప్లెక్స్ ప్రాంతం, రైల్వే ట్రాక్ పరిసరాలు సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. ఇందువల్ల ఎవరికి నష్టం రాకుండా అవసరమైన పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా వుందన్నారు. విజయవాడ నగరం రాజధాని ప్రాంతానికి చెందిన అతి ముఖ్యమైనదని దీన్నే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు 3 వేల కోట్ల కు పై నే ఖర్చుతో వివిధ పనులు చేపడుతున్నామన్నారు.

**ఇంద్రకీలాద్రి పై పనుల పరిశీలన :** ఇంద్రకీలాద్రి పై గతంలో ఉన్న అన్ని నిర్మాణాలను తొలగించి భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమన్వయం చేయాల్సిందిగా స్థానిక పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) కి సూచించారు. కొండ మీద చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ జరిపేందుకు సంబంధిత వ్యక్తులతో సంప్రదించి సత్వరం ఆ పనులను చేపట్టాలని ఇవో ను ఆదేశించారు. ఈ సందర్భంలో మహా మండపానికి దారి తీసే మా ర్గాలను పరిశీలించారు. "హిల్ వ్యూ" ప్రాంతం నుండి ప్రకాశం బ్యారేజిని, అమరావతి రాజధాని ప్రాంతాలను వీక్షించేందుకు వీలుగా పనులు చేపట్టాలన్నారు. మొత్తంగా పర్యాటక ప్రాంతంగా ఈ పరిసరాలను తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, మేయర్ కోనేరు శ్రీధర్ పార్లమెంటు సభ్యులు కేశినేని నాని, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, జిల్లా కలెక్టరు బాబు.ఎ , ఆర్‌టిసి ఎండి ఎన్. సాంబశివరావు , నగర పోలీసు కమీషనర్ గౌతమ్ సవాంగ్, మున్సిపల్ కమీషనర్ జి.వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్ గంధం చంద్రుడు , సబ్ కలెక్టర్ జి. సృజన, ఇవో చంద్రశేఖర్ అజాద్ ఇరిగేషన్ అధికారులు, దుర్గగుడి పాల్గొన్నారు.

## మెట్ల దారిలో షెల్టర్ల ఏర్పాటు

**రాజధాని ప్రతినిధి – అన్నవరం :** రత్నగిరి మెట్ల దారిలో మలుపులు వద్ద శాశ్వతంగా షెల్టర్లు నిర్మించాలని అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశంలో నిర్ణయించారు. వర్షాకాలంలో మెట్లదారిన వచ్చి భక్తుల వర్షం వచ్చిన తడవకుండా మధ్యలో మూడుచోట్ల షెల్టర్లు నిర్మించాలని నిర్ణయించారు. స్వామి వారి నిత్య కళ్యాణంలో అమలువుతున్న రూ.550 టిక్కెట్‌పై భక్తులు పట్టువస్త్రాలు సమర్పించే పద్ధతిపై వస్తున్న ఆదాయం, వ్రత పురోహితులకు వెయింటింగ్ హాలు ఏర్పాటు, సొంతంగా ఏర్పాటు చేయనున్న కొబ్బరి కాయలు, అరటిపళ్ల దుకాణం కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

## అన్నవరం దేవస్థానం ఉద్యోగుల బదిలీ

**రాజధాని ప్రతినిధి – అన్నవరం :** దేవదాయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా అన్నవరం దేవస్థానానికి చెందిన 25 మందికి ఇతర దేవస్థానంకు బదిలీ చేశారు. గురువారం ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. సుమారు పదేళ్ల తరువాత ఈ తరహాలో భారీగా బదిలీలు కావడం తీవ్రసంచలనం రేకిత్తించాయి. దేవస్థానంలో ఈఈ, ఏఈఓ స్థాయి అధికారులు మొదలుకొని జూనియర్ అసిస్టెంట్‌ల వరకు బదిలీ చేశారు. వీరిని మరో రెండు రోజుల్లో రిలీజ్ చేస్తామని ఈ ఓ. కె. నాగేశ్వరరావు తెలిపారు.

## అమరావతిలో బ్రిటన్ ఆస్పత్రికి అనుమతి

**రాజధాని ప్రతినిధి – విజయవాడ :** అమరావతిలో బ్రిటన్ సహకారంతో ఏర్పాటుచేయనున్న హాస్పిటల్ ప్రాజెక్టుకు త్వరలో అనుమతులిస్తామని సీఎం తెలిపారు. భారత్‌లో బ్రిటిష్ హైకమిషనర్ డొమినిక్ అస్క్విత్ బృందం గురువారం సీఎంతో సమావేశమైంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రపంచంలోని 10 ఉత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని చెప్పారు.

అమరావతిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాధ్యాలపై బ్రిటన్ హైకమిషనర్ సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, పట్టణ రవాణా రంగం ప్లానింగ్‌కు బ్రిటన్ సంపూర్ణ సహకారం అందిస్తున్నదని డొమినిక్ అస్క్విత్ హామీ ఇచ్చారు. అమరావతిలో పెట్టుబడుల పెట్టేలా బ్రిటన్ ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తామని వివరించారు. నైపుణ్య శిక్షణ, వైద్య సేవలు, ఐటీ, మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో ఏపీతో కలిసి పనిచేస్తామన్నారు. ఇదిలా ఉండగా ఎస్.ఆర్‌ఈ ఐ చైర్మన్ హేమంత్ కనోరియా, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ రాజీవ్ లాల్ వేర్వేరుగా సీఎంను మర్యాదపూర్వకంగా కలిసారు.

## సైకిల్‌పై అమరావతికి ..



**రాజధాని – విజయవాడ :** ఉద్యోగుల విభజలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఉద్యోగులు శాఖల వారీగా అమరావతి బయల్దేరుతున్నారు. సహకారం, వాణిజ్య, సమాచార శాఖకు చెందిన ఉద్యోగులు హైదరాబాద్ నుండి ప్రత్యేక బస్సుల్లో విజయవాడ బయల్దేరారు. వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న అధికారిణి పద్మ తన ప్రమాణాన్ని భిన్నంగా ఎంచుకున్నారు. ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపాలని అందరిలా కాకుండా సైకిల్‌పై అమరావతి బయల్దేరారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం నేతలు అశోక్‌బాబు, కృష్ణయ్య తదితరులు పద్మకు మద్దతు తెలిపారు. అనంతరం పద్మ సైకిల్ ప్రయాణాన్ని అశోక్‌బాబు జెండా వూపి ప్రారంభించారు.

# మంగపతిదేవిపేటలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



**అన్నంరెడ్డి సుబ్బారావు, రా.వా. ప్రతినిధి, కొయ్యలగూడెం :** మంగపతి దేవిపేటలో కొత్తగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మంజూరు అయి ప్రారంభం కావటంతో బాలబాలికలకు, తల్లిదండ్రులకు ఇబ్బందులు సమస్యలు పోయాయని అందరూ బడి ఈడు వచ్చిన పిల్లలను పాఠశాలలకు పంపి చదివించాలని పోలవరం ఎంఎల్ఎ మొడియంశ్రీనివాసరావు అన్నారు. గడచిన నాలుగు దశాబ్దాలుగా గ్రామంలో ఎయిడెడ్ పాఠశాల ఉన్నప్పటికీ అక్కడ సరైన విద్యాబోధన జరగకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పొరుగున ఉన్న బోడిగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించేవారని, ఇక నుంచి ఆ ఇబ్బంది లేదని ఆయన అన్నారు. ఈ నెల 21వ తేదీన ఆ గ్రామ్‌లో మంజూరైన మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలను స్థానిక బిసి కమ్యూనిటీ హాలు భవనంలో ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. సర్వశిక్షా అభియాన్ నిధులు మంజూరు చేయించి పాఠశాలకు సొంత భవనాన్ని త్వరలో నిర్మించడంతోపాటు అక్కడ పిల్లలకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చటం జరుగుతుందని, మధ్యాహ్న భోజనం సమకూర్చడానికి తగిన చర్యలను విద్యాశాఖ అధికారులు చేపడతారని ఎంఎల్ఎ తన ప్రసంగంలో తెలిపారు. మంగపతిదేవి పేటకు 3 సిసి రోడ్లు నిర్మాణానికి ఇప్పటికే 15 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఈరోజు దానికి అదనంగా ఆర్‌డిఎఫ్ నిధులు రూ. 20 లక్షలను మరికొన్ని సిసి రోడ్లు నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గ్రామసర్పంచ్ తెలే శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు, జడ్‌పి వైస్‌ఛైర్మన్ చింతల వెంకటరమణ, ఎంపిపి అయినపర్తి చందన శ్రీదేవి ప్రసంగించారు. ఎంపిపి అయినపర్తి చందనశ్రీదేవి ప్రసంగించారు. ఎంపిటిసి గంగాధర్ తన ప్రసంగంలో పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఎంఎల్ఎ శ్రీనివాసరావుకు ఎంపి మాగంటి బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యాలయ భవనం కూలిపోయినందున కొత్తగా పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఆయన కోరారు. ఎపి మహిళా సహకార ఆర్థిక సంస్థ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి, డివైఇవో తిరుమలదాసు, ఎంపిడివో ఎం రాజు, తహశీల్దారు సిహెచ్ మహేశ్వరి, ఎంఇవో సుబ్బారావు తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. అంతకుముందు గ్రామంలో రూ. 15 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులతో నిర్మించే 3 సిసి రోడ్లకు, మంచినీటి పైపులైను నిర్మాణం పనులకు ప్రజాప్రతినిధులతో కల్సి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. మానిక చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.



# అభివృద్ధిలో మహా-దేవపట్నం!

- ఎంపీ గోకరాజు దత్తత గ్రామంలో అభివృద్ధి పరవళ్లు
- ఎమ్మెల్యే శివ సహకారం, ప్రోత్సాహంతో అభివృద్ధి ప్రవాహం

**టి.హనుమంతరావు, రా.వా. ఉండి :** మండలంలో మేజర్ పంచాయితీల్లో ఒకటి మహదేవపట్నం గ్రామం. దీన్ని నర్సాపురం ఎంపి గోకరాజు గంగరాజు దత్తత తీసుకోవడం, దీనికి తగ్గట్టుగా ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు సహకారం, ప్రోత్సాహం అందించడం, తదనుగుణంగా పంచాయితీ, జన్మభూమి కమిటీ సభ్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈగ్రామంలో అభివృద్ధి పట్టణ స్థాయిని తలపిస్తుంది.పేరులోనే పట్నంగా ఉన్న ఈగ్రామం భీమవరం పట్టణానికి చేరువలో ఉండీ' అభివృద్ధి ప్రవాహం పరవళ్లు దొక్కు తోంది! ఈగ్రామం గత జనరల్ ఎన్నికల ఫలితాల్లో మిత్రపక్షాలైన తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలకు కంచుకోటగా నిలిచింది. దీంతో ఎంపి, ఎమ్మెల్యేలు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కంకణ బద్ధులయ్యారు. ఈయజ్ఞంలో మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు భుజం, భుజం కలిపి ముందుకు సాగుతున్నారు. ఈఆత్మీయ కలయికలో ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా బేషాలకు పోకుండా వీరందరూ అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు. స్వచ్ఛ భారత్‌లో కార్యక్రమంలో 390 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు కాగా, నేటి వరకు వీటిలో 305 పూర్తి అయ్యాయి. పంటకాలువపై గ్రామ కూడలి వద్ద ఒకటి, గ్రామ శివారున మరొక కల్వర్టులను రూ35లక్షలతో నిర్మించారు. ఎంపి సోదరులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక వర్గ మాజీ సభ్యులు గోకరాజు రామరాజుకు ఈగ్రామంతో బంధుత్వ ఉండడంతో అభివృద్ధి పనులను ఆయన సర్పంచ్ జుత్తిగ శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షిస్తున్నారు. ఈగ్రామంలో 13 సిమ్మెటు రోడ్లను సుమారు రూ84లక్షలతో నిర్మించారు. ఎమ్మెల్యే శివ సిఫార్సులతో మరో 2సీసీ రోడ్లను రూ 10లక్షల జడ్పీ గ్రాంటుతో నిర్మించారు. గ్రామ పంచాయితీ 13వ, 14వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ నిధులు రూ5సీసీ రోడ్లను సుమారు రూ20లక్షలతో నిర్మించారు. గ్రామంలో మహారాజు సౌధాన్ని తలపించేలా నిర్మితమైన హైస్కూలు ఉన్నా ప్రహరీ గోడ లేనందున 10వ తరగతి పరీక్షా కేంద్రంగా విద్యా శాఖాధికారులు అనమతించడం లేదు. దీంతో విద్యార్థులందరూ ఉండి పరీక్షా కేంద్రాలకు తరలివస్తున్నారు. గ్రామస్తుల కోరికపై ఎంపి గంగరాజు సిఫార్సులతో ఓఎన్‌జీసీ నిధులు రూ13లక్షలు, ఉండి ఎమ్మెల్యే శివ ఇచ్చిన రూ15లక్షల నిధులతో కాంపౌండు వాల్ నిర్మాణం పూర్తి చేసారు. 214 జాతీయ రహదారి నుంచి గ్రామంలోని మహంకాళమ్మ వారి దేవస్థానం వరకు రూ2కోట్ల నాబార్డు నిధులతో ఎంపి గంగరాజు రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే శివతో కలిసి శంకుస్థాపన చేసారు. భవిష్యత్తులో పబ్లిక్ ట్యాప్‌ల పనిలేకుండా చేసి వాటిని తొలగించాలన్న లక్ష్యంతో పంచాయితీ ముందుకు సాగుతోంది. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మండపాక నరసింహమూర్తి, ఎంపిటిసీలు వనిమా కనక వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, గంధం శ్రీనివాస్(బుజ్జి), పాలక వర్గ సభ్యులు, కార్యదర్శి జిహెచ్ నాగేశ్వరరావు, జన్మభూమి కమిటీ సభ్యులు, ఎంపి వ్యక్తిగత సహాయకులు వేగేశ్న సూర్యనారాయణరాజు, దాతలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ప్రధాన పాత్ర వహిస్తున్నారు.



మహదేవపట్నంలో రక్షిత మంచి నీటి పథకంలో నూతన ఫిల్టర్‌బెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గంగరాజు, ఎమ్మెల్యే శివ



మహదేవపట్నంలో మహిళల శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపి గంగరాజు, చిత్రంలో ఎమ్మెల్యేశివ తదితరులు.

### మహదేవపట్నం గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా!

– నర్సాపురం ఎంపి గోకరాజు గంగరాజు

ప్రధాన మంత్రి మోడీ పిలుపు మేరకు దత్తత తీసుకున్న మహదేవపట్నం గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని నర్సాపురం ఎంపి గోకరాజు గంగరాజు అన్నారు. మహదేవపట్నం గ్రామంలో 214 జాతీయ రహదారి నుంచి గ్రామంలోని కూడలి వరకు రహదారి నుంచి గ్రామంలోని శ్రీమహంకాళమ్మ వారి గుడి వరకు సుమారు రూ.2కోట్లతో నిర్మించనున్న 2కి.మీ. మేర ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపి గంగరాజు స్థానిక ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజుతో కలిసి శంకుస్థాపన చేసారు. అనంతరం సర్పంచ్ జుత్తిగ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపి మాట్లాడుతూ గ్రామాన్ని దత్తత తీసుకున్న వెంటనే కుటుంబ, గ్రామావసరాలపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించానన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ అండ్‌బి ఎస్‌ఈ శ్రీమన్నారాయణ, డిఈ మహదేవ్, ఎంపిడివో లక్ష్మి, ఎంపిటిసీలు కనక వెంకట సుబ్బలక్ష్మి, గంధం బుజ్జ, ఉప సర్పంచ్ ఎం నరసింహమూర్తి, ఎంపిపి లక్ష్మి, తహసిల్దారు దుర్గాకిశోర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వేగేశ్న అనంతలక్ష్మి, తెలుగు మహిళ అధ్యక్షురాలు సుజాత, గ్రామపెద్దలు, శ్రీనివాసరాజు, సుబ్బరాజు, నాగరాజు, వనిమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విజయవాడలో పుష్కర పనుల పరిశీలన



**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** పుష్కరయాత్రికుల రద్దీని తట్టుకుని ఎక్కువ మంది యాత్రికులు పుష్కరస్నానాలు అచరించే విధంగా దుర్గాఘాట్‌ను విస్తరిస్తూ డిజైన్‌లో రూపొందించిన విధంగా నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ బాబు ఎ ఇంజనీర్లను ఆదేశించారు. ఇదే విధంగా ఆదివారం సాయంత్రం విజయవాడ నగరంలో పుష్కర పనుల ప్రగతిని క్షేత్రస్థాయిలో ఆయన డిజైన్‌లలో సూచించిన విధంగా మాత్రమే నిర్మాణాలను చేపడుతున్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా దుర్గాఘాట్‌లో 'షీట్‌పైల్ ఫౌండేషన్' పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. పనులకు సంబంధించిన మెటీరియల్ పూర్తిస్థాయిలో మెప్పించి సైట్ వద్ద సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దుర్గాఘాట్ ఒవర్ దిగువ మూడు వరసల రహదారి పనులు జాప్యం కావడం పట్ల కలెక్టర్ బాబు ఎ అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం కావడం, వర్షాలు పడుతుండడం జాప్యానికి కారణం అన్న అధికారుల వివరణతో కలెక్టర్ విభేదించారు. గత వారం రోజులుగా పనిలో పురోగతి లేని సంగతి తాము గమనించామని, పనులను వేగవంతం చేయాలని, అనుకున్న సమయానికి రహదారిని పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు భిన్నంగా ఏమాత్రం రహదారి నిర్మాణంలో అలస్యం జరిగినా తీవ్రమైన పరిణామాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట రహదారులు, భవనాల సూపరింటెండెంట్ ఇంజనీర్ మోషే తదితరులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛ భారత్'కు ప్రతి ఒక్కరు నడుం బిగించాలి



**తాడేపల్లిగూడెం :** సరస్వతీ నిలయాలైన పాఠశాలన్ను పరిశుభ్రంగా తీర్చి దిద్దాలని దేవదాయ శాఖ రాష్ట్రమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. స్థానిక సంజీవనగర్ 12 వ వార్డులో ఆదివారం ఉదయం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలో ప్రతి ఒక్కరు నడుం బిగించాలని మంత్రి పిలుపునిచ్చారు. పరిసరాలు పరిశు భ్రంగా ఉన్నపుడే విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో మంచి చదువు, చదువు కోగలరని ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో చెప్పారు. అపరిశు భ్రమైన పరిసరాలు అనారోగ్యానికి దారితీస్తాయని, ఈ కారణంగా వేలాది రూపాయలు వైద్యానికే ప్రజలు వెచ్చిస్తున్నారన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చెప్పారు.

# దేశాభివృద్ధికి రైల్వే వ్యవస్థ దోహదం

– సీఎం చంద్రబాబు



**రాజధాని ప్రతినిధి - విజయవాడ:** దేశ, రాష్ట్రాభివృద్ధికి రైల్వే వ్యవస్థ దోహదం చేస్తున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రైల్వే వ్యవస్థ చవకైన రవాణా వ్యవస్థ ఉంటేనే ప్రపంచ మార్కెట్‌లో పోటీకి నిలవ గలుగుతామని ఆయన అన్నారు. స్థానిక రైల్వే ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం రిమోట్ వీడియో లైవ్ ద్వారా విజయవాడ-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం, గుంతకల్, కల్లూరు రైల్వే డబ్లింగ్ పనులకు శంకుస్థాపన నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైల్వే అతి పెద్దదైన మౌలిక సదుపాయాల కల్పన చేయగల వ్యవస్థ అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన పార్ల మెంట్ సభ్యుడు రైల్వేశాఖను సురేష్ ప్రభు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. రైల్వేశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా రాష్ట్రంలోని 22 రైల్వేస్టేషన్లను, రైల్వేలైన్లను ఆధునీ కరిం చేందుకు ఒప్పందం జరిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో సుమారు రూ.1000 కోట్లు పెట్టు బడితో కృష్ణపట్నం, విశాఖపట్నం, కాకినాడలలో 'మల్టిమోడల్ లాజిస్టిక్ పార్కు'ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 924 కిలో మీటర్ల తీరప్రాంతంలో ఉన్న ఓడరేవులను (పోర్టులను) ఇతర ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా పెద్ద ఎత్తున రవాణా సౌకర్యం, తద్వారా వాణిజ్యం పెరుగుతుందని అన్నారు. అమరావతి రాజధానిని హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నైలతో అనుసంధానించడం అత్యంత అవసరమని, దీనిపై దృష్టిసారించాలని ముఖ్య మంత్రి, రైల్వేశాఖ మంత్రి శ్రీ సురేష్‌ప్రభును కోరారు. ప్రస్తుతం విజయవాడ- సికింద్రాబాద్‌ల మధ్య నూతనంగా నడుపుతున్న ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ కాలాన్ని 4 గంటలకు కుదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో ఏర్పాటవుతున్న 3 రైల్వే కారిడార్లలో చెన్నై, విజయవాడ, కాజీపేట, నాగపూర్ మీదుగా ఢిల్లీ కారిడార్, విజయవాడ, విశాఖ మీదుగా ఖరగ్‌పూర్ రైల్వే కారిడార్‌లు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్ళడం శుభపరిణామమన్నారు. ఇందువల్ల విస్తృతమైన మౌలిక సదుపాయాల ఏర్పాటై వాణిజ్యం, పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని 'లాజిస్టిక్ రంగం'లో కీలకపాత్ర పోషించనుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విశాఖ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. కృష్ణాపుష్కరాలకు సంబంధించి 600 ప్రత్యేక రైళ్ళను నడిపేందుకు అంగీకరించిన రైల్వేశాఖకు ముఖ్య మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదీ

**రాజధాని ప్రతినిధి - ఏలూరు :** మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా రవాణా శాఖ అధికారి సుబ్బారావు చెప్పారు. విజన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం ఔషధగుణాలు కలిగిన వేప, నేరేడు, ఉసిరి, తదితర 20 మొక్కలను ఎమ్మెల్సీ రాము సూర్యారావుతో కలిసి సుబ్బారావు నాటారు. సమాజంలో ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో వాయుకాలుష్యం పెరిగిపోతుందని రోజు రోజుకు వాహనాల సంఖ్య అధికం కావడంతో ఈ కాలుష్యంబారిన పడి అనేక మంది రోగాలపాలవుతున్నారని సుబ్బారావు చెప్పారు.

వాయుకాలుష్యాన్ని నిరోధించడానికి మొక్కల పెంపకం ఎంతో అవసరమని వాహనాలు వెదజల్లే పొగవలన ఎంతో మంది ఊపిరితిత్తుల వ్యాధులకు గురి అవుతున్నారని సమాజంలో పరిశుభ్రమైన గాలిని అందించడానికి మొక్కల పెంపకం ఎంతో అవసరమని సుబ్బారావు తెలిపారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిని పచ్చని మొక్కలతో అడుగడుగునా ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు స్వచ్ఛంధ సంస్థల మొక్కల సంరక్షణకు ముందుకు రావాలని జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రాము సూర్యారావు పిలుపునకు స్పందించి రవాణాశాఖ ఈ మొక్కల రక్షణకు చర్యలు తీసుకుంటుందని సుబ్బారావు చెప్పారు. మొక్కలు నాటడం గొప్ప కాదని నాటిన మొక్క వృక్షంలా మారేలా ప్రతీ ఒక్కరూ శ్రద్ధ వహించాలని అప్పుడే అరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. శాసనపమండలి సభ్యులు రాము సూర్యారావు మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిత్యం 500 మంది రోగులకు వైద్య సేవలు అందుతున్నాయని 450పడకల స్థాయికి ఆసుపత్రి తీర్చి దిద్దబడిందని ఇటువంటి స్థితిలో పచ్చని వాతావరణంలో ఆసుపత్రి ప్రాంగణం ఉండాలని ఆయన చెప్పారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రి రిటైర్డు సూపరిటెండెంట్ డా.రావిగోపాకృష్ణయ్య మాట్లాడుతూ మాటలకన్నా చేతల్లోనే మొక్కల సంరక్షణ కలిగించాలని ప్రతీ మనిషి తన పరిధిలో రెండు మొక్కలు పెంచేందుకు ముందుకు రావాలని దానివలన జిల్లాలో ఏటా 80 లక్షల మొక్కలు నాటి సంరక్షణ జరిగితే జిల్లా హరితవనాలతో ఆరోగ్యజిల్లాగా పశ్చిమ తీర్చిదిద్దబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రేక్ ఇన్స్‌పెక్టర్ విజయరాజు, హరికుమార్, వీరయ్య, యల్.వెంకటేశ్వరరావు, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో కృష్ణా పుష్కరాలు విజయవంతం

– కేంద్ర రైల్వే మంత్రి సురేష్ ప్రభు



**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** కృష్ణా పుష్కరాలను సమర్థ వంతంగా నిర్వహించేందుకు రైల్వే శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య సమ న్వయం అవసరమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుతో మంత్రి సోమవారము రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సురేష్ ప్రభు మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణ కోసం రైల్వేశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తే సముచితంగా ఉంటుందని ఆయన అన్నారు. పుష్కరాలకు సంబంధించిన కీలక పనులను 15 జులై నాటికి పూర్తి చేయాలని రైల్వే అధికారులను మంత్రి ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లో రైల్వే శాఖ, ఏపీ ప్రభుత్వంకు చెందిన అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

ప్రయాణీకులు రద్దీ ఎక్కువైనపుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తుకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.కృష్ణా పుష్కరాల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన కేంద్ర మంత్రికి వివరించారు.భద్రతా ఏర్పాట్ల కోసం 2 వేల కెమెరాలను రైల్వే, ఏపీ ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.నదిలో స్నానమాచరించే భక్తులకు అసౌకర్యం లేకుండా ఉండేందుకు 20 వేల మంది క్లీనింగ్ స్టాఫ్‌ను విధుల్లో ఉంచుతున్నట్లు చెప్పారు. పుష్కర ఘాట్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులకు అసౌకర్యం కలుగకుండా 600 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక యాత్రికులు రైల్వే టికెట్లను కౌంటర్ల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా పుష్కర్ నగరాల్లో రైల్వే కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

## పురపాలక సంఘాలు పనితీరు మెరుగుపరుచుకోవాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు

**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** ప్రజలు సంతృప్తి స్థాయి పెరిగేలా పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు పనితీరును మెరుగు పరచు కోవాలని ముఖ్యమంత్రి కోరారు. క్యాంప్ కార్యాలయంలో ఆయన పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలపై సమీక్షా సమావేశం నిర్వ హించారు. పట్టణాలు, నగరాల్లో నివసించేవారు పారిశుధ్యం మెరుగ్గా ఉండి, నిరంతరం మంచినీటి సరఫరా చేస్తే చాలని భావిస్తుంటారన్నారు. కేంద్ర ప్రభుత్వ 'అమృత్' పథకంలో రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలే మారిపోతాయన్నారు. సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 43 లక్షల మందికి పెన్షన్లు అందిస్తూ రూ.500 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు, ఫైబర్ ఆప్టిక్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ అంది స్తున్నట్లు వివరించారు. పౌర సేవలను ఆన్‌లైన్ చేయడం వల్ల ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా చేశామన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా పట్టణ యవతకు ఉపాధి అవ కాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణతో ట్రాఫిక్, శాంతి భద్రతల నిర్వహణ మెరుగైనందన్నారు. ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధునిక సాంకేతికతను వినియోగం చేసుకున్నట్లు చంద్రబాబు వివరించారు. ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు యనమల రామకృష్ణుడు, పి.నారాయణ, కామినేని శ్రీనివాస్, మల రామకృష్ణుడు, పి. నారాయణ, కామనేని శ్రీనివాస్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ముఖ్య మంత్రి కార్యదర్శి సాయిప్రసాద్, అదనపు కార్యదర్శి ఏవీ రాజమౌళి, ఐటీ కార్యదర్శి ప్రద్యుమ్న, వివిధ పుర పాలక సంఘాలు, నగరపాలక సంస్థల అధికారులు పాల్గొన్నారు. ఆయా డెయిరీల నిర్వాహకులు అంగీ కరించారు. సహకార సంఘాలు కొను గోలు చేయగా మిగిలిన 20 వేల లీటర్ల ఆవు పాలను అంగన్‌వాడీ విద్యా కేంద్రాలకు అందచేస్తామని సమాఖ్య ఎండీ మురళీ ముఖ్య మంత్రికి తెలిపారు. కాగా తెలంగాణ ప్రభుత్వం నుండి రాష్ట్ర రైతులకు రావలసిన రూ.25 కోట్ల బకాయిల్ని వసూలు చేసేం దుకు చొరవ చూపాలన్నారు.

# 'పప్పు'లు... నిప్పులు



**పప్పుల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకాయి. మధ్య తరగతి వారి ఇళ్లలో సైతం కందిపప్పు ఉడకనంటోంది. వ్యాపారులు ఇష్టానుసారం నిల్వచేసి ధరలు పెంచేస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో జనం అల్లాడిపోతున్నారు.**

**రాజధాని ప్రతినిధి - గుంటూరు :** రెండు మాసాలుగా జిల్లాలో పప్పుల ధరలు పెరిగిపో తున్నాయి. జిల్లా కేంద్రంలో పేరున్న మార్కెట్లలో వివిధ బ్రాండ్ల పేరుతో కందిపప్పు కిలో రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. మినపప్పు హోల్‌సేల్‌లో కిలోరూ.130 ఉంటే రిటైల్ మార్కెట్‌లో రూ.180 నుంచి రూ.190 వరకు పలుకుతోంది. గల్లీ దుకాణాల్లోనైతే రూ.200 వరకు అమ్ముతున్నారు. పెసర పప్పు హోల్‌సేల్‌లో రూ.120 ఉంటే రిటైల్‌లో రూ.160గా ఉంది. కిరాణా దుకాణాల్లో రూ.170 అమ్ముతున్నారు. వేరుశనగ గుండ్లు రూ.104 హోల్‌సేల్‌లో ఉంటే రిటైల్‌గా రూ.130కి ఇస్తు న్నారు. మామూలు కిరాణా దుకాణాల్లో రూ.140 చెబుతున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు పప్పు కూరలు వండుకునే పరిస్థితి లేదు.

**అధికారుల నిఘా కరువు..**

ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి అమ్ముతున్న వ్యాపారులపై అధికారుల నిఘా, నియంత్రణ కరువైంది. అనధి కార్య నిల్వలపై సైతం నిఘా యంత్రాంగం దృష్టి సారించడం లేదు. దీంతో బ్లాక్ మార్కెట్ ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది.

**రేషన్ దుకాణాల్లో అమ్మాలి...**

ప్రస్తుతం జిల్లాలోని రైతు బజార్లలో కందిపప్పు రూ.122 కు అమ్ముతున్నారు. ఇదే ధరకు అన్ని రేషన్ షాపుల్లోనూ కందిపప్పును కార్డుదారులకు అందిస్తే, బహిరంగ మార్కెట్‌లో ధర దిగివచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు.

# సీఎం దత్తత గ్రామంలో బడి లేదు !

## కలెక్టరేట్ ముందు విద్యార్థుల ధర్నా

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు దత్తత తీసుకున్న గ్రామంలో చదువు కునేందుకు పిల్లలకు బడిలేని పరిస్థితి నెలకొంది. బహుశా ఈ విషయం ముఖ్య మంత్రికి తెలుసోలేదో, అరకులోయలోని పెదల గూడు పంచాయితీ పరిధిలోని లిట్టిగూడ గ్రామాన్ని ముఖ్య మంత్రి దత్తత తీసుకున్నారు. గత అక్టో బరులో ముఖ్యమంత్రి ఈ గ్రామాన్ని దత్తత తీసు కుంటున్నట్టుగా ప్రకటించారు.

గ్రామాన్ని సాంకేతికపరంగానే కాకుండా అక్కడ పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం,జీవనభృతి, మీ సేవా కేంద్రం ఏర్పాటు ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, సౌరవిద్యుత్, నీటి నిల్వలు పెంపొదల, భూసార పరీక్ష, పచ్చదనం, ప్రతి కుటుంబానికి బ్యాంకు ఎకౌంట్లు ఏర్పాటుకు, ఉమ్మడి కృషి ద్వారా గ్రామ ప్రజలందరూ ఆనందంగా ఉండేందుకు కృషి చేస్తానని ముఖ్య మంత్రి వాగ్దానం చేశారు. మారు మూల గల ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవటం వెనుక సిఎంకు రహస్య ఎజెండా ఉందని రాజకీయ పరిశీలకులు ప్రత్యేకించి వామపక్షాల నాయకులు ఆరోపణలు చేశారు. పెదలగుడు పంచాయితీ పరిధిలో బాక్సైట్ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. బాక్సైట్ తవ్వకాలను గిరిజన ప్రజలు వ్యతిరే కిస్తున్నారు. బహుశా ఈ అంశాన్ని దృష్టిలో ఉంచు కునే ముఖ్య మంత్రి అమాయకులైన గిరిజనులను మంచి చేసుకునేందుకు లిట్టిగూడ గ్రామాన్ని దత్తత చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యా ర్థులు ఉన్నారు. అయితే, 20 మంది విద్యార్థులున్న పాఠశాలను మూసివేసి, ఆ సమీపంలోని పాం శాలలో ఆ విద్యార్థులను చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ముఖ్యమంత్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించిన వెంటనే గ్రామంలో ఉన్న పాఠశాలను కూడా మూసివేసి రెండు కిలోమీటర్ల దూరంలో కొండపై ఉన్న పాఠశాలకు చేరుకోవాలంటే చాలా కష్టమైన పని, పైగా ఏజెన్సీ ప్రాంతంలో నైరుతి రుతుపవనాలు ప్రారంభమైన తరువాత డిసెంబరు వరకు దాదాపు ఆరు నెలలపాటు వర్షాలు పడుతూనే ఉంటాయి. ఈ కాలంలో పాఠశాల ఉన్న రెండు కిలోమీటర్లు చేరుకోవాలంటే దారిలో ఉన్న చిన్నచిన్న కాల్వలు పొంగిపొర్లుతూ ఉంటాయి. వాటిని దాటటం చిన్నపిల్లలకు చాలా కాష్టమవుతుంది.

ఈ నేపథ్యంలో పిల్లలంతా తిరిగి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వానికి ఉన్నట్లయితే తక్షణం ఆ గ్రామంలో పాఠశాలను తిరిగి ఏర్పాటు చేసి గ్రామంలోని పిల్లలందరూ చదువుకునేందుకు ప్రోత్సహించాలి.

1970లలో ఈ ప్రాంతంలో నాలుగు శాతం మాత్రమే అక్షరాస్యత ఉండగా, 2011 నాటికి అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలల రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయటం వలన అది 40 శాతానికి పెరిగింది. ఈ సమస్యను జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారులు గుర్తించి పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## పదేళ్లలో ఆర్టీసీకి భవిష్యత్తు



**గన్నవరం :** రానున్న పదేల్ల కాలంలో ఆర్టీసీకి మంచి భవిష్యత్ ఉంటుందని, ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా కష్టపడి పనిచేస్తే సంస్థ లాభాలు బాట పట్టడం ఖాయమని ఆ సంస్థ ఎండీ ఎన్. సాంబశివరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ జోనల్ శిక్షణా అకాడమీలో సంస్థ లక్ష్యాలపై ఉద్యోగులు, మెకానికల్ సూపర్‌వైజర్లు, కార్మిక యూనియన్ నాయకులతో సదస్సు నిర్వహించారు. ఎండీ మాట్లాడుతూ సంస్థ మనుగడ సాధించాలంటే ముందుగా నష్టాలను అధిగమించాలని చెప్పారు. అందుకు గాను ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంస్థ లాభాలు పెంచేందుకు కొత్తగా పార్సిల్, కొరియర్ సర్వీసులను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా ప్రతి ఏడాది సంస్థకు రూ.300 కోట్లు ఇచ్చి ఆదుకుంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రేవేట్ బస్సులు బ్రహ్మండంగా నడుస్తున్నాయని, వీటికి ధీటుగా ఆర్టీసీ బస్సులను నడపాలని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయలు కల్పించేందుకు ప్రస్తుతం బస్‌స్టేషన్లను కూడా ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. త్వరలో బస్టాండ్లు, బస్సుల నిర్వాహణ, సంస్థ లక్ష్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన కూడా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ విభాగం ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ జయరావు, చీఫ్ పర్సనల్ మేనేజర్ అన్సారీ, అకాడమీ ప్రిన్సిపాల్ ఎంవై. దానం తదితరులు పాల్గొన్నారు.

**ఏపికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు :**

రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ ఆస్తులు పంపిణీపై సుప్రీంకోర్టు రాష్ట్రానికి అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. ఈ తీర్పుకు అనుగుణంగా త్వరలో ఏర్పాటు కానున్న బోర్డు సంస్థ ఆస్తులను ఇరు రాష్ట్రాలకు పంచే విషయమై నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం సంస్థ నష్టాలు సుమారు రూ.100 కోట్లు వరకు తగ్గాయని చెప్పారు. ఉద్యోగులు సిబ్బంది. జీతాలు పెంచినప్పటికీ సంస్థ నష్టాలు తగ్గడానికి కారణంగా విప్లవాత్మకమైన మార్పులేనని తెలిపారు.

# ఏజెన్సీలకు వెళ్లే ఉద్యోగులకు వరాలు



**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసేందుకు ముందుకొచ్చే ఉద్యోగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉద్యోగస్తులెవరూ బదిలీలను భారంగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజల సంతృప్తి గీటురాళ్లుగా ఉద్యోగుల బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై సీఎం మంగళవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, వివిధ జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ప్రభుత్వం ప్రతి ఉద్యోగితో పని చేయించుకోక తప్పదని, క్రమశిక్షణ, బాధ్యత మరచిన ఉద్యోగులను పక్కనబెట్టడం కూడా అవసరమేనన్నారు. ఉద్యోగులందరూ సమానమేనని, అందరినీ సమ దృష్టితో చూస్తూ బదిలీ మార్గదర్శకాలను ఖచ్చితంగా అనుసరించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేయడానికి స్వచ్ఛందంగా ముదకొచ్చే వారికి ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వారికి ప్రత్యేక ప్రోత్సహకాలు అందించాలని సూచించారు. రకరకాల వత్తిళ్లతో ఇష్టానుసారం బదిలీలు చేస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని, జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. బదిలీ ప్రక్రియలో కలెక్టర్లు, మంత్రుల మధ్య ఎక్కడా అభిప్రాయభేదాలు ఉండరాదన్నారు.

కలెక్టర్లు, కార్య దర్శులు, మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ఈ రెండు రోజులు పనిచేసి బెస్ట్ టీమ్స్ ఎంపికపై దృష్టి పెట్టాలన్నారు. అన్ని శాఖల్లో బదిలీలను పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ పనులు ఇప్పటికే ప్రారంభమైన దృష్ట్యా ఆ శాఖ తప్పించి మరే శాఖకు మినహాయింపు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. బదిలీ ప్రక్రియను ఇంతవరకు చేపట్టని ఆరోగ్య శాఖ, మరో రెండు రోజులు గడువు అడుగుతున్న విద్యాశాఖ తక్షణం బదిలీ ప్రక్రియను చేపట్టి అనుకున్న గడువులోగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖల్లో బదిలీలను ఆగష్టులో ఆరంభించి పూర్తి చేస్తామని తెలిపారు. ఒకసారి బదిలీ జరిగితే మూడేళ్ళు తమను ఎవరూ ముట్టుకోరని ఉద్యోగులు భావించ రాదని, సక్రమంగా విధులు నిర్వర్తించని వారిని ఎపుడైనా, ఎక్కడికైనా బదిలీ చేసే హక్కు ప్రభుత్వానికి ఉంటుందని సమీక్షలో పాల్గొన్న ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు.

పర్యాటక ప్రాంతంగా..

# కొండవీటి కోట

- నవంబర్ లేదా డిసెంబర్‌లో ఉత్సవాలు
- వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడి

**రాజధాని ప్రతినిధి,గుంటూరు :** కొండవీడు కోటను దేశంలోనే ఉత్తమ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కొండవీడు మెగా ప్రాజెక్టు నిర్మాణ పనులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశపు మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది.





ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే రూ.40 కోట్లతో ఘాట్‌రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామని, అదనంగా మరో రూ.15 కోట్లు మంజూరుకు అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయ స్థాయి జూ పార్కు, ఫైవ్‌స్టార్ రిసార్ట్స్ నిర్మాణాలు చేపట్టేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందిం చామని అన్నారు. నవంబర్ లేక డిసెంబర్‌లలో కొండవీటి ఉత్సవాలను నిర్వహిస్తామని మంత్రి చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న ఇస్కాన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమకు 81.03 ఎకరాలను కేటాయించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ మీ కార్యాచరణ ప్రణాళికను అందిస్తే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దేవా దాయ శాఖ ఏసీ శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి, శివాలయాల అభివృద్ధికి రూ.కోటి 10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.వి.రాఘవేంద్రరావు మాట్లాడుతూ సెప్టెంబర్ చివరికి ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పగా, ఆగస్టు చివరికే పూర్తిచేయాలని మంత్రి సూచించారు. అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఫారెస్టు (ఏపీసీసీఎఫ్) మాట్లాడుతూ కొండవీడు రిజర్వు ఫారెస్టులో 5202 హెక్టార్ల అటవీ భూములు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 873.81 హెక్టార్లను డీఫారెస్టు చేయడానికి అనుమతులు కోరినట్లు వెల్లడించారు. మంత్రి పుల్లారావు మాట్లాడుతూ అన్ని శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులతో జూలై మొదటి వారంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే, జిల్లా రెవెన్యూ అధికారి కె.నాగబాబు, టూరిజం విభాగం ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, పీఆర్ ఎస్ఈ జి.జయరాజ్, విద్యుత్ ఎస్ఈ జమ మోహనరావు, జిల్లా అటవీ శాఖాధి కారులు కె.మోహనరావు (టెరిటోరియల్), పి.రామ మోహనరావు (సోషల్ ఫారెస్టు), పురావస్తు శాఖాధికారి దీపక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం చంద్రబాబు, జాన్‌భాషా(ఎడమవైపు), జియా వుద్దీన్(కుడివైపు), ముస్లిం మత పెద్దలు

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గుంటూరులోని సన్నిధి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు, స్పీకర్ కోడెల, హోం మంత్రి చినరాజప్ప ముస్లిం పెద్దలు గుంటూరులోని జీటీరోడ్డులో గల సన్నిధి కన్వెన్షన్ హాలులో శుక్రవారం రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ దువా (ప్రార్ధన) నిర్వహించి ముస్లింలతో ఉపవాస దీక్షను విరమింపచేశారు. ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి రూ.710 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ముస్లిం మత పెద్ద ఇమామ్‌లకు రూ.5వేలు,మౌజన్‌లకు రూ.3వేలు వేతనాలు ఇస్తున్నది. తమ ప్రభుత్వమేనన్నారు. రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందేలా ముస్లింలందరూ ప్రత్యేక ప్రార్ధనలు చేయాలన్నారు. ఎంపీ గల్లా జయదేవ్, విజయవాడ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు ప్రత్తిపాటి, రావెల, పల్లె రఘునాధ రెడ్డి, పరిటాల సునీత, మృణాళిని, ఎమ్మేల్యేలు మోదుగుల, శ్రావణ్ కుమార్, కొమ్మాలపాటి, చాంద్‌బాషా, రాష్ట్ర మహిళ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే, టీడీపీ నాయకులు జియా వుద్దీన్, మద్దాళి గిరి, హిదాయత్, మతపెద్దలు, ఉపవాస దీక్షా పలువురు పాల్గొన్నారు.

## కోస్తాంధ్రకు వర్షాలు !



**విశాఖపట్నం :** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బలమైన ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అది అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దక్షిణ కోస్తాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు... ఉత్తర కోస్తాలోనూ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి పశ్చిమ దిశగా గంటకు 45 నుంచి 50 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు విస్తాయని చెప్పింది. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

### కృష్ణా విశ్వ విద్యాలయంలో..

# 'వెట్టి' చాకిరి



**జి.వి.ఆర్. ప్రసాద్, రా.వా ప్రతినిధి, మచిలీపట్నం :** మౌళిక సదు పా యాలు లేకున్నా కార్యకలాపాలు సాగిస్తున్న విశ్వ విద్యాలయం. అద్దె భవనాల్లో ఉంటూ ఆడంబరంగా కార్యక్రమాలు నిర్వ హించడం ఈ విశ్వ విద్యాలయం ప్రత్యేకత. తాము సురక్షితంగా ఉంటూ కిందిస్థాయి సిబ్బంది క్షేమాన్ని పట్టించు కోకపోవడం ఇక్కడ అధికారులకే చెల్లింది. అదే కృష్ణా విశ్వ విద్యాలయం. వెట్టి చాకిరి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు పోతుంటే కృష్ణా విశ్వ విద్యాలయంలో మాత్రం వెట్టిచాకిరి చట్టబద్ధం చేసినట్లుగా కొనసాగిస్తున్నారు. డెయిలీ లేబర్ పేరుతో 200 రూపాయలిచ్చి 8 గంటల పాటు పని చేయిస్తుండటం యూని వర్శిటి అధికారులకే చెల్లింది. ఇంత కంటే దారుణం మరొకటి ఉంటుందా?

**ప్రోత్సహిస్తున్న అధికారులు...**

డెయిలీ లేబర్.. అదేనండి రోజువారి కూలీల పేరుతో యూనివర్శిటిలో 15 మందితో పని చేయించుకుంటున్నారు. రిజిస్ట్రారు కార్యాలయం, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం, క్యాంపస్ కాలేజీ కార్యాలయం, లైబ్రరీ, ఎన్ఎస్ఎస్ విభాగాలలో డెయిలీ లేబర్ పేరుతో అధికారులు పని చేయించుకుంటున్నారు. ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పని చేయించుకుంటూ వీరికి చెల్లించేది కేవలం 200 రూపాయలు. యూనివర్సిటిలో ఉపకులపతి తరువాత రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌లే ఉన్నతాధి కారులు రోజువారీ వేతనంతో పనిచేయించు కునేది వీరి కార్యా లయాల్లోనే అంటే దీనిని ప్రోత్సహిస్తున్నది అధికారులే అనడంలో సందేహం లేదనుకుంటా. వీరికి సంబంధించిన ఫైలుపై సంతకాలు పెట్టేది వీసీనే. ఈ వెట్టి గురించి తెలుసని గట్టిగా చెప్పొచ్చు.

**జిల్లా వేజ్‌బోర్డు ఆదేశాలు బేఖాతర్ ...**



రూ.350 ఇవ్వాలని జిల్లా వేజ్‌బోర్డు ఆదేశాల కాపీ



రూ.200/- చెల్లించేలా కెయు ఓచర్

జిల్లా వేతన కమిటీ ఆదేశాలను యూనివర్శిటి అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. ప్రతి ఏడాది జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వేజ్‌బోర్డు సమావేశమై అప్పటి నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా రోజువారీ వేతనాన్ని నిర్ణయిస్తారు. ఆ వేతనాన్ని చెల్లించాలని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నూజివీడు ట్రిపుల్ ఐటిలకు సర్క్యులర్ పంపుతుంటే వారు అమలు చేస్తున్నారు. అయితే కృష్ణా యూనివర్శిటి అధికారులకు మాత్రం ఆ ఆదేశాలు కనిపించడం లేదు. యూనివర్శిటి ఏర్పాటు అయిన తరువాత ఇప్పటి వరకు జిల్లా వేజ్‌బోర్డు ఆదేశాలను అమలు చేసిన చరిత్ర లేదని తెలుస్తోంది. అంటే దిక్కార ధోరణి ప్రదర్శించడమేగా. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేవారు లేరా.. వెళితే ఏం జరుగుతుంది.. యూనివర్శిటి అధికారులకు అసలు మానవత్వం ఉందా..?

**రెండొందలతో 8 గంటల పని....**

ఇచ్చేది రెండొందలు.. పని చేయించుకునేది ఎనిమిది గంటలు పైనే.. కానీ ఓచర్ మీద మాత్రం ఆరు గంటలే ఉంటుంది. అంటే యూనివర్శిటి అధికారులు చీటింగ్ చేస్తున్నట్లు కాదా. జిల్లా వేజ్‌బోర్డు ఆదేశాల ప్రకారం కనీస వేతనం 350 రూపాయలు చెల్లించాలి. ఇక్కడ చెల్లించేది మాత్రం 200 రూపాయలు అంటే శ్రమ దోపిడియేగా. పనిచేస్తున్న వారికి చెల్లించేది ప్రభుత్వ సొమ్మేగా మరి.. వీరికొచ్చిన బాధేంటి? కందిపప్పు, మినపప్పు కేజీ 200 రూపాయలకు పైగానే. అల్లం, ఉల్లిపాయలు, మిర్చి, టమాటాల ధరలు కేజికి 50 రూపాయలకు పైమాటే. ఎప్పుడు పెరుగుతాయో, తగ్గుతాయో ఎవరికీ తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్శిటి ఇచ్చే 200 రూపాయలు ఏ మూలకు సరిపోతాయి? కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి? విసితో సహా ముగ్గురు ప్రొఫెసర్లు నెలకు లక్ష రూపాయలకు పైగా జీతం పొందుతుంటే 25 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు 60 వేల నుండి 80 వేల వరకు నెలజీతం పొందుతున్నారు. నెల నెలా పెన్షన్ పొందుతూ యూనివర్శిటిలో పనిచేస్తున్న అరడజను మంది విశ్రాంత ఉద్యోగులు సైతం 25 వేల నుండి 40 వేల జీతాన్ని నెలనెలా తీసుకుంటూ కూడా కిందిస్థాయి ఉద్యోగుల గురించి ఆలోచించడం లేదంటే దీనిని వివక్ష అంటారా ? చిన్నచూపు అంటారా? ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం ఇటీవల 12 శాతం మేర జీతాలు పెరగగా డెయిలీ వేజ్ కార్మికుల గురించి పైన పేర్కొన్న వారెవరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఇంత ఘోరమైన పరిస్థితి రాష్ట్రంలోని మరే యూనివర్సిటిలో లేదు. పక్కనే ఉన్న నాగార్జున విశ్వ విద్యాలయంలో సైతం డెయిలీ వేజ్ కార్మికులకు రోజుకు 350 రూపాయలు చెల్లిస్తున్నారు. అవేవి ఇక్కడ అధికారులకు పట్టకపోవడం వీరి ఆసమర్ధత పనితీరుకు నిదర్శనం.

**ఉన్నత విద్యావంతులు కూలీలే...**

కృష్ణా విశ్వ విద్యాలయంలో పని చేస్తున్న డెయిలీ వేజ్ సిబ్బందిలో ఉన్నత విద్యావంతులు ఉన్నట్లు తెలుస్తోంది. ఎం.సి.ఏ. బిఈడి చదివిన వారు సైతం డెయిలీ వేజ్‌గా 200 రూపాయల వేతనంతో పని చేయిస్తుండటం ఈ యూనివర్సిటీ అధికారులకే చెల్లింది. జిల్లా వేజ్‌బోర్డు నిర్ణయాల ప్రకారం డెయిలీ వేజ్‌లో మూడు రకాల కేటగిరిలుగా నిర్ణయించారు.

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోచుకోక పోవడం, రోజురోజుకు విద్యావంతులు, నిరుద్యోగులు పెరు గుతుం డటంతో తప్పనిసరి పరిస్థితుల్లో యువత ఏదో ఒక ఉద్యోగం అంటూ సరిపెట్టు కుంటు న్నారు. దీనిని ప్రైవేటు కంపెనీలు తమకు అను కూలంగా మార్చు కుంటుంటే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే యూనివర్శిటి అధికారులు సైతం అదే కోవలో ప్రయాణిస్తుండటం ఆందోళనకరం.

# తాత్కాలిక సచివాలయం ఉద్యోగులకు రైలు రాకపోకలు

- సెకండ్ ఏసీ,సీటింగ్‌కు రిజర్వేషన్ సౌకర్యం
- మంగళగిరిలో హాల్ట్ కోరుతున్న ఉద్యోగులు



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** హైదరాబాద్ నుంచి రాజధాని ప్రాంతానికి వచ్చే ఉద్యోగుల కోసం సికింద్రాబాద్ నుంచి విజయవాడకు ఏర్పాటు చేసిన సింగిల్ స్టాప్ సూపర్ ఫాస్ట్ ప్రత్యేక రైలు నుంచి రెగ్యులర్‌గా నడవనుంది. రాత్రి విజయవాడలో రైల్వే మంత్రి సురేష్ ప్రభు, ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని ప్రారంభించిన విషయంతెలిసిందే. ఈ రైలు బుధవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి విజయవాడకు రానుంది. ట్రైన్ నంబర్ 12796 సికింద్రాబాద్- విజయవాడ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.30 బయలు దేరి గుంటూరుఉ రైల్వేస్టేషన్‌కు 10.08 గంటలకు వచ్చి10.10 గంటలకు బయలుదేరి 11.00 గంటలకు విజయవాడ చేరు కుంటుంది. ట్రైన్ నంబర్ 12795 విజయవాడ-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విజయవాడలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి గుంటూరు రైల్వేస్టేషన్‌కు 6.18 గంటలకు వచ్చి 6.20 గంటలకు బయలుదేరి రాత్రి 11.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఆదివారం మినహా వారంలో ఆరురోజులు ఈ రైలు నడుస్తుంది. రెండు ఏసీ చైర్‌కారు బోగీలు, 10 సెకండ్ సీటింగ్ బోగీలు, రెండు ఎస్ఎల్ఆర్ కోచ్‌లతో రైలు నడుస్తుంది. ఏసీ చైర్ కారు, ఐదు బోగీలలో సెకండ్ సీటింగ్‌లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం, తత్కాల్ కోటా ఉంది.

**మంగళగిరి హాల్ట్‌తోనే ఉద్యోగులకు మరింత ప్రయోజనం**

రాజదాని ప్రాంతంలో విధులు నిర్వహించటానికి ఉద్యోగులకు ప్రత్యేకంగా ఏర్పటు చేసిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు మంగళగిరిలో హాల్ట్ ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు మరింత ప్రయోజనంగా ఉంటుంది. ముఖ్యంగా సచివాలయం ఉద్యోగులు గుంటూరు, విజయవాడ రైల్వేస్టేషన్‌ల నుంచి వెలగపూడికి చేరుకోవాలంటే నగరంలో ట్రాఫిక్ జాం ఇతర కారణాల వలన సూమారు గంట సమయం పడుతుండగా మంగళగిరి రైల్వేస్టేషన్ నుంచి పావుగంట నుంచి అర్ధగంటలోపై చేరుకునే అవకాశం ఉంది. రాష్ట్ర ముఖ్య కార్యాలయాలన్నీ గుంటూరు,



విజయవాడలతోపాటు మంగళగిరిలో పైతం ఏర్పాటు అవుతున్నందున ఇక్కడ హాల్ట్ కల్పించాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు కోరుతున్నారు. అదే విధంగా సూమారు 1200 సీటింగ్ కెపాసిటీ ఉన్న రైలులో ప్రయాణించే అవకాశం ఉండదు కాబట్టి డివిజను ముఖ్య రైల్వేస్టేషన్లు నల్గొండ, పిడుగురాళ్ళ ఇతర స్టేషన్‌లలో హాల్ట్ కల్పిస్తే ఆ ప్రాంతాల ప్రయాణికులు ప్రయాణించే అవకాశం కలుగుతుంది. గుంటూరు నుంచి సికింద్రాబాద్ చేరుకునేందుకు ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాప్‌లు లేకుండా 4.50 గంటల సమయం పడుతుండగా, పల్నాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎనిమి దిస్టాపుల్లో ఆగుతున్నా 4.50 గంటల సమయమే పడుతోంది. దీని వలన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపులు పెంచినా పెద్దగా జర్నీ సమయం పెరిగే అవకాశం లేదని పలువురు అంటున్నారు.

# ఆళ్వారు స్వామికి మరో అవార్డు



దాసరి ఆళ్వార్‌స్వామికి ఉత్తమ జర్నలిస్టు అవార్డును అందచేస్తున్న ప్రొఫెసర్ కె.ఎ రామచంద్రన్, ప్రెస్‌అకాడమి మాజీ ఛైర్మన్ పొత్తూరి వెంకటేశ్వరరావు, విశాలాంధ్రమాజీ ఎడిటర్ సి.రాఘువాచారి ప్రజాశక్తి సంపాదకులు పాటూరి.రామయ్య తదితరులు

**అనంతపురం:** సీనియర్ జర్నలిస్టు, వ్యవసాయ పరిశోధకుడు దాసరి ఆళ్వార్‌స్వామికి అరుదైన జర్నలిస్టు అవార్డు లభించింది. "బ్యాంకుల తీరుతో నష్టపోతున్న రైతులు" అనే పుస్తకం ఈ అవార్డుకు ఎంపికైనట్లు న్యాయనిర్ణేతలు తెలిపారు. 'ప్రజాశక్తి' దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మారక 'ఉత్తమ జర్నలిస్టు 2016 అవార్డు' అళ్వారస్వామిని వరించింది.

కీ శే హనుమంతరావు 15వ వర్ధంతి సందర్భంగా అనంతపురం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో ఏర్పాటయిన కార్య క్రమంలో విజేతకు అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్ర సమాచార శాఖమంత్రి డాక్టర్ పల్లె రఘు నాధరెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేశారు. పలు అంశాలపై వేలకొలది రచనలు చేసిన అళ్వారస్వామిని మంత్రి అభినందిస్తూ రూ. 5,116 నగదు పారితోషికం అందజేశారు. అవార్డు ఎంపికలో ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ పొత్తూరి వెంకటేశ్వరరావు, విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి. రాఘువాచారి, నాగార్జున విశ్వ విద్యాలయం జర్నలిజం విభాగ అధిపతి డాక్టర్ జి. అనిత ఏకగ్రీవంగా ఆమోదించారు. 2015 అక్టోబరు 6న ఈ వ్యాసం 'ఆంధ్రప్రభ' దినపత్రిక ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమైంది. అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో కమిటీ కూడా హాజరైంది. ప్రొఫెసర్ కె.ఎ రామ చంద్రన్ అవార్డుతోపాటు రూ.10,000 నగదును అళ్వార్ స్వామికి ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆళ్వారుస్వామి రచనావిధానాలను వివరించారు. వ్యవసాయరంగంలో ఆళ్వారస్వామి రాసినన్ని పుస్తకాలు ఎవరూ రాయలేదని రాఘువాచారి ప్రశంసించారు.

వ్యవసాయంలో ఒడిదుడుకులను పత్రికా ముఖంగా వెలువరించడంలో ఆయన సిద్ధ హస్తులన్నారు. ఊపిరి ఉన్నంతవరకు జర్నలిజం కొనసాగుతూ, వ్యవసాయరంగం అభివృద్ధికి కృషి చేస్తానని అవార్డు గ్రహీత ఆళ్వారుస్వామి ప్రకటించగానే సభికులు కరతాళధ్వనులు మిన్నంటాయి. 'ప్రజాశక్తి' సంపాదకులు పాటూరి రామయ్య సభకు అధ్యక్షత వహించారు.

# ఉండవల్లిపై ఉక్కుపాదం !

- రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల తొలగింపు
- అటవీ శాఖ తొలి దశ సర్వేలో 2,500 కుటుంబాల తరలింపునకు ప్రతిపాదనలు
- సర్కారు కుయుక్తులతో జనం గగ్గోలు





**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** భూసమీకరణను వ్యతిరేకించిన తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాజధాని అభివృద్ధి సాకుతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఆ గ్రామం ఉనికిని ప్రశ్నార్ధకం చేసేలా ఉన్నాయి. రాజధానిగా అమరావతిని ప్రకటించిన తొలినాళ్లలో టూరిజం హబ్‌గా ఉండవల్లి ప్రాంతాన్ని తీర్చిదిద్దు తామని ప్రభుత్వం ప్రకటించింది.

భూ సమీకరణను ఆ గ్రామం ప్రతిఘటించడంతో ప్రభుత్వం ఆ తరువాత ఆ గ్రామానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటోంది. రవాణాకు మౌలిక వసతులు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఉండవల్లిని ఎంపిక చేసింది. ఇందులో పెద్దకుట్ర దాగి ఉందనేది స్థానికుల వాదన. టూరిజం ప్రాంతం అయితే అక్కడ భూముల ధరలు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అదే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రవాణా, విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు ఎంపిక చేస్తే ఆ ప్రాంతానికి పెద్దగా క్రేజ్ ఉండదు. దీంతో అక్కడ భూముల ధరలు పడిపోవడంతో పాటు ప్రజల జీవననంపై తీవ్ర ప్రభావం పడి వలసలు పోవాల్సిన పరిస్థితులు దాపురిస్తాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాజధాని ప్రకటనకు ముందే కోట్లు పలికిన భూములు..**

రాజధాని ప్రకటన రాకముందు నుంచే ఉండవల్లి ప్రాంతంలో భూముల ధరలు కోట్ల రూపాయలు పలికాయి.ఇప్పుడు మాత్రం రాజధాని నిర్మాణం చేపట్టకముందే ఉండవల్లిలోని నివాసాలపై ప్రభావం పడుతోంది. రాజధాని శంకుస్థాపన ఏర్పాట్లలో భాగంగా గతేడాది రోడ్ల విస్తరణ చేపట్టిన ప్రభుత్వం ఉండవల్లిలో పెద్దఎత్తున ఇళ్లు తొలగించింది. విజయవాడ- ఉండవల్లి-తుళ్లూరు-అమరావతి రోడ్ల విస్తరణకు ఇప్పటికే చాలా మంది నివాసాలు కోల్పోవాల్సి వచ్చింది. ఉండవల్లి వద్ద రోడ్డును మరింత విస్తరించడంతో ఇళ్లు, దుకాణాలు, చిన్నపాటి బడ్డీకొట్లను తొలగించారు. రాజధాని నిర్మాణం, అటవీ భూముల అవసరం సాకుతో 50 ఏళ్లకు పూర్వం నుంచి ఇక్కడే నివాసం ఉంటున్న ప్రజలను తరిమేసే ప్రయత్నాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అక్కడి ప్రజలను పొమ్మనకుండా పొగపెట్టినట్టు ఇబ్బందులు పెడితే భూములైనా ఇస్తారు, ఊరైనా వదిలిపోతారు అన్నట్టు ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని పలువురు గగ్గోలు పెడుతున్నారు. అయినా రోడ్ల విస్తరణ తదితర కారణాతో ఇళ్ల తొలగింపు ప్రక్రియ కొనసాగూతూనేఉంది. రాజధాని పేరుతో పొలాలు గుంజుకున్న సర్కారు ఇప్పుడు ఇళ్లనూ కూల్చేసి ప్రజలను రోడ్డున పడేస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

**అటవీ భూములు బూచి...**

అమరావతి రాజధాని కోసం సుమారు 50 వేల ఎకరాల అటవీ భూములను డీఫారెస్ట్ కోసం కేంద్రానికి రాష్ట్ర సర్కారు లేఖ రాయడంతో దాని ప్రభావం కూడా ఉండవల్లిపై పడనుంది. ఉండవల్లి సమీప ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ పాచిక పారకపోవడంతో ఇక్కడ అటవీ భూములను తీసుకోవడమే మేలని ప్రభుత్వం భావిస్తోంది.అటవీ శాఖ అధికారులు ఉండవల్లితో పాటు తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నులకపేట, ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్ ప్రాంతాల్లో కొన్ని ఇళ్లు అటవీ భూ ములపరిధిలోకి వస్తాయని గుర్తించారు.

ఈ ప్రాంతాల్లో ఉన్న సుమారు 30వేల ఇళ్లలో దాదాపు 10వేలకు పైగా ఇళ్లను అటవీ ప్రాంతం నుంచి కదిలించాల్సి ఉంటుందని సీఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ఇప్పటికే ఒక పర్యాయం సర్వే నిర్వహించిన అటవీ శాఖ అధికారులు ఉండవల్లి, ప్రకాష్ నగర్, డోలాస్‌నగర్, నులకపేట ప్రాంతాల్లోని అటవీ భూముల్లో 2,500 ఇళ్లు ఉన్నాయని నిర్ధారించారు.

వాటితో పాటు మరో ఎనిమిది వేల ఇళ్లను కూడా వేర్వేరు కారణాలు చూపి ఇక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని చెబుతున్నారు.కృష్ణానదికి ఆనుకుని విజయవాడ - చెన్నై జాతీయ రహదారి చెంతనే ఉన్న ఉండవల్లి గ్రామం రైల్వేస్టేషన్‌కు కూడా కూతవేటు దూరంలో ఉండటంతో ప్రభుత్వ యంత్రాంగం ఈ గ్రామాన్ని ఖాళీ చేయించేలా పథకం రచన చేస్తోంది.


## విలేకర్లు , అడ్వర్‌టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు

# కావలెను

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలోని రాయపూడి నుంచి వెలువడుతున్న 'రాజధాని వార్తలు' తొలి తెలుగు మల్టీకలర్ వారపత్రికకు విలేకర్లు, అడ్వర్‌టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. వివరములకు సంప్రదించగలరు.

రాజధాని వార్తలు

E- mail : info@rajadhanivartalu.com
www.rajadhanivartalu.com
FB: facebook.com/rajadhaniv

cell
94406 62699,
96768 44442


Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622.